రచన

విశ్వవీణ

రజని గేయ నాటికలు

బాలాంత్రపు
రజనీకాంతరావు

ముఖపత్ర చిత్రము
'బుజ్జాయి'

తొలికూర్పు
1000
ప్రతులు

మూల్యము :
3 రూపాయలు
సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి.

ప్రకాశకులు :
బాలాంత్రపు సుభద్రాదేవి,
చంద్రకుమార ప్రచురణలు,
3-6-490, 'పూర్ణానుగ్రహ',
హార్దికర్‌బాగ్, హిమాయత్‌నగర్, హైదరాబాద్.

ముద్రణము :
డిసెంబర్ 1964
నావెల్ ప్రింటర్స్
హైదరాబాదు.

కృతి సమర్పణము

అంకితం:

శ్రీ దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రిగారికి

నమో విశ్వస్య గురవే। గురవే జన్మన స్తథా
కవితాయా గురూ వందే। వేంకటపార్వతీశ్వరా!

ఏకాంత సేవలో నిజ
లోకేశాయత్త భక్తి లోలత్వంబున్
నా కందిచ్చిన నవకవి
తా కులపతి యుగళ కావ్యధార వరింతున్!

ఎందరో విద్యా గురువరు
లెందరో సాహిత్య మర్మ హితబోధకు లా
యందరిలో లక్ష్మీకాం
తుం దలచి ఘటింతు కేలుదోయిం దలపై!

వెలి గసరుచు లో గొసరుచు
పలుకాడకె క్రియల గరపు బహువిధపాఠ
మ్ముల యొజ్జ వేంకటేశ్వర
కళామయుడు స్వర్గవాసి కాటురి దలతున్.

గేయ నాటికల వాగ్దేవి నర్చించిన
శివశంకరుని వచస్సిద్ధి నెంచి
ఆంధ్రప్రశస్తి రమ్యాలోకదీప్తిలో
పొదివి యెత్తిన రాయప్రోలు పొగడి,
కావేరి సరసహృత్కల్యాణవేది దే
వేరిగా గన్న యబ్బూరి దలచి,
వాగు కిన్నెరసాని వలపులో రససుధా
ధునియైన విశ్వనాథుని గణించి,
ప్రకృతి పానశాల సుకుమార శిల్పియౌ
రామిరెడ్డి కైత రక్తు లెరిగి
గుండె లెగసి పల్కు కోమల నిశిత భా
వముల నల్లు నాయని మది నిల్పి,

బసవరాజును, నండూరి, బాపిరాజు
నెన్ని, యిందరి కైతల యింపు తొలుత
కైపు నింపగ వింటి నే కంఠమందు
అట్టి యూర్వశీ ప్రియు గాన మభినుతింతు!

తన భావ వనవాటి ననలెత్త చివురొత్త
రేలు పవళ్లల్ల కాల మొకటె!
తన వాక్సుధావల్లరిని తోగ నెద లూగ
వీథి, లోగిలి, సభావేది యొకటె!
తన స్నేహకళిక వెల్గున మున్గ, తనియంగ
కవులు, పామరులు, సచివులు నొకటె!
తన గీతిఝరుల తీయన దోప, తలలూప
వాయువీథి, సినీ యవనిక యొకటె!

తాను ముట్టని నిత్య నూతనత లేదు;
తన్ను తాకని నవ మహోద్యమము లేదు;
తలపులో పల్కులో ఉదాత్తతకు గురుడు
కేవల కవీశ్వరుండె మా కృష్ణశాస్త్రి!

శ్రీఖండ మృదు ధూమ రేఖా పరివృత
శారదాలయ చంద్రశాలయందు,
హిమతోయ ఘనసార కమనీయ పరిమళాం
చిత వితర్దిక సుఖాసీనుడవయి,
నన్నపార్యాది నానా పుగాకవినాథ
శిల్పతత్త్వ విచార కల్పనముల,
నవ యుగాధిపతి మానవుకేతనము దిక్కు
దిక్కుల కెగిరించు తీయ కలల

నడుమ - నొకనాడు ననుపిల్చి అడిగినావు!
"అల్లుడవు నీవు, నాదు మేనల్లు రందు
అనుగవు గదోయి మేల్పాట లల్లి పాడ
రజని, నీ గొంతు నా గుండె నిజము నమ్ము!

నాదు పాట లెన్నెన్ని క్రొన్ననల మూట
లాయె నోయి నీ నోట - నీ గేయనాటి
కలను నా కంకిత మీ్మయగదె" - అటంచు!
ఇష్ట మెంతో అల్లునిపయి కృష్ణశాస్త్రి!

తొలి కృతి నాన్నా మామ
య్యల కంకిత మిచ్చి, తాతయకు, అమ్మకు నా
మలి కృతుల నిచ్చినాడ, ని
వలి కృతి నీకిత్తు మామ, వలపుంచగదే!

శ్రవణమె ధ్రువతారకయై
నవకవితాదర్శులైన నాన్నకు నీకున్
రవితారక విశ్రుతమౌ
భవ దుఃఖయానంద కావ్యపథ దీపకమై!

శ్రవణము హరితారక, యా
శ్రవణము నాన్నకును నీకు శశితారక, యా
శ్రవణము రవితారకయై
కవిగా నాకొసగె గేయ కవితాభిరతిన్!

పది రెండేడుల ప్రాయ
మ్మది విద్యానంద పుస్తకాలయ, మందే
నెదియో పాడగ నన్నెద
కదుముక రాల్చితి గదయ్య ఆర్ద్రాశ్రువులన్!

నా శీర్షంబున నాడు రాలినవి ఆనందాశ్రులో, లేక, నీ
ఆశీరక్షతలో, తదాది, నవగేయ చ్ఛందముల్ కల్పనా
ప్రాశస్త్యంబును రాగబంధమును శిల్పప్రౌఢి దీపింపగా
ఆశాశల్ ప్రసరించె మామక వినూత్నానంద సంగీతమై!

రాగరంజితాలు భావనా గరుద్యుతాలుగా
ఆగరాని అమృతధారలౌ నయాగరాలుగా
నీ వెంట నెన్ని పూటలు నే వింటి నెన్ని మాటలు
నెమ్మది కదిలే మనికి బరువు వదలు తీయ పాటలు!

నీ తలపు వెలుగు కప్రము,
నీ యెదద స్నేహ సుధాపూర్ణ కనకసౌధ వప్రము
నీ యెలుగు శ్రావణాభ్రము,
అచంచల కారుణ్యా చంచలాప్త జలద శుభ్రము!

మామ! కృష్ణ! నీకు మామక కృతికన్య
విశ్వవీణ యనెడి వేణు వొసగి,
ప్రకృతి మోహనముగ పల్కించుకొనుమని
అంటి, మామ మామ నైతి నంటి!

—రజని

శ్రీ ర స్తు

ఆ శీ ర్వా ద ము

శ్రీమంతుని, సరసవచ శ్శ్రీమంతుని, సాధులోక సేవాదీక్షా
సామంతుని, కావ్యకళా ధీమంతుని, కృష్ణశాస్త్రి దీవింతునిదే!

తన పితామహు గాన గంధర్వ కళను,
స్వీయ జనకుని నవ్యకవిత్వ కళను,
బట్టి, భారతి కారతిఁ బట్టినట్టి
చిన్ని కొమరుని రజని నాశీర్వదింతు.

అనఘు లుదారులు, విద్యా
వినయులు, సమవర్తనులు, వివేకమతులు, స
జ్జనులు, సుమంత్రులు, నభివం
దనీయులౌరసికవర సదస్యుల నెంతున్.

కృతికర్త? - రజనికాంతుఁడె,
కృతిభర్త? - కవీంద్రచంద్రుఁడే కృష్ణుండే,
కృతికన్య? - విశ్వవీణయె,
ప్రతి గృహమున మ్రోఁగునదియె? ప్రణవాక్షరమై!

ఇది సువర్ణ విశిష్టయే యన్నవారికి
పావన పదభద్ర భాగ్యసిద్ధి,
ఇది మనోహర దేశియే యన్నవారికి
బహుళ పదార్థ సంపత్సమృద్ధి,
ఇది పవిత్ర సుజాతియే యన్నవారికి
తరతర భావ గోత్ర ప్రసిద్ధి,
ఇది పూర్వ సంస్కృతియే యన్నవారికి
అభ్యుదయ పరంపరాభివృద్ధి
సిద్ధిరస్తని విబుధు లాశీర్వదింప,
చిరతరాయురారోగ్య సంసిద్ధిరస్తు
మృదువచస్సిద్ధిరస్తని మేలువలికి,
కృతి గ్రహీతకు, కర్త కక్షుతల నిడుదు.

పలుకు వెలఁది దలఁచి, పదసమృద్ధిఁ గనుండు,
సిరిని గొల్చి, యర్థసిద్ధిఁ గనుఁడు,
కొండపట్టిఁ దలఁచి గోత్రవృద్ధిఁ గనుండు !
కృష్ణ! రజని ! కావ్యకీర్తిఁ గనుఁడు !

పట్టంపుదేవుల పల్లికి మునుమున్న
పరమాత్మ మురళి వ్రేపల్లె మ్రోఁగె
నంద యశో దాభినవ లాలనకు మున్న
యదుపతి వంశ మాశాళ మ్రోఁగె
గోపాల కానంద గోష్ఠికి మునుమున్న
ప్రభుని పిల్లనగ్రోవి ప్రకృతి మ్రోఁగె
చిద్రూప గోవర్ధనాద్రికి మునుమున్న
వరదు వేణువు క్షీర వార్ధి మ్రోఁగె
జగములకు మున్న, ప్రణవ నిస్వనికి మున్న
విశ్వవిభు విశ్వమోహన వీణ మ్రోఁగె—
వినుఁడు ! కృష్ణుఁడే మ్రోగించుకొనెడు ! తనకు
వేణువాయెనె, అల్లుని విశ్వవీణ !

రజనీశు "విశ్వవీణా" ప్రజనిత నవవర్ణ సుస్వర శ్రుతిరవముల్
వ్రజవనితా గీతికలటు నిజహృదిఁ గరఁగింపఁబోలునే కృష్ణునకున్.

నవరాగ కీర్తనమ్ములు నవభావ కవిత్వ కల్పనమ్ములు వెలయన్
నవమధుర విశ్వవీణా రవము నినుపు ఘూనభోంతరమ్ముల కృష్ణా!

ప్రాభవాత్మయందు, ప్రణయ శ్రుతులయందు,
ముగ్ధ జీవభావ మురళి మ్రోఁగి,
సరస భక్తిభావ సంకీర్తనములతో
విశ్వవీణ మేళవించుఁగాక !

హైదరాబాదు
25-12-1964

కవిరాజహంస - కవికులాలంకార
బాలాంత్రపు వేంకటరావు

ఉపోద్ఘాతము   సంగీత నాటకాలు

(1959, ఆంధ్రప్రదేశ్ సంగీత నృత్యనాటకోత్సవాలకు ప్రత్యేక సంచికగా వెలువడిన నాట్యకళలో వెనుక ప్రచురితమైన - ఈ గ్రంథకర్త వ్యాసము-ఈ గేయనాటికల సంపుటానికి ఉపోద్ఘాతముగా ఉపకరించగలదు.)

నాటకాలలో సంగీతం ఉండాలా అక్కరలేదా, నాటకాలలో పద్యాలు ఉండాలా అక్కరలేదా? పద్యాలు సంగీతంతో పాడవచ్చునా కూడదా అనే వివాదాలతో ప్రమేయం ఏమాత్రమూలేని - పూర్తి సంగీత నాటకాలు ఈ వ్యాసంలోని ప్రసక్తాంశం. నాటకం రచన ఎంతో బాగుంది, నటకులు ఎంతో ప్రతిభతో నటించి, నిర్వాహకులు, ఎంతో దక్షతతో నిర్వహిస్తేనే ఏనాటకమైనా ప్రేక్షకుల మన్నన పొందడం సాధ్యమవుతుంది. ఇన్నీ కలిసివచ్చినప్పుడు అటువంటి వచన నాటకానికా, లేక సంగీత నాటకానికా ప్రేక్షకులు ఎక్కువగా రంజిల్లేది అని అడిగితే, ఈనాటికికూడా కాస్తోకూస్తో సంగీతంవుంటే (అది నిర్దుష్టంగా నిర్వహింపబడినపుడు) వచన నాటికకంటే సంగీతం ఉన్న నాటకానికే త్వరగా రంజన కలుగుతుంది అని చెప్పాలి.

ప్రాచీన నాటక చరిత్ర పరిశీలిస్తే చరిత్రాతీతుడైన భరతముని నాటినుంచీ కూడా సంగీత ప్రసక్తి మేళతాళ ప్రశంసా నాటక లక్షణంలో విధిగా వస్తూన్నవి. 'అవస్థానుకృతియే నాట్యం' అన్నారు గాని, నాట్యం యథాజీవిత మని గాని, నాటకం జీవితానికి ఛాయాపటవత్ ప్రతిబింబం అనిగాని అనుకోడానికి వీలులేదు. జీవిత యథార్థతనుంచి రసానందానుభూతిద్వారా ప్రేక్షక మానసాలకు ఉడ్డీనత కలిగించేదే ఉత్తమ కళ. సంగీత నాటకంవల్ల అది త్వరగా సిద్ధిస్తుంది.

పాశ్చాత్య దేశాల్లో ఆపెరాలు అంటే సంగీత నాటకాలూ, బ్యాలేలు అంటే నృత్య నాటకాలూ - రెండు ప్రక్రియలూ స్వతంత్రంగా ఒకదానితో ఒకటి - ప్రమేయం లేకుండా వర్ధిల్లాయి. 17 వ శతాబ్ది ప్రాంతంలో ఇటలీలో ఆపెరాలు ప్రారంభించేదాకా పాశ్చాత్య దేశాల్లో సంగీత నాటకాలు పుట్టలేదు. భారతదేశంలో 12 వ శతాబ్ది ప్రారంభంలో వెలసిన జయదేవునిద్వారా మన

దేశానికి అంతటికీ అన్ని ప్రాంతాలకీ ఈనాటికీ ఆరాధ్యమైన గీతగోవిందం అనే మహాసంగీత నాటకం లభించింది. 'పద్మావతీ చరణ చారణ చక్రవర్తి' అన్న జయదేవుని ప్రజ్ఞాత్మకమైన బిరుదాన్నిబట్టి, అది వట్టి సంగీత నాటకమే కాకుండా నృత్య నాటకం అనికూడా గ్రహించవచ్చు. భరతనాట్య శాస్త్రానికీ, అలంకార శాస్త్రానికీ, గీతగోవిందం లక్ష్యపాత్రియమై నాటినుంచి నేటివరకూ పరమ ప్రామాణికమయింది. ఓఢ్ర వంగదేశాలలో సరిహద్దులలోగల కిందు బిల్వం, కేందులీ అని పిలవబడే జయదేవుని జన్మ గ్రామంలోను, పూరీ జగన్నాథంలోను, ఇంకా అనేక ఇతర క్షేత్రాలలోను, విష్ణుప్రీతికరములైన ఉత్సవ దినాలలో గీతగోవిందాన్ని తరతరాలుగా ప్రదర్శిస్తున్నవారు ఈనాటికీ ఉన్నారు.

12 వ శతాబ్ది మాట అటుంచి, క్రీస్తుకు పూర్వం సుమారు 10 వ శతాబ్ది నుంచి 4 వ శతాబ్దివరకూ ఎప్పటివాడో స్పష్టంగా తెలియని భరతాచార్యుని నాట్యశాస్త్రంలోనే నాటకాలలోని ప్రావేశికీ. నైష్క్రామికీ ధ్రువాగానాలు–మన తెలుగు యక్షగానాల్లో అనాదిగా వినవస్తూ, పాత్రలు ప్రవేశించేటప్పుడూ, నిష్క్రమించేటప్పుడూ గానంచేసే దరువులే అని పరిశోధకులు స్పష్టపరిచారు, దీనినిబట్టి, పాశ్చాత్య దేశాలలో ఆపెరాలు బయలుదేరడానికి సుమారు 20 శతాబ్దాలు ముందే మనదేశంలో సంగీత నాటకాలు సర్వలక్షణలక్షితాలై పరిఢవిల్లినట్లు తేటతెల్లమవుతోంది. అయితే, ఈనాటకాలను తొలిదశలో మన దేశంలోని వివిధ భాషాప్రాంతాలలో పల్లీజనులు, ఆటవికులు, కొండజాతులూ, తమ తమ ప్రాంతాలలో వెలసిన దైవతములను గురించిన పురాణగాథలతో వారి వారి భాషలలో ప్రదర్శిస్తూండేవారు. ఆయా నాటకములలోని గేయఫణితులను 15 వ శతాబ్దినుంచి అన్నమాచార్యులవంటి సాహిత్యపరులైన వాగ్గేయకారులు స్వీకరించి, సంకీర్తనములను పదాలను రచించే వరకు, ఈ యక్షగానాలు సాహిత్య పరిణతిలేక, గ్రామవినోదాలుగా మాత్రమే ఉంటూ వచ్చేవి. సుమారు 12, 13 శతాబ్దాలకు చెందిన రాజ కళింగగంగు వేములవాడ భీమకవి శాపంచేత రాజ్యభ్రష్టుడై, తిరగి రాజ్యప్రాప్తి పొందడానికి తోడుపడినవారు ఆ విధంగా గ్రామగ్రామమూ సంచారంచేసే భాగవత మేళాలవారే. అన్నమాచార్యులకు సమకాలికుడైన సాళ్వ నరసింహరాయలనే విద్యానగర చక్రవర్తి కూడా, సమ్మెట గురవరాజు అనే దుష్టసామంతుని దుండగాలను గురించి, అటువంటి భాగవత మేళమువారి నాటక ప్రదర్శనద్వారా తెలుసుకొని, ఆ తర్వాత

సైన్యాన్ని పంపి గురవరాజును దండించాడట. అంతేకాదు, సాళ్వ నరసింహ రాయలకు ప్రోలుగంటి చెన్నయ్య సౌభరి చరిత్రము అనే జక్కులకథ (యక్షగానము) రచించి అంకితమిచ్చాడు. ఆతర్వాత ఒక శతాబ్దానికి కందుకూరి రుద్రయ్య రచించిన సుగ్రీవ విజయ యక్షగానం వచ్చింది. ఓబయ్య మంత్రి రచించిన గరుడాచల యక్షగానము కూడా ఈ విధముగా పామర నాటక రంగమునుండి సాహిత్య పరుని గంటముచేత దిద్ది తీర్చబడినదే కనుక, సుమారు ఇదేకాలానికి చెందిఉండవచ్చు.

ఆంధ్రదేశాన్ని పాలించిన వేంగీ చాళుక్యుల మొదలు ఆయా రాజవంశాల కొలువుకూటాలలో సంగీతానికీ నాటకానికీ ఏపాటి గౌరవాదరాలుండేవో స్థూలంగా పరిశీలించి గ్రహించవచ్చు. వైదికధర్మావలంబియై బహు శ్రోత్రియంగా ధర్మాద్వైతస్థితికి పాటుపడినరాజనరేంద్రునికొలువులో రాజు, మంత్రిపురోహిత సేనాపతిదండనాయకదౌవారికమహా ప్రధానానంతసామంతవిలాసినీపరివృతుండై నట్లు, అపార శబ్దశాస్త్రపారగులైన వైయాకరణులు', వారి తర్వాత పౌరాణికులు ఆ వెనుక మహాకవులు, తార్కికులు, అయిన పిదప, వైణిక గాయకులు చిట్ట చివర పంక్తిలో ఉండినట్లు నన్నయగారి భారతాన్నిబట్టి తెలుస్తుంది. కాకతీయ సామ్రాజ్యంలో మట్టుకు గణపతిదేవ చక్రవర్తి కొలువులో సేనానియైన జాయప్ప నృత్తరత్నాకరము, గీత రత్నాకరము, రచించిన గాయకుడూ లక్షణకర్తా అయి ప్రసిద్ధి పొందినట్లు ఇటీవల పరిశోధకులు వెలువరించిన నృత్యరత్నాకరాన్నిబట్టి తెలుస్తోంది. గణపతిదేవునికి తన సమకాలికుడయిన దేవగిరి యాదవ రాజైన సింహణుడితో రాజకీయ స్పర్ధమాత్రమేగాక, కవిగాయకపోషణలో కూడా స్పర్ధ ఉండేది. సింహణుడి కొలువులో ఉండిన శార్ఙ్గదేవుడు సంగీత రత్నాకరం రచించాడు. అది యీనాటికీ ఉత్తర దక్షిణదేశ సంగీతజ్ఞులకు ప్రామాణిక గ్రంథము. కాకతీయుల తర్వాతవచ్చిన రెడ్డిరాజులలో కుమారగిరి వసంతరాజు, పెదకోమటి వేమారెడ్డి - నాట్యశాస్త్ర వ్యాఖ్యాతలయి, నర్తకగాయకులను పోషించారు. వారికి సమకాలికుడైన రేచర్ల వెలమరాజు సర్వజ్ఞ సింగమనీడు సంగీతరత్నాకరానికి వ్యాఖ్య వ్రాశాడు. విద్యానగర స్థాపనకారకుడై వేదపారంగతుడయి భాష్యకర్తగా ప్రసిద్ధి చెందిన విద్యారణ్యుడు సంగీతసారం రచించాడు. ఈ చారిత్రక కాలంలో శ్రీనాథుని నాడు మాత్రం ప్రేమాభిరామ సంస్కృత వీధినాటకం పేరొకటి క్రీడాభిరామంద్వారా వినబడుతుంది. 15 వ

శతాబ్దంలో విద్యానగరము నేలిన సాళువ నరసరాజు కాలంలో యక్షగానం రాజదర్బారులకు ఎక్కిన సంగతి ముందు చెప్పుకొన్నాము. ఈ కాలం దాటే సరికి, మనం రాజవంశాలను దర్బారులను వదలి, కూచిపూడి చేరుకోవలసి వస్తుంది.

ఐతిహ్యాలనుబట్టి, కూచిపూడి భాగవత మేళముల వారిని భరతలక్షణాను సారులనుగాచేసి. వంశపారంపర్యంగా పురుషులే వేషధారణచేసి, నాటకము లను ఆడవలెనని కట్టడి చేసినవాడు సిద్ధేంద్రియోగి అని చెప్పుతున్నారు. సిద్ధేంద్రుడు నారాయణ తీర్థులకు శిష్యుడని, ఒకవాదము. ఆయనకు ఈయ నకు కూడా అత్తవారింటికి నదిలో ఈదుకొని పోతుండగా వరదరావడమూ, నదీగర్భంలో ఆపత్సన్న్యాస స్వీకారమూ – ఈకథ ఇద్దరికీ జరిగిందని చెపుతారు. నారాయణతీర్థుల మహా యక్షగానం అయిన కృష్ణలీలా తరంగిణి పూర్తిగా సంస్కృతపు కీర్తనలతో, శ్లోకాలతో తరంగాలనబడే 12 అంకాలలో రచింప బడింది. ఆ తరంగాలను కూచిపూడివారు అనాదినుంచీ అనూచానంగా తమ ఆటలలో ప్రదర్శిస్తూ అభినయిస్తున్నారు. దాని తర్వాత సిద్ధేంద్రుని భామాకలాపం కూచిపూడివారికి ప్రధాన ఆలంబన మయింది. చరమ జీవిత కాలంలో నారాయణ తీర్థులు దక్షిణాదికి వెళ్లిపోయి సత్యభామ కథనే పారి జాతాపహరణంగా కూర్చి, తంజావూరు ప్రాంతానికి తనతోపాటు వలసపోయిన కూచిపూడివారి వారసులయిన మేలటూరివారికిచ్చాడు. అందుకే వారు అప్పటి నుండి నేటివరకూ ఆ తమిళదేశం మధ్య-తెలుగు సంగీత నాటకాలనే ఆడు తుంటారు. అటు తర్వాత కూచిపూడివారి ప్రదర్శనల్లో తరిగొండ వేంకమాంబ గారి గొల్లకలాపము, భాగవతుల రామయ్యగారి గొల్లకలాపము రాణ చెందాయి. చారిత్రకంగా ఆలోచిస్తే నారాయణతీర్థులూ, సిద్ధేంద్రయోగీ, పదకర్త అయిన క్షేత్రయ్యా 17 వ శతాబ్దానికి ఆవలి యీవలి సగాలలో యాభై సంవత్సరాల యెడంలో జీవించి ఉండినట్లు, ముగ్గురూకూడా కూచి పూడివారికి ఉపదేశకులయినట్లూ తోస్తుంది. ఇటుపైని కూచిపూడివారు తర చుగా తీర్థులూ, క్షేత్రయ్యా మొదలైన వాగ్గేయకారులు చేసినట్లే, ప్రదర్శ నలకు రాజపోషణకు తంజావూరు మధురలు యాత్రలుచేసి వస్తూండినట్లు కనబడుతుంది. తంజావూరు నేలిన నాయకరాజులకు, మహారాష్ట్రరాజులకు అంకితము చేయబడిన సలాము, దరువులు మున్నగునవి కూచిపూడివారి తరువాత నాటకాలల్లో వినబడుతూండడమే దానికి దృష్టాంతం.

ఇంతవరకూ అస్పష్ట చారిత్రక యుగం గడిచింది. 17 వ శతాబ్దినుంచి, తెలుగుసంగీత నాటకచరిత్ర తంజావూరులో స్వర్ణయుగాన్ని స్థాపించు కొన్నది. అప్పుడు తంజావూరు నేలిన నాయకరాజులూ, వారి తర్వాత పరిపాలించిన మహారాష్ట్ర రాజులూ ఆ స్వర్ణయుగ నిర్మాతలు, 17 వ శతాబ్ది తొలిదశకంలో కృష్ణా ప్రాంతంనుంచి నారాయణతీర్థులతో పాటు తంజావూరు ప్రాంతానికి వెళ్ళిన కూచిపూడి భాగవత కుటుంబాలే- అప్పటిరాజైన అచ్యుతప్ప నాయకుని తమ నాటక ప్రదర్శనములద్వారా మెప్పించి, అచ్యుతరాయ సముద్రమనే గ్రామాన్ని అరణం పొందారు. అదే తర్వాత మేళత్తూరు, లేక మేలటూరుఅయింది. ఈ మేలటూరులో భాగవత కుటుంబాలవారు నాటినుంచి నేటివరకు తెలుగులోనే అనేక వాగ్గేయ రచనలను సంగీతనాటకాలను రచించి ఏటేటా తమ గ్రామంలోను, దక్షిణ దేశంలోని ఇతర గ్రామాలలోను ప్రదర్శిస్తూ వచ్చారు. మేలటూరు వాగ్గేయ కారులలో ప్రసిద్ధులు శబ్దకర్తయైన కాశీనాథయ్య, పదాలను కీర్తనలను, రచించిన వీరభద్రయ్య, సుమారు 12 తెలుగు నాటకాల దాకా రచించిన వేంకటరామశాస్త్రి. ఈ వెంకటరామశాస్త్రి త్యాగరాజుకు సమకాలికుడు.

అచ్యుతప్ప నాయకుని కుమారుడయిన రఘునాథనాయకుడు కృష్ణ దేవరాయలవలె కవి పండిత గాయక పోషకుడై సాహిత్యభోజుడని ప్రసిద్ధి పొందాడు. తాను స్వయంగా గజేంద్రమోక్షము, రుక్మిణీ కృష్ణవివాహము, జానకీ పరిణయము అనే యక్షగానాలను రచించాడు. రఘునాథుడు సంగీత శాస్త్ర నిష్ణాతుడుకూడ. అతని మంత్రియైన గోవిందదీక్షితుడు వ్రాశాడని చెప్పబడుతున్న సంగీతసుధ అనే లక్షణగ్రంథం రఘునాథనాయక కర్తృకం గానే రచింపబడింది.

రఘునాథుని కుమారుడైన విజయరాఘవ నాయకుడు 23 యక్ష గానాలను రచించాడు. ఈయన కొలువులోని ఇతనిపుత్రుడు మన్నారు దేవుడు, కోనేటి దీక్షితకవి, పురుషోత్తమ దీక్షితుడు, కామరసు వేంకటపతి సోమయాజి, పసుపులేటి రంగాజమ్మ, కృష్ణాజి, వీరందరూ యక్షగాన కర్తలే.

వీరుకాక, విజయరాఘవుని దర్బారును అలంకరించిన గాయక నర్తకు లలో అగ్రేసరు రాలైన చంద్రలేఖ, రూపవతి, చంపకవల్లి, మూర్తి, కోమల వల్లి, లోకనాయిక, శశిరేఖ, రత్నగిరి, భాగీరథి మున్నగు వారందరూ వివిధ

నాటక నృత్య ప్రదర్శనలలో పాల్గొని మన్నన పొందేవారు. విజయరాఘవుని యక్షగానంలో ప్రసిద్ధమైనవి రఘునాథాభ్యుదయమూ, విప్రనారాయణ చరిత్రా. అష్టభాషా విశారదయైన పసుపులేటి రంగాజమ్మ యక్షగానాలలో ప్రసిద్ధమైనది మన్నారు దాస విలాసము.

1704 వరకు మైసూరు నేలిన చిక్కదేవరాయలు తాను మూగవాడయి నప్పటికీ, కళువె వీరరాజు అను కవీశ్వరుని సాహాయ్యంతో ఆంధ్ర కొరవంజి, నాట్యవిద్యా విలాసము మొదలైన 14 యక్షగానాల రచనకు కారకుడయినాడు.

విజయరాఘవనాయకుని తర్వాత తంజావూరు మహారాష్ట్ర రాజుల వశమైంది. ఈ రాజులు తమ మాతృభాష మహారాష్ట్రమైనా, పాలించేది ద్రావిడ దేశమే అయినా, సంస్కృతాంధ్ర భాషలలో సంగీత సాహిత్య గ్రంథాలను స్వయంగా రచించీ అనేక కవి పండిత గాయకాదులను పోషించీ, నాయకరాజులు ప్రారంభించిన సంస్కృతీ బీజాలను ఇతోధిక భక్తి శ్రద్ధలతో పోషించారు. వీరిలో 1684 నుంచి 1712 వరకూ పాలించిన శాహభూపాలుడు (శాహజీ) దాదాపు 20 యక్షగాన నాటకాలను, అనేక పదాలను రచించాడు. వాటిలో ప్రసిద్ధమైనవి శంకర పల్లకి సేవా ప్రబంధ నాటకము, విష్ణుపల్లకి సేవా ప్రబంధ నాటకము. శంకరపల్లకి సేవ తిరువారూరులోని త్యాగరాజస్వామి పల్లకి సేవను గురించి ఉత్సవ సంప్రదాయ కీర్తనాత్మకముగా రచింపబడిన యక్షగానము. దీనిని ప్రతిశుక్రవారము ఆలయపు దేవదాసులు నృత్య సంగీతాత్మకంగా ప్రదర్శించేవారు.

ఈ శాహభూపాలుని ఆస్థాన వాగ్గేయకారుడు, బహుళ యక్షగాన పదకర్తా అయిన గిరిరాజకవి కర్ణాటక సంగీతరత్న త్రయంలోని త్యాగరాజుకు సాక్షాత్తు పితామహుడే. గిరిరాజు యక్షగానాలలో ముఖ్యమైనవి శాహేంద్ర చరిత్రము, లీలావతీ కల్యాణము, రాజమోహన కొరవంజి. తంజావూరులో ఈనాటికీఉన్న సరస్వతీమహల్ అనే ప్రాచీన గ్రంథాలయం శాహజీ భూపాలుని శ్రద్ధాభక్తులవల్లనే సేకరింపబడింది. తద్వారానే నాయక రాజులనాటి యక్షగానాలు, మహారాష్ట్ర రాజులనాటి యక్షగానాలు ఇంకా అనేక ప్రాచీనాంధ్ర సంస్కృత పద్యకావ్యములు తాళపత్రములపై లిఖింపబడి, భద్రపరుపబడి, మనకు ఈనాటికీ లభిస్తున్నవి.

ముందు మేలటూరు వాగ్గేయకారులలో చివర చెప్పుకొన్న వేంకటరామ శాస్త్రి త్యాగరాజుకు సమ కాలికుడు. వయోజ్యేష్ఠుడు. నారసింహోపాసకుడైన ఈయన నాటకాలలో ప్రసిద్ధమైనది ప్రహ్లాదచరిత్ర. ఈ తెలుగు నాటకం తంజావూరు గ్రామాలలో నృసింహజయంతి రోజుల్లో ఏఏటా ఇప్పటికీ ప్రదర్శిస్తూంటారు. మిగిలినవి ఉషాపరిణయం, రుక్మాంగదచరిత్ర, హరిశ్చంద్ర, మార్కండేయ- మొదలైనవి.

త్యాగరాజు నౌకాచరిత్రము. ప్రహ్లాద భక్తివిజయం, సీతారామ విజయం అనే సంగీత నాటకాలను రచిస్తూండినపుడు తరచు తనకంటే వయోధికుడైన వెంకటరామశాస్త్రికి వినిపించి ఆయన మెప్పుపొందేవాడట. త్యాగరాజు బాల్యంలో తన తాతగారైన గిరిరాజకవి నాటకాలను, శాహభూపాలుని కొలువులో శాహజీ నాటకాలను ఆ తర్వాత మేలటూరు నాటకాలను కూడా ప్రదర్శిస్తూండగా అనేక పర్యాయములు దర్శించి తన నాటకాభిలాషకు దోహదం చేసుకొన్నాడు. భక్తిరస ప్రాధాన్యము వల్లను. సంగీత సాహిత్య రచనాదక్షతలోను, త్యాగరాజు నాటకాలు మేలటూరు నాటకాల కంటే ప్రత్యేకత కలిగి ఉంటాయి.

త్యాగరాజుకు సమకాలికుడై తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపుర వాస్తవ్యుడైన మద్దిరాల వెంకటరాయకవి-స్థానిక దైవతమైన కుక్కుటేశ్వరుని నిత్యోత్సవాలకుగాను ఏకాంతసేవా విలాసమనే యక్షగానం రచించాడు. దీనిని పిఠాపురంలోని కళావంతులు ఆనాడు నృత్యగానాలతో ప్రదర్శించేవారట, కాని, ఈనాడు పూజారులలో ఒకరిద్దరి గాత్రాలలో హరించుకపోవడానికి సిద్ధంగా ఉన్నది.

ఇవిగాక, 18, 19 శతాబ్దాలలో ఆంధ్ర దేశంలోని ఆయా ప్రాంతాలలో అనేక గ్రామనాటక సంఘాలు వెలిసి అనేక వీథి నాటకములు, యక్షగానములు రచింపబడ్డాయి. వేములపల్లె విరాటపర్వం. లేపాక్షి రామాయణం, మానికొండ రామాయణం, ధర్మపురి రామాయణం, ఇలాంటివే, 18 వ శతాబ్దిలో భద్రాచలంలో యాదవదాసు అనే అతడు గరుడాచల నారసింహుడి కథను (చెంచు లక్ష్మి) ఓబయ్య మంత్రి రచించిన దానికంటే అధునాతన పద్ధతులలో యక్షగానంగా రచించాడు. చెంచులక్ష్మి నాటకంగా ఇది ఆంధ్ర దేశంలో చాలా ప్రాంతాలలో జనరంజకత పొందింది.

19 వ శతాబ్దంలో యక్షగానం క్రమంగా హరికథగా పరిణామం పొందింది. అంటే యక్షగానంలోని సూత్రధారుని కథాకథన గద్య పద్యాలకు తోడు ఆయా పాత్రల సంభాషణ దరువులను, గద్య పద్యాలను కూడా కథకుడే ఏక పాత్రాభినయంగా, అభినయ గాన నృత్యాత్మకంగా చెప్పుకుంటూ పోవడం అభ్యాసంలోకి వచ్చింది. గోగులపాటి కూర్మనాథుడనే సింహాచల నివాసియైన వైష్ణవ వాగ్గేయకారుడు రచించిన మృత్యుంజయ విలాసమనే శివకథ ఈ విధంగా హరికథా పద్ధతిలో చెప్పబడి జనరంజకత పొందిన యక్షగానాలలో మొదటిది. యక్షగానాలను ఇంతటితో విడిచిపెట్టి, మనం ఆధునిక యుగంలోకి అడుగిడవలసి ఉంటుంది.

సుమారు 19 వ శతాబ్దపు రెండవసగం ఆంధ్రదేశానికి మరాఠీ పార్శీ థియేటర్ నాటక సమాజాలవారు వచ్చేనాటికి మన ప్రాంతంలో కూచిపూడి వారివీ, ఇంకా ఆ సంప్రదాయంలో ఆయా జిల్లాలలో వెలసిన భాగవత కుటుంబాల వారివీ యక్షగాన ప్రదర్శనలూ, వీథి నాటకాలూ, కళావంతుల నట్టువరాంద్ర కలాపాలూ ఉంటుండేవి. ఆనాటి కప్పుడే బ్రిటిషుసామ్రాజ్యం బలపడి, ఆంగ్ల విద్యాప్రభావం మనపట్టణాల్లో విద్యాధికులలో తలసూప నారంభించింది. దాని తొలిఫలితం యేమంటే జాతీయ కళా రూపాలయిన వీథి నాటకాలూ, కలాపాలూ పల్లెలకూ దేవస్థానాలకూ మిగిలిపోయి, పట్న వాసాలలో ఆంగ్లరంగస్థల పద్ధతి నాటక రచననూ ప్రదర్శనలనూ ప్రారంభించారు. వీరేశలింగం పంతులుగారు, వేదం వెంకటరాయశాస్త్రిగారు, తిరుపతి వెంకట కవులవంటివారు కొందరు సంస్కృత నాటక పద్ధతిని పద్య గద్యాత్మకములైన నాటకాలను వ్రాశారు. కోలాచలం శ్రీనివాసరావుగారు, ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు మొదలైనవారు పద్యగద్యాత్మకములుగా మాత్రమే కాకుండా, పార్సీ మరాటీ నాటకములలో ఆనాడు తాము వినియుండిన పాటల వంటి పాటలతో కూడిన నాటకాలను రచించి ప్రదర్శించారు. ఎక్కువ పద్యాలు కొద్దిగా పాటలతో పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు, ఎన్నో పద్యాలతో చిలకమర్తివారు, తిరుపతి వెంకట కవులు, బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు నాటకాలను వ్రాశారు.

ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు, గోపాలాచార్యులుగారు, చక్రావధానుల మాణిక్యశర్మగారు, అయినాపురపు సోమేశ్వరరావుగారు, సోమ

రాజు రామానుజరావుగారు, కొప్పరపు సుబ్బారావుగారు మొదలైనవారు తమ నాటకాలలో ఒక్కొక్క దానిలో 25, 30 పాటలకు తక్కువ కాకుండా చేరుస్తూ వచ్చారు. వీరందరి కంటెకూడా మైలవరంవారి నాటకాలకు సంగీత గురువయిన పావట్ల కాంతయ్యగారి పాటలు-సావిత్రి, మాన సంరక్షణము, కృష్ణ తులాభారము నాటకాలకు వ్రాసినవి బహుజనరంజకత పొందాయి. అంతేకాదు ఈ పాటలవల్ల నైతేనేమి, అర్ధశతాబ్దిపాటు ఆంధ్రనాటక రంగమును ఏకచ్ఛత్రాధిపతులై ఏలిన యడవల్లి, కపిలవాయి, జొన్నవిత్తుల, అద్దంకివంటి గాయకనటులు దిద్దితీర్చిన పద్యగాన సంప్రదాయంవల్ల నైతేనేమి ఒక విశిష్టమైన ఆంధ్రరంగస్థలబాణీ అంటూ ఒకటి ఏర్పడింది. ఇంతకుముందు వివరించిన ప్రాచీన యక్షగానాది నాటక చరిత్రకు తర్వాత ఇంతవరకు రంగస్థల సంప్రదాయ కథను ముందు సూచించబోయే ఆదర్శ సంగీత నాటక పరిణామానికి ముందటి యుగపు విశిష్టలక్షణంగా విశదీకరించడమయింది. దాని ఫలితం ఏమిటంటే జనానీకంలో సంగీతాభిరుచి వివిధశాఖలై అనేకమైన చీలికలు కాసాగింది. అదేలాగంటే, ప్రాచీన శాస్త్రీయ సంప్రదాయం రుచించేవారూ, ఆ తర్వాత వచ్చే పార్శీమట్లకూ మరాఠీ మట్లకూ చెవి ఒగ్గేవారూ, హిందూస్థానీ ఠుమ్రీ, గజల్, టప్పాబాణీలకు చెవి కోసుకునే వారూ, ఈ విధంగా ప్రేక్షకులలో అనేక అభిరుచులవారు తయారయినారు. ఇవన్నీకాక, పల్లెప్రజలలో తరతరాలుగా పాడుకొనిపోయి వస్తున్న జానపద గేయరీతులు వాటి 'నేవళీకం' కోలుపోకుండా ఇంకా సజీవమై సంఘ గౌరవానికిమాత్రందూరమై ఉంటున్నాయి.

20వ శతాబ్దిలో సినిమా వచ్చింది. తొలి తెలుగు సినిమాలలో నటీనటులూ గాయకులూ రంగస్థలం మీదనుంచి సరాసరి తెరపైకి వెళ్ళిన వారు కావడంచేత ఆనాడు రంగస్థలపు బాణీలో మరాటీ, హిందీ శైలులలో సంగీతం వినవచ్చేది. రానురాను హిందీ సినిమాలు మన ప్రాంతీయ ప్రేక్షకులకుకూడా ఆదర పాత్రములు కావడంతో, ఆనాటికానాడు అక్కడి బెంగాలీ, పంజాబీ, పర్షియన్, అమెరికన్, ఆఫ్రికన్, మెక్సికన్, స్పానిష్ సంగీతపు బాణీలు తునకలు తునకలుగావచ్చి మన ప్రేక్షకులపైన, తెలుగుచిత్ర నిర్మాతలపైన దాడి చేసి, వారిలో చాలమందిని, ముఖ్యంగా యువకతరం వారిని లోబరచుకొన్నాయి. దీనితో అభిరుచులు మరీ శాఖోపశాఖలుగా చీలిపోయాయి. మన తెలుగు సినిమాలలో చాలమంది దర్శకులు డోలక గీతులూ, పర్షియన్‌రీతులూ,

ఇంకా ఇటీవల వచ్చే రాక్ ఇన్ రోల్ పాటలూ అనుసరించి పాటలిస్తేనేగాని నిర్మాతలు వొప్పుకోవటం లేదు.

సంగీతంలో అభిరుచి ఇన్నిరీతులుగా చీలింది అని ఎందుకు వివరించ వలసి వచ్చిందంటే-వ్రాసే కవి తాను ఎవరికోసం వ్రాస్తున్నాడో వారికి తెలిసిన ఒకభాషలో - ఒకే భాషలో తన కావ్యాన్నో, నాటకాన్నో వ్రాస్తాడు. అదే గేయమో, సంగీత నాటకమో అయినప్పుడు, దానిని ప్రదర్శించ వలసి వచ్చి నప్పుడు తన ప్రేక్షకులకూ శ్రోతలకూ పరిచితమై వారు అభిలాష కనపరచి, తలలూపగలిగే బాణీలో తన గేయాలకు సంగీతపు వరుసలను అమర్చవలసి ఉంటుంది. ఈనాటి సంగీతనాటక రచయిత తానే సంగీత నిర్మాతకూడా అయినప్పుడు కాని, ఒక కవి రచించిన సంగీత నాటకమునకు తాను సంగీతము కూర్చేటప్పుడు కాని, ఎటువంటి అభిరుచి కలవారిని మనస్సులో పెట్టుకుని పని చేయవలసి ఉంటుంది? ఒకటే సమాధానము - తాను ఏశ్రోతలను రంజింప జేయాలని ఉంటుందో వారి అభిరుచుల ప్రకారమే చేయవలసి ఉంటుంది.

పాశ్చాత్య సంప్రదాయం ప్రకారం మన ఆధునిక సాహిత్యంలో అనేక కొత్త అందాలను తీర్చుకొన్నది తెలుగుగేయం. జాతీయములైన రగడలు మొదలయిన మాత్రాచ్ఛందస్సులలో నుండి ముత్యాల సరాలవంటి గేయాలను గురజాడవారూ వారి ననుసరించినవారు చాలమంది నవ్యకవులు రచించారు. ఇటువంటి గేయాలతోను, పద్యాలతోను కలిపి, నిర్వచనంగా పూర్తి గేయనాటి కలను రచిద్దామనిపూనుకొని, కృతకృత్యులయినవారిలో శివశంకరస్వామిగారు మొట్టమొదటివారు. యక్షగాన నామకమయిన ప్రాచీన సంగీత నాటకంలో సూత్రధారుని సంధివచనాలలో. ఇంకా ఇతర పాత్రల సంభాషణలలో గద్యం ఉంటూ ఉండేది. దరిమిలా వచ్చిన రంగస్థల నాటకాలు ఇంచుమించు అన్నీ కూడా పద్యాలూ, పాటలూ కత్తిరించి, సంభాషణలతో మాత్రమే ఆడినా ఆడ వచ్చు. కాని, నవ్యసాహిత్య సంప్రదాయంలో మాత్రం సంపూర్ణ గేయనాట కాలు రావడం ప్రారంభించాయి. శివశంకరుల సంపూర్ణ గేయ నాటకాలలో 'సహజయాన పంథీ' అనే పేరు గల నాటకానికి ఇతివృత్తము వంగకవియైన చండీదాసు రజకినియైన రామమణిని ప్రేమించిన గాథ. వారు ఆ నాటకాన్ని వ్రాసే రోజులలోనే ఈ వ్యాసకర్త తన తొలిసంపూర్ణ సంగీత నాటకానికి అదే ఇతివృత్తాన్ని స్వీకరించడం జరిగింది. రెండు నాటకాలు ఒకే 'ప్రతిభ' సంపు

టంలో ప్రకటింపబడడమే గాకుండా, 1941 ఫిబ్రవరి మాసంలో మద్రాసులోనే శివశంకరుల నాటకం రంగస్థలంపైని ప్రదర్శితమయింది. ఈ వ్యాసకర్త రచించిన 'చండీదాసు' వాయు ప్రసారితమయింది ఆ మాసంలోనే. శివశంకరులు సుమారు 15 సంపూర్ణ సంగీత నాటకాలు వ్రాశారు. పద్మావతీ చరణ చారణ చక్రవర్తి చాలసార్లు రంగస్థలంపైని ప్రదర్శించబడింది.

వాయు ప్రసారంలో (1939లో) తొలుతటి సంపూర్ణ సంగీత నాటకం మల్లవరపు విశ్వేశ్వరరావుగారి బిల్హణీయం. ఆ తర్వాత శ్రీశ్రీ 'మోహినీ రుక్మాంగద' మొదలయిన కొన్ని సంగీత నాటకాలు వ్రాశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి 'ఊర్వశి' 'శర్మిష్ఠ' 'విద్యాపతి' 'ధనుర్దాసు', 'గుహుడు' 'ఉమర్ ఖైయాం' 'ఆండాళ్ కల్యాణము' 'దక్షయజ్ఞము' మొదలగు సంగీత నాటకాలను ఎక్కువ భాగం పాటలతోటీ, తగుమాత్రం పద్యాలతోనూ సంభాషణలతోనూ కూడా వ్రాశారు. ఇవన్నీ వాయు ప్రసారంలో ఎన్నిక గన్నవి.

మల్లవరపు విశ్వేశ్వరావుగారు షెల్లీ రచించిన 'ప్రొమిథియస్ అన్ బౌండ్'ను సంపూర్ణ సంగీత నాటకంగా అనువదించారు. ఇదీ, ఇంకా వారు కళాపూర్ణోదయ గాథననుసరించి చేసిన 'కలభాషిణి' ధారావాహి నాటికాగుచ్ఛం, శారదోత్సవం మొదలైనవి వాయుప్రసారంలో పేరు పడ్డవి. విశ్వనాథ సత్యనారాయణగారి కోకిలమ్మ పెళ్ళి, కిన్నెరసాని, మారీచుడు, సుమిత్ర, ఊర్మిళ, గోదావరి మొదలైన సంగీత నాటకాలు బహుళ గేయాత్మకాలై వాయు ప్రసారంలో గణ్యత పొందాయి.

సి. నారాయణరెడ్డిగారి నాగార్జునకొండ, కర్పూర వసంతరాయలు మొదలైన కొన్ని గేయ నాటకాలు మునుముందు మన సంగీత నాటకాలకు మంచి పరిణతి రాగలదని సూచిస్తాయి.

ఆంధ్ర నాటకరంగ చరిత్రలో కృషిచేసిన కీ॥ శే॥ కొప్పరపు సుబ్బారావుగారు పాశ్చాత్య దేశాలలోని బర్లెస్క్ లేక, హాస్యసంగీత నాటకాలను దృష్టిలో పెట్టుకొని, అల్లీముఠా అనే సంగీత నాటకాన్ని రచించి, అనేక ప్రదర్శనలు చేయించారు.

ప్రాచీన గేయనాటక రూపమైన యక్షగానానికి ఇటీవల మళ్లీ మంచి కాలము రాగలదని తోస్తోంది. ఉదాత్త సాహితీ శిల్పదక్షులయిన మహాకవులు

ఈ ప్రక్రియను చేపట్టి ఆదరిస్తున్నారు. కాటూరి వేంకటేశ్వరరావుగారి 'శ్రీనివాస కళ్యాణం', దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రిగారి సాగరమథనమూ మాళవికాగ్నిమిత్రమూ విప్రనారాయణ చరిత్రమూ అనే యక్షగానముల రచనలో ఈ వ్యాసకర్త తన సంప్రదాయ సంగీతానుభవమూ, ధాతుకల్పనా, వినియుక్తములైనందుకు తనను తాను ధన్యుడుగా భావిస్తాడు.

18 సంపూర్ణ గేయ నాటకాలనూ, 30 వరకూ గద్య పద్య గేయాత్మక నాటకాలనూ రచించిన ఈ వ్యాసకర్త, తన గేయ నాటకాలను వాయుప్రసారంలో మాత్రమేకాక, ఐదారింటిని రంగస్థలంపైని నాట్యాత్మకంగా కూడా ప్రదర్శింపజేసిన అనుభవాన్ని పురస్కరించుకొని, సంగీత నాటకముల రచన గురించీ, ప్రదర్శన నిర్వహణముల గురించీ కొన్ని సూచనలతో ఈ వ్యాసాన్ని ముగించగలడు.

సంగీత నాటకానికి - ఆ మాటకొస్తే ఏ నాటకానికైనాకూడా-ఇతివృత్తం సుప్రసిద్ధమై ఉంటేనూ, పాత్రలు స్వరూప స్వభావ వాచకాదులవల్ల స్పష్టంగా తెలిసిపోతుంటేనూ - ప్రదర్శన చాలా సుకరం. అలా లేనిచోట్ల కథావివరణా పాత్రనిర్దేశమూ ప్రదర్శనానికిముందు తప్పక అవసరం అవుతాయి. పాత్రలు ఎంత తక్కువుంటే అంతమంచిది, మొత్తం 5, 6 కంటె మించకూడదు. ఏ పాత్రకాపాత్ర తన పాట ఏదో పొడుగ్గా తాను పాడుకొంటూ ఉంటే మిగిలిన పాత్రలు స్తబ్ధంగా నిల్చుండో కూర్చుండో వుండే ఘట్టాలుండకూడదు. పాత్రల పాటలలోనే సంభాషణలు, కథాగతీ, (action) సంఘటనలూ సాగిపోతూ వుండాలి. ఒక్కొక్కచోట కథ మెల్లిగా సాగే బరువైన ఘట్టాల్లో బరువైన పాటలు ఉండాలికాని, మిగిలినచోట్ల లయాన్వితంగా త్వరితంగా సాగిపోయే సంవాద గేయాలూ, లయలలో ఛందాలలో మార్పులు చేసుకుంటూ పోవాలి. మధ్యమధ్య ప్రకటనా వివరణా అక్కరలేకుండానే స్థలనిర్దేశమూ, పాత్రనిర్దేశమూ, సమయసూచనా తెచ్చిపెట్టుకొన్నట్లు కాకుండా సహజంగా గేయ సంభాషణలో సాగిపోవాలి. కథా కథనము (narrative) చెయ్యడానికీ, ఒక్కొక్క సంఘటనలో కలిగించిన రసాన్ని తీవ్రతరంచేసి సుస్థిరం చెయ్యడానికీ బృందగానాలను (Choruscs) ఉపయోగించాలి. ఈ బృందగానాలను పాడే గాయకబృందం కథలో ఆ యా ఘట్టాలలో సహజంగా సమకూడే పాత్రలైనా కావచ్చు, లేదా, ఏ సంబంధమూలేని వట్టి ఆఖ్యాతృ బృందం

కావచ్చు. ఘట్టాలలో సహజంగా సమకూడే పాత్రలే బృందగానం పాడే అవకాశం ఉండే నాటకానికి పాత్రలు తక్కువవుండాలనే నియమం వర్తించదు. అంతమందీ చక్కగా పాడేవారిని సమకూర్చుకోవడం నిర్వాహకుని పూచీ.

సంగీత నాటకంలో సంగీత నిర్వాహకుని బాధ్యతే గురుతరమైనది. మన ప్రేక్షకులలోఉండే వేరువేరు సంగీతపు బాణీల అభిరుచులను గురించిఈవ్యాసంలో ముందు విశదీకరించాము. నిర్వాహకుడు ఈ బాణీలకు కొన్ని తారతమ్యాలను ఏర్పాటు చేసుకొని, తన ఇతివత్తాన్ని బట్టిగాని, దేశకాలములను బట్టిగాని, తన నాటకంలోని వేరువేరు ఘట్టాలలో పాత్రల ఉత్తమ మధ్యమాధమములని ప్రాచీన శాస్త్రాలలో చెప్పబడిన వర్గాలలో ఆయా వర్గాలకి చెందిన పాత్రలకు, ఆయా సన్నివేశాలలోని రసాలకు, అనుగుణమైన సంగీతపు బాణీలను కూర్చుకోవలసి ఉంటుంది. ప్రతి ఒక్క బరువైనపాటకూ రెండో మూడో తేలికగా రక్తిగా సాగిపోయేవరుసలుండాలి. నేపథ్యజంత్రసంగీతం ఉండీ ఉండనట్లుగా వినిపిస్తూ, పాటలలోని మాటలను స్పష్టంగాతెలియనిస్తూ, గాత్రములు పాడని సమయాల్లో ఆయా రసావేశాన్ని ఉత్తేజపరచి సుస్థిర పరుస్తూ ఏ స్వరసంపుటికి పక్క ఏ స్వరాలు పలికిస్తే ఎక్కువ ఫలితం ఉండగలదో దాన్ని సాధించాలి.

సంగీత నాటకాలలో పాడే గాయకులందరికీ తమ వాచకం (పాటలు) క్షుణ్ణంగా వచ్చిఉండాలి. ఒక్కొక్క వ్యక్తి తన పాటలను క్షుణ్ణంగా పాడగలిగి ఉండడమే కాకుండా మొత్తంమీద సాముదాయిక కృషిగా నటులు అంతా యంత్రపు చక్రాలవలె ఒకరికొకరు అతికి, పరస్పర సహకారముతో జయప్రదం చేయవలసి ఉంటుంది.

సంగీత నాటకాలలో వీలైతే అంటే లభిస్తే, నాట్యశాస్త్ర దక్షులైన నటుల నాట్యానికి పూర్తి ఆస్కారం ఉంది. లేకపోతే సకృత్తుగా ముద్రలతో, అంగ విన్యాసములతో కొంత నాట్యాభినయం ఉండవచ్చు. నాట్యమూ గానమూ రెండింటిలోనూ కృషిచేసిన నటబృందము సంగీత నాటకాలకు చాలా ఆవశ్యకం. ఒక గురుకులంలో వలె ఈ బృందానికి దినచర్యగా అంగవిన్యాసాదికాలు పాదలయ విన్యాసాలు డిల్లుగా అభ్యాసం చెయ్యాలి. దేశమంతటా ప్రధాన పట్టణాలలో జాతీయ నాట్య మందిరాలు ఏర్పడి, అక్కడ అటువంటి గురుకులాలు ఏర్పడిననాడు మాత్రమే అలాంటిది సాధ్యమౌతుంది. లేనినాడు నాట్యాన్నీ గానాన్నీ విడదియ్యడం ఒక పద్ధతి. నాటకంలోని గేయభాగమంతా

తెరలో మైక్రోఫోన్‌లో ఒక నటబృందం గానాభినయం చేస్తూంటే మరొక బృందం రంగస్థలంపై నాట్యాభినయం చేయించడం. ఈ వ్యాసకర్త 10 సంవత్సరాలక్రితం తన సంగీత నాటకాలను ఆ విధంగానే బాలికల చేత నాట్య ప్రదర్శనములుగా చేయించాడు

ఈ వ్యాసం సంగీత నాటకాల రచనను గురించీ ప్రదర్శనను గురించీ, మన దేశంలోని జిజ్ఞాసువుల దృష్టి మరల్చడానికి ఉద్దేశింపబడ్డది. అందుకని మన ప్రాచీన ఆధునిక సంగీత నాటకాల చరిత్రను స్థాలీపులాకంగా ప్రదర్శించామే కాని, ఈ రంగంలో కృషిచేసిన ఏ పేరునైనా ఇందులో చేర్చకపోయి ఉంటే, అది ఉద్దేశపూర్వకం కాదనీ, వస్తువిస్తరణ భీతిచేతా, స్థాలీపులాక దృష్టిచేతనూ మాత్రమే అనీ విజ్ఞులైనవారు గ్రహింతురు గాక.

----బాలాంత్రపు రజనీకాంతరావు

విషయసూచిక

మంద్రస్థాయి :

1.	మధురానగరీ గాథ	2
2.	సుభద్రా విజయము	10
3.	మేనక	18
4.	నౌకావిహారము	27
5.	పుష్పలావికుడు	31

మధ్యస్థాయి :

6.	రాసలీల	36
7.	స్వప్నసీమ	47
8.	సుమజన్మ	52
9.	నళిన భ్రమరి	56
10.	శాఫో	60
11.	అమృతవర్షిణి	64
12.	మేఘ సందేశం	69

తారస్థాయి :

13.	చండీదాసు	83
14.	లకుమాదేవి	106
15.	విజయవిధాత	118
16.	విశ్వవీణ	128
17.	స్వైరిణి అన్నారు	143
18.	శాంతిపథము	149

మంద్రస్థాయి

మధురానగరీ గాథ

నృత్య నాటిక

(మధురా నగరిలో అనే జనరంజకమైన పదాన్ని ఆలంబనంగా చేసుకుని అల్లిన గాథ)

పూర్వరంగ బృందగీతి

మధురానగరీ గాథ ;
మరపురాని తీయనైన బాధ ;
కడపగడప-యెడద యెడద-తాకుచు
ప్రేమము పంచిన మాధవు గాథ ;
మాధవు డల మధురానగరికి చన
బృందావన గోపీజన బాధ ;
చల్లగొనుచు మధురానగరికి చను
వ్రజభామిని మధుర హృదయ శోధ ;
మధురానగరీ గాథ.

(ప్రభాత సంగీత శ్రుతులు ప్రభాత ప్రకృతిని నిరూపిస్తుంటాయి. కుశలవుల బృందగానానుగుణంగా వ్రేపల్లెవాడలో జనులు ప్రభాతోచిత కార్యకలాపానికి నృత్యరూపాన ఉపక్రమిస్తారు.)

బృందగానం : వ్రేపల్లెవాడలో నుండే
గోపగోపికలార ; లెండి ;
మూడు జాములు దాటెనండి ;
కోడి కూసింది లేవండి.

ఇల్లూవాకిలి తుడవండీ ;
కల్లాపులు వెదజల్లండీ ;
ముంగిట ముగ్గులు తీర్చండీ ;
మూలల ధూపము లెయ్యండీ.

ఆలదూడలను విడువండీ
పాలముంతలను నింపండీ
పాలేరుల మోకాలి సందులను
పాలచెంబులను సర్ సర్
పెరటిలోపలీ గొల్లపిల్లలా
పెరుగు కంచముల జుర్ జుర్
పాలను కుంపటిపై నిడి ఉట్లను
పెరుగుముంతలను దింపండీ
కదలకుండగా పెరుగు కుండలను
కుదుళ్ళపైనా నిలపండీ
కవ్వము తీసుక వెన్నా చల్లా
విడివడగా వడి తిప్పండీ

(ఒక గొల్లభామ చల్లచేస్తుంటే మరికొందరు గొల్లభామలు కడవలు చేతనుంచుకొని ఆమె అభినయాన్నీ నటననీ నిర్దేశిస్తూ నృత్యం చేస్తూంటారు.)

చల్లాచెయ్యీ గొల్లాభామా
చల్ చల్ చల్ చల్
మొగమున మంచీ ముత్యాలంటే
ముంగురులను సరిచేసుకొంటూ

కన్నే వలపుల వంటీ కమ్మని
వెన్నాముద్దలు తేరిచి తీస్తూ
చల్లా చెయ్యీ్యా, గొల్లా భామా
ముక్కున ముంగర ముద్దులు కురియ
బుగ్గల సొట్టల నిగ్గులు తేరా
వాలుగన్నుల చూపులతో
గోపాలుని రాకా పొంచీచూస్తూ
చల్లాచెయ్యీ్యా గొల్లాభామా
చట్ చట్ చట్ చట్

(చల్లచేసి, ముంతలు ముంతలుగా నింపుకొని గంపలో సరిది, తలపై మోపికొని, వ్రజభామిని మధురానగరికి పయనమౌతుంది.

భామ : చల్లోయమ్మ చల్ల
కమ్మదనమ్మే కావాలంటే
కొల్లోయమ్మ కొల్ల
పుల్లదనమ్మే పొగిడేవారికి
పళ్ళు జివ్వుమను పుల్లని చల్ల
వెల్లావుచల్ల, నల్లావుచల్ల
బర్రావుచల్ల, బుడిగావుచల్ల
చల్లోయమ్మ చల్ల
పెరుగోయమ్మ పెరుగు
తీయదనమ్మే కావాలంటే
తేనెలమించే తియ్యాని పెరుగు

దళముగ కట్టిన మీగడపెరుగు
కన్నయ త్రావిన కమ్మని పెరుగు
రుచియైన పెరుగు, రాయంటి పెరుగు
తెల్లావుపెరుగు, నల్లావుపెరుగు

(తన అందెల రవళికి ప్రతిగా వినవచ్చే ఆ గజ్జెల రవళి యెక్కడిది? తన కంఠస్వరానికి అనుశ్రుతిగా వినవచ్చే ఆ మధుర వేణుస్వర మెక్కడిది?

భామ : ఎవనిదా వేణుగీతి
చల్లగాలిలో తారుచుపోయే
పూలతావులను తరుముకవచ్చే....దెవనిదా వేణుగీతి?
కదలు నేదో వెదురుపొదలలో
చీకటికాదది శ్యామలదేహము...

బృందగానం : ఘలుఘలుమని తరలిపోవు నా
అందెరవళి యెవరిదో
గలగల గలమని తరిమెడు ఆ చిరు
గజ్జెల రవ మెవరిదో

(తరిమే గజ్జెలు, తప్పుకొనే అందెలు, వెదురుపొదమాటు నున్న వేణుగానలోలుడు వెలుపలబడి వ్రజభామినిని అడ్డగిస్తాడు.)

కృష్ణుడు : మలయానిలమిదే - మెల్లగవీచె
మధువనమిదే - భామా; భామా;

భామ : మధురానగరిలో-చల్లనమ్మబోదు
దారివిడువు కృష్ణా-కృష్ణా

కృ : నీపై మోహాము, నోపలేనే సఖి
నీపతరువుకడ నిలువవె భామా ;

భామ : మాపటివేళకు తప్పక వచ్చెద
పట్టకు కొంగు గట్టిగాను కృష్ణా ;

కృ : సాకులు చూపీ, చల్లగ జారగ
సమ్మతింపనే భామా, భామా ;

భామ : కొసరి కొసరి నాతో, సరసములాడకు
రాచమార్గమిది-కృష్ణా ; కృష్ణా ;

కృ : రాచమార్గమని బెదరింతువొ నను
ఈ చాతుర్యము చాలునె భామా ;

భామ : వ్రజ వనితలు నను చేరవత్తురిక
విడువిడు నా చెయి కృష్ణా ;
మాపటివేళకు తప్పక వచ్చెద
విడువిడు నాచెయి కృష్ణా ;
చల్లోయమ్మ చల్ల ;

(మాపటివేళకు తప్పక వస్తానని బాసచేసి మధురానగరి పోయింది వ్రజ భామిని. కృష్ణుని మురళీగానానికి సమ్మోహితలై వ్రేపల్లెవాడలోని గోపసుందరు లంతా వెతుక్కుంటూ వెతుక్కుంటూ వచ్చేస్తారు.)

గోపీబృందం : ఉందువో మధురానగరి-కృష్ణా,
బృందావనిలో నెందును లేవే ;
ఒదిగినావో-మధువనాల వెదురుల
పొదలనందు పొంచి వెదికినాము

తోటతోట, బాటబాట దాటుచు
పాటపాట ఆలకించినాము.

కృ: రారె రారె; వ్రజభామినులారా;
హాయిమీర యమునాతట వనమున
ఆడగపాడగ రారే;
చెలువ చెలువ నడుమనుందు నిచ్చట
చేయిచేయి కలుపనుందు నచ్చట
తళుకు తళుకు మను మెరపు తీవలై
రాసలీల క్రీడింపగ నాదెస
రారె రారె వ్రజభామినులారా;
హాయిమీర యమునాతట వనమున
ఆడగ పాడగ రారే;

గోపీబృందం: గోపాల బాల మురళీ
గోలోక జీవ మురళీ
మలయానిలాల లోలనాల తేలు తీయమురళీ
లోకాలు నందనాలు సేయు లీల మ్రోయు
మురళీ
లీలావినోద సుందరాధరామృత మధుమురళీ
మాతా యశోదానందన రాధాముకుంద
మురళీ

(రాసలీలానంతరం గోపికలంతా వెళ్ళిపోతారు. కృష్ణుడు సాయంకాల మగువరకు ఆ వనంలోనే చల్లనమ్మబోయిన భామకోసం వేచి ఉంటాడు. చల్లనమ్మబోయిన భామ దూరాన్నుంచి వస్తూ)

మురళీధరుని మోహనగానము
మరల వినబడు నదే
గోపభామినికి — దూరపు స్వర్గము
సరస కనబడునదే

కృ : రావె సఖీ, మధువనికి
ఓ వసంత పూర్ణేందు హాసన్ముఖీ
చందన సురభిళ మందానిల మృదు
సందేశము నీ కందినదో సఖీ.

గోపి : జలభరితములౌ చల్లని మెల్లని
జలధరముల నడకలవే
మదమయూర సమ్మదనాట్యమ్ముల
మృదు కేకారములవే
శిఖి ఫించము తన శిరసున మెరయు
అఖిలలోకములు మురియు
శ్రావణ నీరద శ్యామలదేహుడు
మధువనిలో నను గలియు;

(వ్రజభామినికి ఆపొదచాటునా ఈ పొదచాటునా మురళియే వినబడుతుందిగాని కృష్ణుడు కనబడడు.)

భామ : ఎటదాగితివో; మురళీధరా;
నీ మురళినె విందును, మోమెట కందునో
రావో రావో;

కృ : రాధా ; ఇటు రావో
మాధవి పొదలో మరుగుపడితిగా
వెదకలేవా ; వేసటయా ;

భామ : మాధవి పొదలో మరిమరి వెదకితి
గేలిసేయు కుసుమాలే, కానీ
యిరులలో శ్యామల దేహముగన నెటదాగితివో ;

కృ : రాధా ; ఇటు రావో
యమునా నీల జలములను దాగితి ;
కనలేవో, గాసిలితో ;

భామ : యమునా నీలజలములను వెదికితి
జాలిపడే కెరటాలే, కానీ
కనుల నీరు నిను గననీదే, యెటదాగితివో;

కృ : రాధా యిటు రావో,
తీరపు తిన్నెల వన్నెల వెన్నెల
కనుమా, వేసట తీరా ;

భామ : దాగిదాగి యింతగ నలయింతువా నీరాధ ;
ఆగుము మాధవ, యిక నెటులేగెదు నినువిడిచి ;

కృ : దాగి వెదకికొనుటతోనె తనివితీరు వలపు
ఆగియాగి ప్రేమసుధల నానుటయే పొలుపు

బృందగానం : మధురానగరీ గాథ ;
మరపురాని తీయనైన బాధ
చల్లగొనుచు మధురానగరికి చను
వ్రజభామిని మధురహృదయ శోధ
మధురా నగరి గాథ !

సుభద్రా విజయము

నృత్య నాటిక

ప్రథమ దృశ్యం — ఉద్యానవనం

చెలికత్తెల ప్రవేశం :

బృందగీతం : మాధవునకు తోబుట్టువు
మా సుభద్ర విజయు వలచె
పూచి నవ మధూదయమ్ము
వేచు మాధవీ వల్లిక ;
తలుచునో తలపడోకాని
తనదు మేనమామ సుతను !
ఏదేశము నందు గలడొ
ఎపుడు వచ్చునో విజయుడు ;

(మరికొందరు చెలికత్తెలతో సుభద్ర ప్రవేశం. చెలులు సుభద్ర నుద్దేశించి)

బృందగానం : కనవె సఖి ! వసంతశోభ
వినవె సఖి ! ప్రశాంత పికగీతి
కనవె సఖి ! వసంతశోభ
కూ...కూ...కూ...
కూహు కుహూ...కూహు కూహూ యనుచును
కొమ్మ కొమ్మ రెమ్మ రెమ్మ చాటున

వినవె సఖి! ప్రశాంత పికగీతి ॥కనవెసఖి॥
ఝుం ఝుంఝుం ఝుం
ఝుం ఝుం ఝు ఝుమ్మనుచును
కుంజము కుంజము
కొనలను విరిసే ననలను
వినవెసఖి! హాయిగ భ్రమరరుతి
కనవెసఖి! వసంత శోభ

సుభద్ర ఆశాగీతం :

హృదిలో తీవరించే కోరిక!
ఈడేరుట కందునో నేనిక!! ॥ నా హృదిలో ॥
చల్లగాలి పిల్లలే కొల్లలై
ఉల్లము రంజిల్ల దెసలల్లెగా
మెల్ల మెల్ల పారు నేరు వెల్లువై—హరి
విల్లుగ మిన్నంటె రంగవల్లియై!! ॥ నా హృదిలో ॥
ఆకులచాటున మధువనిలో—
కోకిల పిలిచె కలధ్వనిలో—నా
కోరిక కొండంత యోచు ఊరునే—నా
జీవిక సఫలమైతీరునే! ॥ నా హృదిలో ॥

(ఉద్యానవన దృశ్యము మారి కృష్ణమందిర ప్రాంగణ దృశ్యము వెలువడుతుంది. కృష్ణుడు యోగివేషముననున్న అర్జునుని ఆహ్వానిస్తూ ప్రవేశము)

శ్రీకృష్ణుని స్వాగతగీతం :

యోగివరా! స్వాగతము
మా గృహాంగణము మాన్యమైనదో
॥ యోగివరా! స్వాగతము ॥

జగతిలోని పుణ్యతీర్థముల గని
అగణిత మహిమలు గనవో
కొనవో మాచెలి సేవాంజలులను
కోర్కెలు సఫలము లనవో!
॥ యోగివరా! స్వాగతము ॥

చెలియా! ఈ మునిశేఖరునకు నీ
సేవలొసగు మది తనియ
మహాతపస్వుల మనసులు నిండిన
మనకోర్కెలు పండునె - చెలియా!
॥ యోగివరా! స్వాగతము ॥

ద్వితీయ దృశ్యం :

(కృష్ణమందిరాంతర్భాగమున అర్జునుడు మౌనిరూపమున నుపవిష్టుడై ఉంటాడు. సుభద్ర పూజాద్రవ్యాలతో ప్రవేశం)

సుభద్ర ఆరాధనగీతం :

తాపసాకార! సుకుమార! తరుణోదార
నీ పదమ్ముల సేవ నాపుణ్య ఫలమోయి!
చలువతెమ్మెర వీవనలను పులకింపగా
చందన సుగంధమిదె సుందరశరీరా!
మా విరుల తోటలో నా చెలిమి కలలలో
తావు లీనిన పూలు నీకు మా కానుకలు!
మృదుల సౌరభములో హృదయమే విప్పార
మౌనివర! ఇదిగో కర్పూర నీరాజనము!

వలపు లీడేరగా వాంఛలు ఫలింపగా
వరము లీయగ వచ్చిన రతీధవుండవో!

(సుభద్ర అర్జునుడికి పుష్పాంజలి సమర్పించి ప్రణమిల్లుతుంది. అర్జునుడు పూజల నందుకుని ఆమె నభినందిస్తాడు)

(యుగళగానం)

అర్జునుడు : ఆనందించితిమి సుందరీ! పూజల
కానందించితిమి సుందరీ!
దేశదేశముల తిరిగితిగాని
ఈ సౌహార్దము కానమెందు - మే
మానందించితిమి సుందరీ!

సుభద్ర : దివ్యజ్ఞానులు, యోగివరా!
దయతో నాకిది తెలుపుదురా
దేశదేశముల తిరిగితిరే - కురు
దేశములకు మీరరిగితిరా?

అర్జునుడు : కురుభూములు మరుభూములు మొదలుగ
ధరనంతయుసూ తిరిగితిమి
పుణ్యతీర్థము లపూర్వస్థలములు
భువియంతయు మేమరసితిమి!

సుభద్ర : కురుదేశమ్మున కరినగరమ్మున
కుంతీదేవిని కాంచితిరా?
కుంతీదేవికి ముద్దులకొమరుడు
అర్జునవీరుని అరసితిరా?

అర్జునుడు : కురుదేశమ్మున కుంతీదేవికి
సుతులు దూరమై సౌఖ్యములేదు
ప్రతిజ్ఞాపరుడు పార్థుండిప్పుడు
తీర్థయాత్రలను తిరుగుచునుండె
నిను తన మనమున కూరిమి చెలిగా
అనునిమేషమును తలచుచునుండు !

సుభద్ర : తీర్థయాత్రికుడు పార్థవీరుడే
నా మనోహరుం డగుట పొసగునా
దివ్యజ్ఞానులు యోగివరా :
దయతో నా కిది తెలుపుదురా ?

అర్జునుడు : పార్థుడు, సఖి, నిను బడయుటకై యతి
వేషమ్మున నీ యెదుట నిలచెనే
రావెసఖి ! హయచాలనమున నిను
రయమున దోడ్కొని పోయెదనే !
రావె సఖి ! రా ! రావె సఖి !
రావె సఖి ! రా ! రావె సఖి !

తృతీయ దృశ్యం

(గోవర్ధనోత్సవం. సుభద్రార్జునుల నిష్క్రమణకు అనుకూలించదానికి గాను శ్రీకృష్ణుడు బలరాముని. గోపీజనాన్ని తనతో గోవర్ధనోత్సవానికి తీసుకు పోయి వారిని ఆ ఉత్సవ సంరంభంలో పరవశులనుగా చేస్తాడు.

శ్రీకృష్ణ బలభద్రాది యాదవుల బృందగీతం :

గోవర్ధనా ! ఓ గోవర్ధనా
వానజల్లులు కురిసి

ప్రేపల్లెలు ముంపవా
పంటలు పండింపవా
మా గాదులు నింపవా
గోవర్ధన ! ఓ గోవర్ధనా
ఈ వెన్నమీగడలు
మేమిచ్చు కానుకలు
గైకోని తరుగని సిరి
సంపద లీయవ దేవా !
గోవర్ధన! ఓ గోవర్ధనా !

ఒకరు : యాదవ నాయకులారా! మీకిదె హెచ్చరిక !
మాధవ బలరాములార ! చాలు నుత్సవమిక !
కుంతీసుత కురుహంతకుడు కుహనాయతి వేషముతో
యాదవులను మోసపుచ్చి, మాధవు చెల్లెలి హరించె ;

బృందం : ఎదుర్కొనుం డర్జునుని
మార్కొనుండు కౌరవుని

బలరా : తెండి నాధనుర్బాణాల్
తెండి నాదుహలాయుధం
ముగ్ధ సుభద్ర విడిపింతు !
ముచ్చగుపార్థుని వధింతు !

బృందం : ఎదుర్కొనుం డర్జునుని
విడిపింపుడు యాదవిని !

బల : ఒరే బంధువిద్రోహీ
నిలు నా పాదముల త్రాహి

త్రాహి పాహిపాహి యనుచు
పడరా పార్థ! అపార్థా!

అర్జు : వీరములెందుకు బావా
సారయున్న జగమెందుకు —
పోయిత్రాగి మైమరవక
చెల్లెలి విడిపించుటో నా
చేతి బాణముల పడుటో —
యెందుకులే యెందుకు

బల : హలాయుధ మ్మెత్తితి నీ
తల సహస్ర భిన్నములుగ
మొత్తుదు నిక చత్తువులే
ఎత్తిన గాండివము దింపు!

శ్రీకృష్ణుని సమాశ్వాసగీతం :

ఇంత పంతమేల సోదరా
నీకింత పంతమేల సోదరా
మన కుంతి యత్త కొమరుడె, పార్థునితో
ఇంతపంతమేల సోదరా!
చెలియలు వానిసే వలచెనుగా -
జగతిని వీరుడై వెలసెనుగా —
నీ కింత పంతమేల సోదరా!
బావమరది కల కానుకలో, బహు
మానములో, బాణములా?
చెలియలి చేతిని చేత చేర్చవో

చందనాదులను సత్కరింపవో !

ఇంత పంతమేల సోదరా !

(శ్రీకృష్ణుని సాంత్వనవాక్యములతో బలరాముని క్రోధాగ్ని ఉపశమిస్తుంది. శ్రీకృష్ణుని అనుమతితో సుభద్ర అర్జునుని కంఠమును పుష్పమాలాలంకృతం చేస్తుంది. బలభద్రుని అంగీకారంతో అర్జునుడు సుభద్రకంఠమును పుష్పమాలాలంకృతం చేస్తాడు.)

చెలికత్తెల మంగళగానం :

పాడరే చెలులారా
పరిణయ మంగళగీతి హాయిగా
పాడరే చెలులారా !
మాధవు చెలియలు మన సుభద్రనే
పరిణయమాడెను పార్థవీరుడే !
దవ్వుదవ్వులను తావులపూవులు
చల్లరే - వెదజల్లరే
చందన రసమో వసంతరజమో
చిమ్మరే - విరజిమ్మరే !
నవవధువును సాధించిన విజయున
కీయరే - జయహారతి !
కోరిక తీరిన పెండ్లికొమాలైకు
ఈయరే - శుభహారతి.

మే న క

నృ త్యా నా టి క

(తపోభంగము)

(దృశ్యం : దేవసభ. దేవేంద్రుడు, దేవతలు, అప్సరసలు)

అప్సరసలు : జయతు జయతు త్రిదశ సార్వభౌమా !

బృందారకులు : జయతు జయతు సుత్రామా !
జయతు జయతు శచీరాజ్ఞీ సఖా !
జయతు జయతు శతమఖా !

బృందగానం : అనంత యౌవన మచల వసంతమ్మౌ
నందనవనిమాది !
అజరామర నిత్య జీవనదమౌ
అమృత భాండమే మాది !
అష్టదిగ్గజాళిక గ్రసరమౌ
ఐరానతమ్ము మాది !
స్వచ్ఛధాళధళ్యమున కుపదయౌ
ఉచ్చైశ్శ్రవమ్ము మాది !
సుత్రామ సార్వభౌమ కృపాంచిత
సుధర్మాలయము మాది !

దూత : జయజయ నిస్తుల స్వర్గధామ !
జయనిలింప సార్వభౌమ !

భూలోక విపిన సీమ
శాశ్వత
త్రైలోక్య పదవి కేమొ
విశ్వామిత్రుడు నేడు
నిష్ఠుర
తపశ్చర్య నున్నాడు
రాజర్షి శేఖరుండు
గురుతర
తేజస్వి తాపసుండు !
అతని తపోగ్ని యందు
లోకము
లకాలవిలయమునందు

(క్రోధనాట్యానంతరం)

దేవేంద్రుడు : ఊర్వశీ ఆది ప్రేయసీ!
తిలోత్తమా, మధుకలస్వనీ !
రంభా, సౌందర్యకదంబా !
జ్వలన్నిశ్చల ప్రణయన ర్తకీ, మేనకా !
కల్యాణ మూర్తులారా
నందన
కలకంఠకంఠులారా
శరదిందు వదనలారా
నిర్జర
సౌందర్య సదనలారా

తరుణ మదాలసమైన
సుందర
తనూ విలాసముతోను
మనోజదోహదమైన
మోహన
వినూత్న లాస్యముతోను
మునితపస్సు చెడుగాక !
మేనకా
ప్రణయ లోలుడౌగాక !

అప్సరలు : జయవిష్ణుకృపామృతవర్ధనా
బృందారకులు : జయజయ వృత్రాసురమర్దనా !
జయజయ పర్వత పక్షవిదారీ !
జయ వజ్రాయుధధారీ !

రెండవ దృశ్యం

(అప్సరలు ఆకాశంలో)

అప్సరసలు : రారే రారే నందన కానన సుందరులారా రారే
రారే అప్సరలారా !
రారే వియచ్చరలారా !
విశ్వామిత్రుని దీక్ష,
విఘ్నముచేయు పరీక్ష !
ఇంద్రుని పనుపున నిలకు
సాంద్ర తపోవనములకు
రారే రారే నందనకానన సుందరులారా రారే !

(అప్సరసలు భూలోకానికి అవతరించి, వసంతశోభను తిలకించి నృత్యము చేస్తారు.)

చెలి, మధు ఋతు వేతెంచెనే యిలా తలి !
హేమంతరజని విరమించెనే ! ॥చెలిమధు॥
చెలి, తనువు పులకించెనే
తరులతాళి పరిమళించెనే !
సఖి, తనువు పులకించెనే యిలాతలి !
సఖి, మనము లలరించెనే !
మలయమరు త్తతి వీతెంచెనే !
సఖి, మనము లలరించెనే - యిలాతలి !
మధుఋతు వేతెంచెనే !

(విశ్వామిత్రుని తపోవనానికి పరిక్రమించి)

తమలోతాము :

అడుగోనే తపసి - చెలి
అడుగోనే తపసి
పద్మాసన సంయుత కరపుటితో
అర్ధనిమీలిత నయనయుగళితో
అడుగోనే తపసి !
పుడమి నెవ్వరికి పొందరానిదా
ఇంద్రపదవి నాసించెనో ఏమో !
అడుగోనే తపసి ! చెలి
అడుగోనే తపసి !

(అందరును మునీశ్వరుని చుట్టు కూడుతారు.)

తమలో తాము :

ఒకతె : విరులనో కెంజివురులనో త్రుంచి
తపసిపైని రాల్చుదమా

ఇంకో : అళులనో హారావళులనో కలిపి
తపసిపైన విసరుదమా

మరో : మధువునో సంకుమదమునో తొరిపి
తపసిపైని చల్లుదమా ?

అంతా : తపము చాలించుమా మునివర
తపము చాలించుమా
సౌందర్యమును గాంచుమా - సుర
సౌందర్యమును గాంచుమా !

తమలోతాము :

ఒకతె నింకొకతె :
మౌనీశ్వరుడితడేనా ? ఓహో !

మరొక : మౌనముద్ర యిదియేనా ?

మేనక : ఇంత సుందరుడే యువకుడే ?
ఈ వయస్సున ఈ తపస్సా ?

(మునితో) మునినాథా ! తపమేలా, నినుచాలా
వలచివచ్చిన మముగనవేలా ?
మోక్షమో యింద్రపదమో - నీ
మ్రోలనే నిలిచెనే !
అప్సరసా నృత్యకళా గానరసా
స్వాదనము నిరసింతువదేలా

స్వర్గమో - అపసర్గమో - నీ
సరసనే నిలిచెనే !
మునినాథా ! తపమేలా ? నిను చాలా
వలచివచ్చిన మముగనవేలా ?

తమలోతాము —

రంభ : కదలడేమి ముని ? కనులు తెరవడె
మేనక : వదలడేమే తపోదీక్ష
ఊర్వసి : వృధయేనటే యీ పరీక్ష
తిలోత్తమ : శ్రమ యికేలనే చాలుచాలునే
రంభ : రావే ఓ చెలియా
తిలో : రాతితో ప్రణయమా

(మేనక తప్ప మిగిలిన అప్సరసలు ప్రస్థానం)

మేనక : పరువులిడు వలపులేవో
తరువుతరువుకొక తీవె, తీవెతీవెకొక పూవు
పూవుపూవుపయి వ్రాలి, తేనియల క్రోలిక్రోలి
తేలియాడు భ్రమరాళి
కొమ్మకొమ్మను పికాలు, రెమ్మరెమ్మను శుకాలు !
కమ్మకమ్మని రవాలు, గొంతువిప్పితే చాలు !

(మేనక నృత్యము - శృంగార నృత్యము)

మేనక : నిన్ను జూచినదాది, నీదుమూర్తియె సతము
నెగడు నాహృదినాథ ! తగునె మౌనవ్రతము
మాయవేషమువేసి, మరులలో నిన్ముద్రోసి
మరలిపోవుదునంచు, మదినెంచకోనాథ !

కన్ను తెరపించినా నిన్ను వలపించినా
కలుగు స్వర్గయశమ్ము వలదు నాకోనాథ !
దివిలోన నా స్వప్న భవనాంగణములోన
తెలియకే నీమూర్తి నిలిపికొంటిని నాథ !
ధీరపురుషుడవీవు, దివ్యతేజుడవీవు
ప్రణయ భరితను నన్ను పాలింపవా నాథ !
రావెరావె మదనా, ప్రణయలోకసదనా
చైత్రకుసుమకదనా, రావెరావె మదనా.

మన్మధ : సురశృంగారవతీ ! నవవరదానమ్మిదిగో !
అజేయసుందరిగా నిన్ననుగ్రహించితిలే !
సుమబాణములివిగో ఇక్షుశరాసనమిదిగో !
విరాగియైనముని చిరవిరహతాపముగని
తపస్సునికమాని, నిన్నుపాసించులెమ్ము !

మేనక : మేరుగిరి కదలెనో నా యెదుట మేరుగిరి కదలెనో
క్షీరోదధి పొరలెనో నాహృదిని క్షీరోదధి పొరలెనో
అంతుదొరకెనుగదా, హృదంతరమ్ములో
దాగియుండిన యుగాంతరమ్ముల మదీయప్రేమకే
అంతుదొరకెనుగదా—

మన్మధ : నీనిగూఢప్రేమ నీలోనె దాచుకో !
నిస్తులానంద నిర్ఝర సుందరీమూర్తి
వై దేవకార్యమ్ము సాధింప నేమరకు !
మైమరపు మాని మై వలపు సొలపుల నింపు

కనుదెరచె మునివరుడు !
కదలి, కనుదారి బడు
కాంచనోజ్జ్వలిత చంచల
మేఖలాలతాతన్వి !
మేనక ! జయముకాంచు, మిదె యాశీస్సు !

విశ్వా : నాయెదుట నెవ్వరో నాట్యమ్ము సేయునే,
సత్యంశివంసుందరమ్మైన ఆ మూర్తి
నాకు వర మీయ వచ్చిన యా సదానంద
లోకేశ్వరుని చిద్విలాసరూపమ్మైన !

మేనక : తపము విరమింపవోయ్, మునివర
తపము విరమింపవోయ్... నే
సతత యౌవన లతాంగినోయ్ - ని
న్నితోధిక సుఖాళి తేల్తునోయ్ ! నీ
తపము విరమింపవోయ్ !

విశ్వా : సదానందమూర్తీ బ్రహ్మర్షి
చిదానంద పదమ్మిమ్ము దేవా !
సదానందమూర్తీ !

మేనక : సదాతరుణమౌ సౌందర్యమ్మే
చిదానంద పద నిధానమోయీ
ప్రణయమాధురులు చవిజూడక యే
బ్రహ్మర్షిత్వము పడయగోరుదోయ్ !
తపము విరమింపవోయ్ !

విశ్వా : భువన మోహినీ ! గానవాహినీ !
నాట్య చలచ్చలిత భవ్యసుందరాంగినీ !

మేనక : సుందరమౌ యీ జగమ్మె
నందనమోయీ, ఆ
నందింతము యుగయుగాలు
హాయిగ నోయీ !

విశ్వా : నాతపఃఫలమ్ము నీవు
నా అపవర్గమ్ము నీవు
నా జీవిత నౌకనడపు
నావికాగ్రణివి నీవు

మేనక : సుందరమౌ యీ జగమ్మె
నందనమోయీ, ఆ
నందింతము యుగయుగాలు
హాయిగనోయీ !

నౌకా విహారము

(దృశ్యము : నదీప్రవాహములో తరలిపోయే నావలో గోపికలు, కృష్ణుడు)

గోపికలు : ఐలేసా ! ఐలేసా !
ప్రాలేయాంశుని వెలుగులలో
నీల యమున వడి తరగలలో
కృష్ణ సఖునితో గోపికలంతా
కేళీనౌక - విహారము కోరి
తేలిపోవుదురు పారముమీరి
ఐలేసా ! ఐలేసా !

కృష్ణుడు : జోరు జోరు సెయ్ ! బారు బారు వెయ్ !

అంతా : జోరు జోరు సెయ్ ! బారు బారు వెయ్ !

బృందగీతి : ఆకసమ్ములో చందురుకోవ
నీలయమునలో తేలెడి నావ
తెలితెలి మబ్బుల యిసుకపొరలలో
తేలుచు సాగే చందురు నౌక
వలివలిగాలుల నీలియలలపై
కులుకుచు పోయే చెలువలనావ

కృష్ణుడు : జోరుజోరుసెయ్ ! బారుబారువెయ్ !

అంతా : జోరుజోరుసెయ్ ! బారుబారువెయ్ !

కృష్ణుడు : మెరపు మెరిసెను, ఉరుము ఉరిమెను
ఆకసపంచున అలజడాయెను !

గోపికలు : ఆకసపంచున నీలిదుప్పటీ
పైకి ప్రాకి జాబిలి మరుగాయెను !

కృష్ణుడు : జోరుజోరుసెయ్! బారుబారు వెయ్!

అంతా : జోరుజోరుసెయ్ ! బారుబారు వెయ్!

గోపికలు : గాలిరేగెను, ఇరులు మూగెను!
మబ్బు లల్లెను, మెరపు త్రుళ్లెను !

ఒక గోపిక : అపాయ మపాయ మోయి ప్రభూ,
తుపానుగాలులు కృష్ణప్రభూ !
విపరీతమ్మగు తుపానులో
విచలిత మౌతోం దీ నావ !

గోపికలు : ఎదీగాని యీ నదీ గర్భమున
ఏమౌనో తెలియదు గోపవిభూ !

కృష్ణుడు : గోపికలారా ! నా కదియేమో !
ఏ పని చేయగ తోచ దదేలా !
తెడ్డు వేయునది మీరే కాదా
ఒడ్డున వేగమె చేర్పగరాదా!

గోపికలు : భయంకరమ్మగు ప్రభంజనంలో
భయభ్రాంతలము మము దరిజేర్పగ
భద్రనావికుడ వీవేనోయీ !
పరీక్షింప కిక పడవ నడుపుమోయ్ !

కృష్ణుడు : గోపికలారా, యీ స్తుతి యేలా
కొలది నావికుని గొప్పసేయకుడు
మీ కిది శిక్షో, నాకె పరీక్షో

గోపికలు : అయ్యో ! అయ్యో ! అదియేమో !
కొయ్యనావలో జలధారే!
నదీగర్భమున నావ మునుగునా ?
ఇదేమి కృష్ణా, నీవు కనగనా !

కృష్ణుడు : గోపికలారా ! నేనును మీవలె
నిస్సహాయుడను, ఓపిక కావలె.
అపాయమును తప్పింపంగా మరి
ఉపాయమేదో ఉందేమో !

గోపికలు : ఎదీగాని యీ నదీగర్భమున
ఏమౌనో తెలియదు గోపవిభూ !
అపాయమును తప్పింపంగా, ఏ
ఉపాయమైనా సెలవీయి !

కృష్ణుడు : గోపికలారా! నాకదియేమో
ఏపని చేయగ తోచదదేలా !
నావ కడుపులో రంధ్రమొకండు
మీ వలువలతో పూడ్చగనిండు !

గోపికలు : నదీగర్భమున నావమునుగునా ?
ఇదేమికృష్ణా, నీవుగనగనా
కానిసమయమందు పట్టి
మానిసులనె, యీ విధిగా
పరీక్షింప న్యాయమేన ?
మరి వెరవే ఌరవేనా ?

కృష్ణుడు : వనితలార, అహంకార
వసనములను జారవిడిచి

మడిచి, నావ క్రంతలోన
మాటు వేయ వరద లడగు,
మునుగకుండ నావ కదలి
చను తీరము దరికి త్వరగ

బృందగీతి : మురళి తీసి మొలను దోపి
మూతి ముడిచి తెడ్డు విడిచి
ఒదిగి కృష్ణు డోసరిల్ల
మోకరిల్లి రువిద లెల్ల.

గోపికలు : కొంటెవాడ వనుకోమా ?
పంతకారి వనుకోమా ?
పురుషోత్తముడనుకోమా ?
వరదాయకుడనుకోమా ?
అంతపంతమే అయితే
అవిగో వలువ, లివె మ్రొక్కులు.

కృష్ణుడు : తొలగెను వలువలు, తరిగెను కరువలి ;
నిలిచిరి చెలువలు, నిలిచెను వరదలు ;
నిలిచెను కరువలి, తొలగెను వరదలు ;
తరుగని వలువల నిలిచిరి చెలువలు.

బృందగీతి : ఐలేసా, ఐలేసా, ఐలేసా, ఐలేసా
నెమ్మదినడకల నీలయమునపై
కమ్మగ వీచెను చలువ తెమ్మెరలు ;
సన్నని వెలుగున కృష్ణుపెదవిపై
మన్ను మిన్నొలయు మోహనమురళి ,
ఐలేసా. ఐలేసా, ఐలేసా, ఐలేసా.

పుష్పలావికుడు

(నాల్గువీధులు కలిసే శృంగాటకము నడుమ నెలకొన్న ఉపవన చతురస్రము ముందు)

స్త్రీబృందం : పూవులరంగడు రాలేదే చెలి
పూలదండలను తేలేదే

కన్య : ఎన్ని నాళ్లుగా పూవులు లేక
కమ్మటితలపులు కరవయ్యేనే
కలలు చీకటయ్యేనే - చెలి, నా
కలలు చీకటయ్యేనే !

స్త్రీబృందం : పూవులరంగడు రాలేదే చెలి
పూలదండలను తేలేదే !

కోడలు : ఎన్ని నాళ్లుగా పూవులులేక
కన్నెత్తక నాప్రియుడలిగేనే !
వన్నె యేదో తరిగేనే - నాలో
వన్నె యేదో తరిగేనే.

స్త్రీబృందం : పూవులరంగడు రాలేదే చెలి
పూలదండలను తేలేదే !

తల్లి : ఎన్ని నాళ్లుగా పూవులు లేక,
కన్నతండ్రి పాలుత్రావలేదే,

కనులు విప్పనేలేదే - ఏమో
కనులు విప్పనేలేదే!

స్త్రీబృందం : పూవులరంగడు రాలేదే
పూలదండలను తేలేదే!

(స్త్రీబృందమంతా విషాదంతో వీధిమలుపువైపు చూస్తుండగా ఆ వైపు నుంచి పూవులరంగడు రకరకాల పూలదండలను ఒక దండెమునకు వ్రేలకట్టుకొని తీసుకవస్తుంటాడు.)

పూవులరంగడు :

పూలదండలోయ్ - ఒహోయ్
పూలదండలోయ్
కన్నెలకెన్నో వలపుల
కలలనిచ్చు కమ్మకమ్మ - పూలదండలోయ్
కన్నతల్లి యానందము
గన్నకనుల తేనెలొలుకు

స్త్రీబృందం : ఈవేళైనా వచ్చావా మరి
పూవులు తెచ్చావా - రంగా
పూవులరంగా పూవులరంగా
ఏంవైనావో యిన్నాళ్లూ!

రంగ : ఏంవైనానో యిన్నాళ్లూ, నే
నేంవని. చెప్పనో ఇల్లాలా? నే
నేంవని చెప్పనో తల్లీ!
ఏంవని చెప్పుదమన్నా నామది

కెంతో బెంగగు నిల్లాలా! నే
నేఁవని చెప్పనో తల్లీ!

కన్య: కన్నులనీరా, రంగా, నీకూ
కరిగేనా మనసు?

కోడలు: చింతా, వంతా, రంగా, నీకూ
చెరిచేనా మనసు?

తల్లి: పిల్లాం, మేకా, రంగా, నీకూ
బెంగేనా మనసు?

రంగ: పూలు తెచ్చి మీ కివ్వకపోతే
పోయెపోయె నా సుఖమంతా!
వెన్నెలవిరిసే శరదృతువుతో
వెళ్లిపోయె నా సుఖమంతా!
చలితుపానులో జలజలజలమని
తలలు వ్రేలవేసి వ్రాలె పూవులు
మంచుజడులలో తోటయె కూలి, న
శించె కొంచెమేని మిగులకుండ.

స్త్రీ: నష్టపోయినా తోటనుతిరిగీ
కష్టముపై పూయించావా?
ఇంత చక్కటి పూవు లవెన్నో
ఎలాగ తెచ్చావ్ రంగా?

రంగ: ఆ హేమంతం అటు పోగానే
తిరిగి వసంతం వచ్చెనుగాదా;

తమంతతామే పూవులతోటలు
అమాంతముగ చిగిర్చివిరిశాయి!
తోటనుపూలు, బాటనుపూలు,
ఇంటినిండ తెగవిరిసిన పూలు,
నవవసంత ఋతు నవ్యసుమాలు,
యువకహృదుల నలరించేపూలు!

స్త్రీలు : పూవులరంగడు వచ్చాడే చెలి,
పూలదండలను తెచ్చాడే!
తోటనుపూలు, బాటనుపూలు,
ఇంటినిండ తెగవిరిసిన పూలు
నవవసంతఋతు నవ్యసుమాలు,
యువకహృదుల నలరించే పూలు!

రంగడు : పూలదండలోయ్ ఓహోయ్ పూలదండలోయ్.

(నిష్క్రమణము)

మధ్యస్థాయి

రాసలీల

శ్రీకృష్ణ కర్ణామృతము, పోతనగారి భాగవతము ఆధారములుగా కూర్చిన సంగీత నాటిక.

(యమునా తీరం, ఉపవనం – కృష్ణుడు ఒక యెత్తైన తిన్నెమీదో, ఒక చెట్టుకొమ్మపైనో ఒక నది ఒడ్డునో, వరుసగా అన్ని స్థలాలనుంచీ వేణు గానము చేస్తుండగా గోపజనం గుంపులుగా అతన్ని అనుసరించి వస్తుంటారు.)

వేణునాదం – సంధ్యాకాలోచితమైన హిందోళరాగం

బృందగీతి : అల్లదే, అల్లదే పిల్లనగ్రోవి,
హాయిగా, తీయగా, మాధవుమోవి,
మెల్లగా, నల్లగా, మెదలెడు మొయిలు
చల్లగా, ఠీవిగా సాగెడు హాొయలు,
ప్రేమతో ప్రతిహృదీ పిలిచెడు రీతి,
ప్రతిహృదీ తన హృదీ కలిపెడు గీతి
వ్రజభువి ప్రజలదే గృహములు విడిచి,
బాటలో, తోటలో పరువుల నిడుచు,
వలపులో, సొలపులో, అలయికతీరా
ఆటలో, పాటలో, అలరెడువారే.

(సూత్రధారుడు ఈ పద్యములు రంగస్థలములో ఒకప్రక్క నిలుచుని పాడుతుంటే గోపగోపకులు మురళీగాన లోలుడైన కృష్ణుడు పద్యములలోని భావముల ప్రకారం భంగిమముల మార్చుకొంటూ అభినయించాలి.)

కర్ణావతంసిత కర్ణికారప్రభ గండభాగద్యుతి గడలుకొనగ
భువనమోహనమైన భ్రూవిలాసంబుతో వామభాగానత
వదనమొప్ప

అపసవ్య కర మృదులాంగుళీచాతురి పడ్జధ్వనికి మర్మసరణిప
డాకాలిమీద నడ్డము సాచి నిల్పిన పదనఖద్యుతి భూమి
ప్రబ్బికొనగ
మౌళి పింఛము కంఠ రాజమును మెరయ, విలసితగ్రామముగ
నొక్క వేణు వందు
బ్రహ్మగాంధర్వ గీతంబు పరగజేసె, చతుర నటమూర్తి
గోపికా చక్రవర్తి.

సరమ : శ్రవణోదంచిత కర్ణికారకముతో, స్వర్ణాభచేలమ్ముతో
అవతంసాయిత కేకిపింఛకముతో, అంభోజదామమ్ముతో
స్వవశుండై మధురాధరామృతముచే వంశంబు పూరించుచున్
ఉవిదా మాధవు డాలవెంట వనమందొప్పారెడిన్ జూచితే.

సురస : రావే సుందరి, ఏమె బోటి వినవే, రాజీవనేత్రుండు, బృం
దావీథిం దగ వేణువూదుచు లసత్సవ్యానతాస్యంబుతో
భ్రూ విన్యాసము లంగుళీక్రమములున్ పొల్పార, పడ్జంబుగా
గావించెన్ నటుభంగి బ్రహ్మమగు తద్గాంధర్వ సంగీతమున్.

రాధ : నీ పాదకమలంబు నెమ్మి డగ్గరగాని, తరలిపోవంగ పాదములు
రావు,
నీ కరాబ్జంబులు నెరి నంటితేగాని, తక్కినపనికి హస్తములు
చొరవు
నీ వాగమృతధార నిండగ్రోలగగాని, చెవుల న్యభాషలుచేరి
వినవు,
నీ సుందరాకృతి నియతిజూడగగాని, చూడ వన్యంబుల
చూడ్కికవలు

నిన్నె కాని పలుక నేరవు మా జిహ్వా, లొల్లననుచు
పలుకనోడవీవు
మా మనంబులేల మరలిచి దొంగిలి తేమి సేయువార
మింక కృష్ణ.

సురస: అత్తలు మామలున్, వగవ, ఆడికకోడక, సాధులన్ దురా
యత్తుల జేసి యిల్వరుస లారడివోవగ నీదు నవ్వులన్
మెత్తని మాటలన్ మరుడు మేకొని యేచిన వచ్చినారమే
పొత్తుల నొల్లమో పురుషభూషణ దాస్యములిచ్చి కావవే.

రాధ: సిరికి నుదార చిహ్నములు సేయు భవచ్చరణారవిందముల్
సరసిజనేత్ర, మా తపము సంపద జేరితి మెట్టకేలకున్
మరలగలేము మామగల మాటల నొల్లము పద్మగంధముల్
మరగిన తేటు లన్యకుసుమంబుల చెంతల చేరనేర్చునే?

కృ: మేలామీకు? భయంబు పట్టదుగదా, మీ మందకున్ సింహ శా
ర్దూలానేకప ముఖ్యముల్ తిరిగెడిన్ దూరంబు లేతెంతురే
చాలుంజాలు లతాంగులార చనుడా సంప్రీతితో మందకున్
ఇది యమునా నదీ జలసమేధిత పాదపపల్లవ ప్రసూ
న దళ విరాజితంబగు వనంబు, మనంబుల మేర దప్పెనో
పొదిగిట నేడ్చు బిడ్డలకు పోయుడు పాలు, విడుండు లేగలన్
మొదవులకున్ నిజేశ్వరుల ముద్దియలార భజింపుడొప్పుగన్

సురస: పతులన్, బిడ్డల, బంధులన్, సతులకున్ పాటించులే ధర్మ ప
ద్ధతి యౌనంటివి దేహధారిణులకున్ ధర్మజ్ఞ, చింతింపుమా
పతిపుత్రాదిక నామమూర్తివగుచున్ భాసిల్లు నీయందు, త
త్పతిపుత్రాదిక వాంఛలన్ సలిపి సంభావించు టన్యాయమే

(మురళి చేతనుంచుకొని నిల్చున్న కృష్ణుని చుట్టూ గోపగోపీ జనమంతా మూగి, భంగిమలు మారుస్తూ బృందగానం చేస్తారు)

బృందగీతి : నల్లమబ్బున మెరపుతోచె.
నల్లనయ్య మొగాన నవ్వుల్లు పూచె
మురళిపట్టిన కీలు సరసముగ లేచె
మలయ పవనమ్ము శిఖిపింఛమ్ము నూచె
కొంటె చూపుల చందమామ
మింటమబ్బుల వెన్క తక్కుచూ తారుచూ,
వెంటనంటగ చుక్క పడుచులు
ఆడె దాగుడుమూత లపుడు

రాధ : దాగుడు మూతల దండాకోరూ,
రాగదవోయీ కృష్ణయగారూ

గోపికలు : మాయల కృష్ణునిపై మమతలు మనకెపుడూ
దాగుడుమూతర్రా ఆడగరండర్రా

కృ : చూదాం పంటెవరో

గోపికలు : చూదాం దొంగెవరో
నువు పంట, నువుపంట
నువు పంట, నువు పంట
నువు దొంగా, నువు దొంగ
నువ్వు దొంగా

రాధ : కృష్ణుడు దొంగర్రా, దూరం పొండర్రా
తెల్లని వెన్నెల్లో, నల్లని దొంగర్రా,
కృష్ణుడు దొంగర్రా!

హాయిగ వేణువు నూదే, మాయలమారర్రా
హృదయాలే నగలయితే, పదిలం పొండర్రా!
కృష్ణుడు దొంగర్రా!
ఏదీ నీచేయి, కృష్ణా రావోయి,
దొరవైతే చేస్తారే, యేదో ముస్తాబు?
దొంగవైన నీకూ చేస్తామొక ముస్తాబు.

గోపికలు : దొరవైతే చేస్తారే యేదో ముస్తాబు,
దొంగవైన నీకూ చేస్తామొక ముస్తాబు.

రాధ : దొంగవైనావా కృష్ణా,
దొంగవైనావేదీ నీ కను
దోయి మూయనీ - కృష్ణా

కృ : తామరపూవో, నీ యరచేయో
ఏమిమూత, లోకమెల్ల కనబడు

రాధ : వ్రేళ్ళసందులను చూడకోయి, నీ
కళ్ళలోన పుప్పొళ్ళు చల్లుతా

కృ : కళ్ళుమూసినా ఎల్లలోకములు
కానబడునె, నాకీ గంతేలా?

రాధ : గంతగట్టిగా కట్టినానులే
సుంతసందయిన దొరకబోదులే
గోపగోపిజనమంతా దూరం
గా పదండి దాగుకోండి, సై.

అంతా : దొంగవైనావా కృష్ణా
దొరవు కావోయ్, మమ్ముపట్టుకొని

రాధ : దొరవు కావోయ్

గోపికలు : ఎవరికి వారే యమునాతీరే
కృష్ణుడు కృష్ణుడు దూరంపోరే
మహర్షులంతా మానినులై
వెదుకుదురట తనకోసం
తానే యిప్పుడు దొంగై వెదకును
మానినులా మనకోసం, ఎవరికివారే
తరులచాటునా, పొదలమాటునా,
యమున కడుపులో, దారి మలుపులో
దాగుకోండి, దాగుకోండి - పొండి
కృష్ణుడు కృష్ణుడు దూరంపోరే
యమునా తీరే ఎవరికి వారే

(తరులమాటునా, పొదలచాటునా అక్కడక్కడ దాగుకొన్నగోపికలను వెతకికొంటూ కనులకు గంత కట్టుకొన్న కృష్ణుడు)

కృ : ఎవరెవరీ - త
రువు వెనక

సుర : ఎవరైతేం - వె
దక లేకా

కృ : ఇదిగిదిగో
దొరకినావు

సరమ : అదిగదిగో
దొరక లేదు

కృ : ఎవరోయీ
యమునలోనా

సురస : కనవోయీ - త
టముపైని

కృ : చిక్కిందే
ఎవరిచేయి ?

సరమ : కాదోయి కలువ
కాడోయి

కృ : ఈ పరిమళము గాధతలది

సురస : కాదోయి మాలతీలతది

కృ : నడచునా మాలతీలతలు ?

సరమ : నీస్పర్శ కేదైన కదలు

కృ : ఇదిగిదిగో, దొరకె రాధా

గోపికలు : తనయంత తనె కోరికాదా
మాధవు కరయుగ బంధముకోరీ
రాధ దొంగాయె కాదా

రాధ : ఏడీ, కృష్ణుడేడీ

అంతా : ఏడీ, కృష్ణుడేడీ ?

సూత్రధారుడు ;

చిక్కక యీశుడై యెదిరి చిక్కులపెట్టెడు మాయలానికిన్
చిక్కికృతార్థలై మరుని చిక్కుల జొక్కి లతాంగు లుండగా
మక్కువ శాంతి సేయుటకు మన్ననచేసి, ప్రసన్ను డౌటకున్
చక్కన నా విభుండు గుణశాలి తిరోహితుడయ్యె నచ్చటన్

బృందగీతి : ఎందుబోయితివోయి కృష్ణా, కృష్ణా
ఇందు మమ్మెల్లరను వదలి, కృష్ణా
ఆటపాటల మమ్ము అలరించినావే
ఏటికింతటిలోనె మాయమైనావు ?
ఎందుబోయితివోయి కృష్ణా కృష్ణా
ఇందు మమ్మెల్లరను వదలి, కృష్ణా

సురస: నల్లనివాడు పద్మనయంబులవాడు, కృపారసంబు పై
జల్లెడువాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు నవ్వు రా
జిల్లెడు మోమువాడొకడు చెల్వల మానధనంబు దెచ్చెనో
మల్లియలార, మీ పొదలమాటున లేడుగదమ్మ చెప్పరే

సరమ: అంగజునైన జూడ హృదయంగముడై కరగించువాడు, శ్రీ
రంగదురంబువాడు, మధురంబగు వేణురవంబువాడు, మ
మ్మంగజు పువ్వుతూపులకు నగ్గముచేసి, లవంగలుంగనా
రంగములార మీకడకు రాడుగదా, కృప నున్న జూపరే.

రాధ : అదె నందనందనుం డంతర్హితుండయ్యె
పాటలీ తరులార పట్టరమ్మ
హేలావతుల, కృష్ణ ఏల పాసితివని
ఐలేయలతలార అడుగరమ్మ

వనజాక్షు డిచటికి వచ్చి దాగడుగదా
చూతమంజరులార చూడరమ్మ
మానిన మదనుతో మారాక యెరిగించి
మాధవీలతలార మనుపరమ్మ

జాతిసతుల బాయ నీతియే హరికని
జాతులార దిశల చాటరమ్మ
కదళులార పోయి కదలించి శిఖిపింఛ
జూటు దెచ్చి కరుణ జూపరమ్మ

బృందగీతి : ఎందుబోయితివోయి, కృష్ణా, కృష్ణా
ఇందు మమ్మెల్లరను వదలి, కృష్ణా
ఏల మాకీ శోధ

రాధ : మరచితివా నీ రాధ

అంతా : ఒక నిమేసమ్మేని ఓపలేమోయి,
ఊరకేల వియోగబాధ, కృష్ణా ఎందు

(కష్ణుని వెతుక్కుంటూ రాధా గోపికలూ అంతా తలఒక దిక్కుకీ వెళ్లి పోతారు. తెరయెత్తగానే వెనుక యమున ఒడ్డునే మరొకచోట ఎత్తయిన యిసుక తిన్నెపైని కృష్ణుడొక్కడూ ఆలోచనా పరుడైనట్లుగా కూర్చుని ఉంటాడు.)

కృ : ఆడగ మనసౌను నాకు
పాడగ మనసౌను.
చెలువ చెలువ కొక కృష్ణుడనై
వలచి వలచి సంతుష్టుడనై
చేతచేత చేయి చరచి

యెడద యెడద నెడద పరచి,
వలపున త్రిజగాలు, మరచి-ఆడగ
మురళిని చేగొని మధుర
స్వరముల ప్రసరింతు దెసల
వ్రజ భామిను లెల్ల వలచి
వచ్చి వ్రాలవలయు మ్రోల - ఆడగ

(కృష్ణుని ఆహ్వాన పూర్వకమైన వేణునాదం వినబడుతూంటే గోపిక లంతా ఒకరొకరుగా సమ్మోహితలై వచ్చి కృష్ణుని చుట్టు మండలాకారంగా నిలిచి, చేతులు చరుస్తూ నృత్యం చేస్తారు.)

కృ : రారె రారె రారే
వ్రజభామినులారా
ఈ బృందావనిని నేడు
రాసలీల నోలలాడ

గోపికలు : అగుపించితె నాథ
ముగిసెనె నీ శోధా
కలిగెనెంత కరుణ
నందకులాభరణ

కృ : చెలువ చెలువ నడుమ
చేయి చరతు నిచట
చేయి చరచు చెలువ కిరు దె
సల నిలిచెద నచట

గోపిక : ఈ చేతికి నీవే
ఆ చేతికి నీవే

ఇరుప్రక్కల నీవే, ఇం
దరి నడుమను నీవే -

అంతా : రారె రారె రారె
రాసలీల నోలలాడ

అంతా : అంగనా మంగనాం

అంతా : అంగనా మంగనాం
అంతరే మాధవ
మాధవం మాధవం
చాంతరేచాంగనా
ఇత్థ మాకల్పితే
మండలే మధ్యమం
సంజ్యగా వేణునా
దేవకీ నందన

(మండల నృత్యం)

స్వప్న సీమ

(ఈ నాటిక దృశ్యవిధానము రంగురంగుల కాంతిప్రసారములతో, కత్తిరించిన అట్టబొమ్మల స్వప్న దృశ్యములతో రంగస్థల నిర్వాహకుడు స్వయంగా కల్పించాలి.)

బృందగీతి : స్వప్నసీమలో హాయి
వలపుజడులతో మంత్రించే మాయలసన్నాయి
సగముమేలుకొని యెదలో కదిలే కోర్కెలరేయి
స్వప్నసీమలో హాయి
తెలివి మరపు పొలిమేరల వెలిగే నీరెండ
తొలిజన్మల వలపింతలు తలపు తెరలు నిండ
స్వప్నసీమలో హాయి...

సఖులు : నిదురపోవె నిదురపోవె నిదురపోవె సఖి
నిదురలోన నీయాశలు కదిలి నింగికెగయున్
నింగిలోన స్వప్నసీమ నీడలొాచు నాడు నే
నీడలందు దాగిన నీప్రియుడు నిన్ను కూడునే

—స్వప్న నేపథ్య సంగీతం—

ఆమె : ఎటకో, ఎటకో, ఎటకో, ఏకాకినిగా నెటకో
విరులేవీ, తరులేవీ, దిగుచున్నవి వరుస వరుసలై
జలదాలా, తారకలా, నన్నొరసి, వెలుగు చంద్రికలా
ఎటకో, ఎటకో, ఏకాకినిగా నెటకో

దూరసీమాంతముల తోచునెవో
మాధురీమూర్తులై పిలుచునవే
జన్మజన్మాంతర స్నేహాలు
ధన్యసౌహార్దపు తరంగాలు! ॥ ఎటకో ॥

అతను : ఎటకో అని దిగులా
ఏకాకినివని వగలా ?
సుందరి, నే చంద్రుడనే
నా మందిరమునకు నీవె చంద్రికవే, ఒహో సుందరీ

(ఒక స్వప్నం కరిగిపోయి మరొక స్వప్నం రూపు తాలుస్తున్నట్లు స్ఫురింపజేసే నేపథ్య సంగీతం.)

ఆమె : తుదిలేని యాత్రలో - ఎటకో
యుగయుగాలుగ ఒంటరిగ ఈ జలధిలోన
తుదిలేని యాత్రలో - ఎటకో

అతను : జంటగా నేనుండ ఒంటరివదెటులౌదు ?
నదివినీవేకావె ? నావ నేనేకాద ?
ఓ ముగ్ధ మధుమోహనాంగి, ఓ యౌవనీ
ఓ మదీయ ప్రేయసీ...

ఆమె : రమ్ము ప్రియతమా !

(మళ్లీ ఒక స్వప్నం కరిగిపోవడం, మరొక స్వప్నం రూపు తాల్చడం సూచించే నేపథ్య సంగీతం.)

సఖులు : ఊగవమ్మా ఓ చెలియ ఉయ్యాలా
ఉయ్యాలా ఉయ్యాలా

ఊగవమ్మా ఓ చెలియ ఉయ్యాలా
చింతకొమ్మల వుయ్యాలా
వంతలుడిపే వుయ్యాలా
వలపులూరే వుయ్యాలా
వన్నెలొలికే వుయ్యాలా

చెలులు : ఊగవమ్మా ఓ చెలియ ఉయ్యాలా
ఊగవమ్మా ఓ చెలియ ఉయ్యాలా

అతను : ఊగవే ఓ చెలియ ఉయ్యాలా

ఆమె : ఊయల ఊపేదెవరే ?
ఆపరే, ఆపరే, ఊయల ఊపేదెవరో ?
ఆపరే, ఆపరే, నే పడిపోవుదునేమో...

(స్వప్న దృశ్యములు సమసిపోయి, వినీలాకాశ నేపథ్యంలో కవి కనబడతాడు.)

కవి : నిదురపోవు యౌవనము మేనిసొగసందు
కదలియాడు కోర్కెలు స్వప్నగగనమందు
కంటతోచుచు సురుగు చుక్కలను పోలు
ఆ మనోహారిణికి ప్రేమకదియె తొలుత

సఖులు : ఓ సఖి, నీ యౌవనలతిక
ఏ సహకార సఖునకే-ఓ సఖి
రెక్కలు పరచుక పరిమళ మధువులు
దిక్కుదిక్కులా చనునెవ్వనికై - ఓ సఖి
స్వప్నసీమలో ఛాయామూర్తుల
ఆప్తులనుచు వెదకెద వెవ్వనికై -ఓ సఖి

ఆమె : ఎవ్వరో అతడెవ్వరో
పూలదారుల తేలిపోయే
గాలితేరుల నెవ్వరో
స్వప్నసీమల యెడద తాకుచు
సాగిపోయెడి దెవ్వరో ;
ఎవ్వరో అతడెవ్వరో ;
తోటతోటల యౌవనము సెల
యేటి పాల్మైముంచెగా
ముంగిటను నను రమ్మనుచు స
మ్మోహితను గావించెగా – ఎవ్వరో ;

సఖులు : కలలలో కనుగొన్న నీడలు
వలయునంత లభించునేమి ? ఎవ్వరో-అతడెవ్వరో
నీ మెచ్చు సుందరుడాతడా ? ఆ
వచ్చు నవయౌవనుడదెవ్వరో-ఎవ్వరో అతడెవ్వరో

అతను : ప్రియురాలా, నా ప్రియురాలా ని
న్నెరుగనచే ప్రియురాలా, నిన్నెరుగనచే
కలలోనో మెలకువలోనో
తొలిజన్మల వలపులలోనో, ని
న్నెరుగనచే నా ప్రియురాలా ;

ఆమె : స్వప్నసీమలో తేలీ సోలీ
సఫలమాయెగా నాయాశల్, సఫలమాయెగా
ఏకతమ్ముగా జగతి, ఈ క్షణమ్ముకై వేచి
ఎన్ని పవలు రేలో తపించినానో నే కృశించినానో

కనులు తెరువగా యెదురై, కామదేవుడే నిలిచీ
హృదయమందిరమ్మె తెరచినాడే వలపించినాడే
స్వప్న సీమలో తేలిపోలీ సఫలమాయెగా నాయాశల్
సఫలమాయెగా...

బృందగీతి : స్వప్న సీమలో హాయి ;
వలపు జడులతో మంత్రించే మాయల సన్నాయి ;
సగము మేలుకొని యెదలో కదిలే కోర్కులరేయి ;
స్వప్న సీమలో హాయి ;
తెలివి మరపు పొలిమేరల వెలిగే నీరెండ
తొలిజన్మల వలపింతల తలపు తెరలు నిండ ;
స్వప్న సీమలో హాయి ;

సుమజన్మ

బృందగీతి : వలపుల పలవరింతలో - బ్రతుకే పులకింతలై
జతకై యీ జగమంతా - వెదకివేచినావా
అదే నవ వసంతమో - శిశిర ఋతు నిశాంతమో
పలుకుతేనె జడులతో - కానుక కావిడులతో
చిరునగ వొలుకుచు - వలపుల చిలుకుచు
నిను దరిసినాడు
అదే నవవసంతమో - శిశిర ఋతునిశాంతమో
కాలరాత్రి నీలమేఘమాల లాకసమ్మునిండె
అంతలోన ఆ వసంత మాశాంతతనంతరించె;

(నిరాశావృతయైన నాయిక - యెదుట భగవంతుని సూచించు ఒక పరివేషము వైపు దృష్టి నిగుడ్చి ప్రవేశిస్తుంది.)

నాయిక : పూవునై పుట్టనీవా దేవా!
జీవితమ్మొక పవలెనిల్చుతావితో;
పూవునై పుట్టనీవా దేవా!
వాకిట నిలిచి బాట వైపె చూపానించి
వేచితెన్నాళ్లొ నా విభురాక నాసించి;
జీవితమ్మొక పవలె నిల్చు తావితో
పూవునై పుట్టనీవాదేవా!
ఈ దీర్ఘ జీవితమ్మి నిరాశావృత
మ్మిలీలనేకాకిగా నైపగాజాల
వలవంతలో నెంతయొ తపించి, కృశియించి

ఉసురు వీడని మరణమా అనుక్షణము,
పూవునై పుట్టనీవా దేవా!
జీవితమ్మొక పవలె నిల్చు తావితో;

(కనుమూసి కనుతెరచేటంతలో నాయిక మాయమయి, ఆమె స్థలంలో ఉషః కాంతిలో ఒక లతా, లతను అంటి, అందమైన సుమకన్య నృత్యం చేస్తూ ప్రవేశం.)

పూవు: హోయి, హోయి
హోయినూయలూగెదా
తళుకుతో, తావితో, కొమ్మను కొసరెమ్మపై
కులుకుతో బలుపుతో, తేనెసోనలొలుకుతో
హోయి హోయి హోయి:
వలపుతో, వాంఛతో, చివురు గుబురు పరుపుపై
పవళించిన కైపుతో, దవుదవ్వుల చూపుతో
హోయి హోయి హోయి;
హోయి నూయలూగెదా;

బృందగీతి: తరుశాఖలపై తలసూపెనదే, సుమకన్య అదేసుమకన్య
సుధలానగరావోయి, రావోయీ. ఓహో; మధుపాయీ;
వడగాలిని వాడునొ యేమో
జడివానల రాలునొ యేమో
మరునిముసమె మనదో కాదో;
మధువే కరవగునో తొరపడవో;
తరుశాఖలపై తలసూపెనదే—సుమకన్య; అదే సుమకన్య;

రేపని మాపని చూడకుమోయి,
రెప్పపాటె సుమ యీ బ్రదుకోయి,
మరునిముసమె మనదౌకాదో...
మధువే కరవగునో తొరపడవొ...
తరుశాఖలపై తలసూపెనదే సుమకన్య; అదే;
సుమకన్య ;

(ఝుం ఝుం నాదముతో నాట్యము చేస్తూ మధుపకుమారుని ప్రవేశము.)

మధుప : ఓ సుందరీ ; కుసుమసుందరీ ; సుమసుందరీ ; కుసుమ సుందరీ ;

సుషమ చంద్రికా మధురమందహాసినీ;
సుందరీ, కుసుమసుందరీ;
పవనమాలికా చలితనవడోలికా
పరిమళోల్లాసినీ మదభర విలాసినీ
ఓ సుందరీ ; కుసుమసుందరీ;

బృందగీతి : అదే నవ వసంతమో, శిశిర ఋతునిశాంతమో
పలుకు తేనె జడులతో కానుక కావిడులతో
చిరునగవొలుకుచు వలపుల చిలుకుచు నిను దరిసినాడు
అదె నవవసంతమో, శిశిర ఋతునిశాంతమో..

కవి : అంతలోన ఆవసంత మాశాంతత నంతరించె
అంతరంగమెటొ మారిన యా ప్రియుండు వంతు మార్చె ;

(సంజ వెలుతురులో లత నుంచి రాలడానికి సిద్ధంగా ఉన్న సుమకన్య.)

పూవు : ఇంతలోనె దినాంతమా, సుమజన్మ
కంతలోనే అంతమా !!

పూవునై విరియించినావుగా, త్రోవ
పోవు తుమ్మెద బాలు పిలిపించి, వలపించి
అంతలో నా కన్ను మలపించినావుగా,
నాయెడదత్రీలగా మరపించినావుగా !!
ఇంతలోనె దినాంతమా, సుమజన్మ
కంతలోనే అందమా !!
మానవాంగన జన్మమిత్తువో దేవా, అమర్త్యభామినిగ
కానిత్తువో
రేయనక పవలనక రెప్పపాటు లేక వేచియుందును
ప్రియునిరాకకై ...!!

నళినభ్రమరి

(దృశ్యము : అస్తమింపనున్న సూర్యకాంతి ప్రతిఫలిస్తున్న కాసారము తటముపై గాలిపిల్లలు)

—గాలిపిల్లల బృందగీతి—

గాలి పిల్లలం, చల్లగాలి పిల్లలం
లలం లలం లలం లలం
లలం లలం లలం లలం
గాలి పిల్లలం చల్లగాలి పిల్లలం !
ఈలపాటలు పాడుతూ
తేలితేలి యాడుతూ
కమ్మ కమ్మని పూల తావుల
గమ్ముగమ్మనిపించుతాం ! గాలి పిల్లలం !
నీలిదారుల యెఱ్ఱ మబ్బుల
నీటి చాలుల సోలిపోతూ
తోటతోటల బాటబాటల
పైట లల్లాడించుతాం ! గాలి పిల్లలం !
సంజసూర్యుని చాయలో
రంజితమ్మౌ సరస్సులో
నళినీ గళగత మకరందం
మాకానందం మాకానందం ! గాలి పిల్లలం !
సంజసూర్యుని చాయలో

జుంజుంజుంజుం జుమ్మనే
మధుకర బృందం మంజులనాదం
మాకానందం మాకానందం!
గాలిపిల్లలం! చల్లగాలి పిల్లలం!

భ్రమర బృందగీతి: గాలిపిల్లల కూనిరాగం:

జుం జుం జుం జుం జుం జుం
భ్రమరాలం భ్రమరాలం...
కుంజము కుంజముపై నే ఆఆఆఆ
జుం జుం జుం జుం జుం జుం ఆఆఆఆ
మంజులగానముచేసే జుం జుం జుం జుం జుం జుం
భ్రమరాలం భ్రమరాలం జుం జుం జుం జుం జుం జుం
తావుల పూవుల వ్రాలీ ఆఆఆఆ
తీయని తెరలుగ తేరే ఆఆఆఆ
తేనెల సోనల గ్రోలే జుం జుం జుం జుం జుం జుం
భ్రమరాలం భ్రమరాలం జుం జుం జుం జుం జుం జుం

అందరూ—బృందగీతి:

అదే అదే పడమటి కొండ;
భానుబింబ మస్తమించుచుండె;
ప్రకృతికాంత హృదయమ్మరుణారుణమై మండె;
వియోగమున నళిని కుములు చుండె;
క్షణక్షణము కరిగిపోవు
అరుణ కిరణ రేఖలలో

ఒరసి పారు చీకటిలో
సరసిలోన కలవరమున,
పడమటి దెస చూపు నిలిపి
కడ యెరుగని వియోగార్తి
కన్నీ రొలికెడు నళిని!

(భ్రమరబృంద మంతటిలోను ప్రధానుడైన ఒక భ్రమరకుమారుడు ముందుకువచ్చి సరసిలోని నళినిని హెచ్చరిస్తాడు)

భ్రమరుడు : ఓ ప్రభాకరాలోకనాలసముఖి,
సఖి! కమలినీ సఖి

నళిని : పంకభూమి ప్రభవించితి ననియో, నీ
వంక కెగురలేనైతి ననో
పశ్చిమాద్రి వెనుక దాగితివా దివాకరా!
అరుణకాంతి పుంజము నీవెనుకనె వెలిబారుచుండ
ఇరులపాలు చేయుదువా నను;
యుగ యుగాలు తిరిగి తిరిగి
పగళ్లెన్ని వచ్చిపోయె;
తిరిగి తిరిగి నాదు హృదికి
తరుగని వలవంత గూర్చి
పశ్చిమాద్రి వెనుక దాగితివా దివాకరా;

భ్రమరుడు : ఓ ప్రభాకరాలోకనాలసముఖి సఖి కమలినీ సఖి;
తాపీయవో తారెదు తేటికి, నె
త్తావుల లోగిట నేటికి;

నళిని : ఏటి రొదలో - నేటికి నాదరి;
పరిపాటి నీకు రేపే విరిదరి?

భ్రమ : మధుకరమే నా మనుగడ, నీ
కనికరమే లేనిచో నిచటె నా
బ్రదుకునకే విరుగడ ;

నళిని : పంతములా - కలుగదా, ఆ
వంతజాలి — నావంతల ;
వాకిలి మూసికొని యింక
చీకటిలో మునుగుదాన ;

భ్రమ : చీకటి చెరయైన సరే, నీ
వాకిలి నా కమరపురి ; నా
కీవే మధుకర మీయనిచో
ఆకలి నళియింపనా ;

నళిని : నా కొదవిన ఆశాహతి
నీకు కలుగనీయబోను ;
చీకటి, వాకిటి రేకులు
ముడిచికొనెద, రా లోనికి ;

బృందగీతి : నిశాజటావళి దెసలలమె ;
నళినీ దళములు ముడిచికొనె ;
నళినీ గళగత భ్రమరకుమారుడు 'నళిన భ్రమరి'
నమరుడాయె ;

శాఫో

(ప్రేమకోసం జీవితాన్ని బలియిచ్చిన శాఫో - గ్రీకు దేశపు కవయిత్రి. ఆమె కవితారీతులు, విశ్వ జనీనములయిన ఉన్నత భావాలు, గ్రీసుదేశపు సాహిత్యానికేకాక ప్రపంచ సాహిత్యానికే అమూల్యాలంకారం చేకూర్చాయి. ఇది ఊహగా అల్లిన ఆమె జీవిత ఘట్టం.)

సూత్రధారుడు :

ఎన్నడేని నీ వొకపరి వలచితేని వలచితేని
వలచి వలపు తీరమి ఎదపరితపించితేని

బృందగీతి: వినవో యీ కథా, మరపించును నీ వ్యథా ;

సూత్ర : నీయెడంద నాయెడంద నిలిచి యాడు చెలిమి కలలె
ప్రణయిని శాఫో యెడంద కలంచి బ్రతుకే దహించె.

బృంద : వినవో యీ కథా, మరపించును నీ వ్యథా ;

చెలుల బృందం : విరుల కై సేయుదేని ఓ చెలియరో
ప్రియుడు తలతాల్చునే నిన్ను వలపుతో
కురులు సవరింపనీవో యీ విరులతో
ప్రియుని తేలింపవమ్మ మైమరపులో ;

శాఫో : ఏల నాకీ యలంకార మేల ?
ప్రణయమే చాలు, ఈ సొమ్ము లేల ?
వచ్చునో రాడో నా ప్రియుడు నేడు ?
ఇచ్చకపు మాటగా పల్కినాడో ?

చెలుల బృందం : వినవో. సఖ, వినవో ;
కనవో నీ ప్రియుని :

అంగణమున నిలిచి సుమధు
రాహ్వానము చేయునతని
వినవో, సఖి వినవో...

ప్రియు : సఖి, శాఫో, సఖి శాఫో
వినుమ నీ గీతమె పాడెద...
వేగుచుక్క వెలుగుతోనె
వెన్నెలలూ, సంజ యిరులు
కలిపి కాంచి సంతసించు
కళాశీలి సృష్టికర్త
వెన్నెల నాలమందలను
తల్లుల పాల పిల్లలను
మృదుల మధుర మోహనమై
నదెల్ల ఒక్కచో చేర్చి
నన్ను సకియ శాఫో యెదఁ జేర్చె...

శాఫో : నన్ను సఖుడు ఫావో యెదఁ జేర్చె...

చెలుల బృందం : ఓలలాడవే చెలియా, ని
న్నెలు విభుని ఆలింగన డోలిక నోలలాడవే చెలియా:
తోట పూల తరుల తడుపు నా సెల
యేటి యూట జోలపాట పాడగ
నోలలాడవే చెలియా ;
కరగు వెన్నెలల తరుగు చీకటుల
పరచు మిణుగురుల మెరపులాశలై
ఓలలాడవే చెలియా ;

సూత్ర : అదియే హాయి నొసంగిన తుది వెన్నెలరేయి ;
భళ్లుమనుచు తెల్లవారె శాఫో యెద తల్లడిల్లగ
శృంగారవనమ్మునుండి సౌందర్యోన్మత్త యొకతె-
శాఫో నెడబాసి ఆమె సఖుని రమ్మనుచు పిలిచెను ;

బృంద : వినవో యీ కథా, మరపించును, నీవ్యథా

సుంద : లేవోయీ ఫావో ; సఖా ;
లేవోయీ ఫావో ;
సాహిత్యమె వలచెదవో, నిండగు
సౌందర్యమె వలచెదవో
ప్రణయ నికుంజపు పంజరమును విడి
సౌందర్య వనికి రావో
మనోహరతనూ విలాసినులు నీ
కనూన సౌందర్యము నర్పింపగ
వనాంగణమ్మున కలరోయీ ;
లేవోయీ, ఫావో ;

(శాఫోతో ఏకాంతాన ఉన్న ఫావో లేచి ఆమెను సెలవడుగుతాడు.)

ఫావో : సెలవొసంగుమా, శాఫో, సెలవొసంగుమా
నీ కవితాగరిమకంటె, నీ ప్రణయ మధురిమకంటె
ఆ సౌందర్య వనీ సౌఖ్యాంచిత భోగాల వలతు
విస్మరింపుమా, నన్నిక విస్మరింపుమా
సెలవొసంగుమా, శాఫో, సెలవొసంగుమా...

శాఫో : పోవుదువా, ననువీడి, రావా రావో సఖా
క్షణికమా సౌందర్యమే సతమ్మా నీకు ?
నిలువ నీడే లేద నిస్తులప్రేమ కిక ?

కన్యనై జీవితము గడిపివేయుదునోయి
నీవు నన్నేలుకోరావేని నా ప్రియుడ

బృందం : కవితా ప్రణయడోలికా లీల చాలించి,
శాఫో ప్రియుడు ప్రేమ సూత్రమ్ము తెగత్రెంచి.
సౌందర్యవని చేర సుందరి ననుసరించె,
శాఫో హృదయ వంశి భోరుమని విలపించె !

సూత్ర : కన్నెవలపు నీసడించి చన్నయతడు మనసుమారి
ఎన్నడేని రాకుండునొ అనుచు
కన్నులు కాయలు కాయగ కనుచు
పవలు రేలు వత్సరాలు నిలుచు
ద్వారమె యిల్లనుచు...

బృంద : వినవో యీకథా, మరపించునె నీ వ్యథా

శాఫో : వాడిన గులాబి రేక లన్ని రాలె సోన నీటిలోన
పాడిన వియోగగీతి కరగిపోయె హృదయతంత్రిపైనె
వాకిటను ఆకొ అలమొ కదలి ఆశల నెదరేపు ?
రాకయే యుంటి విన్నినాళ్ళు వత్తువో యిక రేపు ?
ఆశా సుమాలు త్రుంచి విసరివై చితి దెసదెసల
ఈ శోక జీవితము ముగించివైతు కడలి యలల

సూత్ర : హతాశ శాఫో నిరంతరాశలతో పేర్చిన ఉ
న్నతాద్రి శిఖరమ్మునుండి యురికె జలధి గర్భమ్మున
హృదయ వేణు శకలమ్ములు నదించె శాంతి
శాంతి యని !

(ఈ నాటికలోని కొన్ని పాటల భావాలకు బసవరాజు అప్పారావుగారికి రచయిత కృతజ్ఞుడు.)

అమృత వర్షిణి

హర్షుని నాగానంద గాథ ననుసరించిన రచన :

(దృశ్యము : గరుడుడు నాగులను చంపితిను వధ్యశిల.)

తల్లి, తండ్రి : అతి కోమల శరీర ; నవయౌవన కుమార ;
నీ ఆయువేమూడె నేడో శంఖచూడ ;
ఏ పూర్వజన్మాన ఎడబాసినామో
సుతుల కన్న తలిదండ్రులను కన్నతండ్రి ;

శంఖ : సెలవీయరో—నాకు ఓ
జననీజనకులారా ;
తరుణమ్మిదియె నాకు ; మీదు
ఋణము తీర్చుటకు— ॥శెల॥
మనజాతి నిలుచుటకై
బలియాట నా భాగ్యమ్మే ।శెల॥

తల్లి, తండ్రి : మా నోముల ఫలమా
మా నాయన సెలవు
గర్భానా చిచ్చే
నినుగన్నా ఫలమో...

బృందగీతి : అయో అయో అయో అయో
ప్రమాదమయో ప్రమాదమయో
విహాయసవీథి వైనతేయుడే

విహారము సేయుచు నేగుదెంచెను
ప్రమాదమయో ప్రమాదమయో

జీమూత : వైనతేయుడగాను, పారిపోవుదురేల
ఏను జీమూతవాహనుడ విద్యాధరుడ ;
ఏ యాపదకు వెరచి ఇటు కుందెదరు మీరు ?
ఎరుగ జెప్పుదునాకు, అభయమిచ్చితి మీకు ;

బృందగానం : నాగలోక వాసులెల్ల నాశమైపోవుదురో ; అ
య్యో, గరుడు మహోగ్రహాగ్నికి ఆహుతై పోవుదురో ;
ఒక్కొక నాటికి తన భోజనముగ
ఒక్కొక నాగకుమారుని తెండని
ఒక్కుమ్మడిగా సాంఘికమరణ
మ్మొదవకుండ దయచేసెను గరుడుడు !

తల్లి, తండ్రి : దినదిన మొక్కొక నాగకుమారుడు
చను యమునింటికి కులప్రళయమిది !
కనుమవె హతులగు నాగకుమారుల
కంకాళమ్ములు, అస్థిశేషములు !
నేడాయెను మా సుతువంతు,
మా శంఖచూడు బ్రతుకున కంతు !

జీమూత : మీ, వెతలు దీర్చుటకు నే తగుదు,
మీ, సుతుని బదు లేను బలియగుదు !
నా, కోరికను కాదనగవలదు !

బృందగీతం : తగ, దిట్టి త్యాగము సేయగా నీకు !
దిన దినము తప్పని శోక మిది మాకు !

మధుపర్కములతో వచ్చినావోయి,
మరలి నీదేశము తరలిపోవోయి!

శంఖ : గరుడుడు వచ్చెడి వేళాయె
త్వరగ దేవళమునకు పోయి
అంతిమప్రార్థనమును చేసి, నా
అంతిమయాత్రకు త్వరపడుదు!

జీమూత : గరుడుడు వచ్చెడివేళాయె
త్వరగ దేవళమునకు పోయి
ప్రార్థనకేగిన నాగకుమారుడు
రాకముందె వధ్యశిలను చేరుదు!

బృంద : రివ్వు రివ్వు, రివ్వు రివ్వు, రివ్వుమనుచును
దవ్వుదవుల, దవ్వుదవుల సవ్వడాయెనే!
వచ్చిపడెను, వచ్చిపడెను గరుడుడయ్యో
చచ్చినాము, చచ్చినాము, చచ్చినామయో!
కాలరాత్రి కురులపాయగా
నీలిమబ్బు తెరలచాయగా
భూనభోంతరమ్ము లదరగా
నాగులెల్ల బెదరి చెదరగా
వచ్చిపడెను వచ్చిపడెను గరుడుడయ్యో!

గరుడధ్వని : ఒహోహో ఇదె నాయెర!
వధ్యశిలపై సిద్ధమాయె!
నా గర్భవైరి నాగు డిదే బలి
కాగోరి కాచుకొని యుండె

నోహోహో ఇదె నాయెర
వధ్యశిలపై సిద్ధమాయె!

(బృందగాన హాహాకారం - జీమూతవాహన గానం.)

జీమూత : వైనతేయ! బలి గ్రహించుమా!
తృప్తితీర హింసించుమా!
హింసారతి గ్రుతిమించగా, నా
మాంసఖండముల భుజించుమా! నీ
దాహతాపము శమింపగా, నా
దేహరక్తమును పీల్చుమా!

గరుడుడు : మేరువైన సాటేనా, ఈ
ధీరుని కిల మహాసత్త్వ సంపద!
తన శరీరమున మాంసఖండముల
ఘనహింసారతి నేను భుజింపగ
చలింప డింతయు సొమ్మసిల్లడీ
ఘనుండు నాగకుమారుడు కాడో!
మహోత్తమాన్విత! మనుజాతీతా!
మహాత్మ! దాసుడ మన్నింపుము నను!
అమృతవర్షమున స్వస్థుని జేసెద
నయ్యా! వలసిన వరమ్ము కోరుము!

జీమూత : దయామృతము వర్షింపుమా!
హతనాగుల బ్రతికింపుమా!
పరహింసారతి మానుమా!
పరమ శాంతిని వరింపుమా!

గరుడుడు : ఝరఝర కురిసెనమృతధార !

బృందగీతి : అమృతధార ! అమృతధార ! ॥ ఝర ॥

త్యాగమూర్తి జీమూతవాహనుని

క్షమాన్వితమౌ స్వర్ణదేహమున ! ॥ ఝర ॥

హత నాగావళి అస్థిశేషములు

నూతన చేతనముల నర్తింపగ ! ॥ ఝర ॥

మేఘసందేశం

(కాళిదాస జయంతికి ప్రత్యేక సంగీత రూపకం)

కవి : కశ్చిత్కాంతా విరహగురుణా స్వాధికారాత్ప్రమత్తః
శాపేనాస్తంగమిత మహిమా వర్షభోగ్యేణ భర్తుః
యక్షశ్చక్రే జనకతనయా స్నానపుణ్యోదకేసు
స్నిగ్ధచ్ఛాయా తరుషు వసతిం రామగిర్యాశ్రమేషు.

బృందగానం : కడచన్న మహిమతో కాంతావియోగ
గరిమతో వర్షభోగ్యము ప్రవాసమ్మె
శాపమ్ముగా పొంది సగము కృశించి
ధనపతి యాన మీరిన యక్షవరుడు
భూమిజాతా స్నానపుణ్యోదకముల
రామగిరి వనసీమ రమ్య ఋషివాటి
సురపొన్న తోపులో దురపిల్లుచుండె

యక్షు : నీకుమాత్రము కాకపోయిన
నాకు సుంతయు లేకపోయిన
ఆ వసంతమ్మటులె గడచెను
నీవు లేకయె ప్రేయసీ...నీవు లేకయె...
ఎడదచ్రీల్చు వియోగ శాపము
ఒడలు కాలుచు గ్రీష్మతాపము
జగమె యుడుకుచు నంటుకొన్నది
జ్వాలాతోరణ మౌచు నలుగడ...నీవు...

ఈ నిదాఘనిశీథ జాబిలి
యేడ్చునొంటిగ మంచుసేర్లయి
ఈ వనిని సుమ సౌరభమ్మెలె
దావపావకశిఖల నుమియును...నీవు...

బృంద : వలదు మాకీ విప్రలంభము
వలతుము వినగ కథాప్రారంభము
కఠిన శిక్షగా యక్షుని కెందుకు
ఘటించె ధనపతి కాంతా విరహము
యక్షుని కాంతానురక్తి యెట్టిదో
శిక్షపడిన యపరాధ మెట్టిదో.

కవి : యత్రోన్మత్త భ్రమర ముఖరాః పాదపా నిత్య పుష్పాః
హంసశ్రేణీ రచిత రశనా నిత్యపద్మా నళిన్యః
కేకోత్కణ్ఠా భవనశిఖినో నిత్యభాస్వత్కలాపా
నిత్యజ్యోత్స్నా ప్రతిహత తమోవృత్తి రమ్యాః
ప్రదోషాః

బృంద : ఎచట మత్తిల్లు తేంట్లతో నెసగు కుసుమ
సముదయమ్ముతో వృక్షమ్ము, లెచట నంచ
గములతో నిత్యకమలాకరములు కొలకు,
లెచట చాచిన కంఠమ్ము లెగసిపాడు
విరియబారిన పింఛముల్ విసిరియాడు
నింటి నెమళులు, వెన్నెల లెచట నిత్య
మై పరిఢవించు నా యలకా పురమున
ప్రణయలోలురౌ యక్షదంపతులు వారె...

యక్షు : నిలుమా సఖి నిలుమా కనకపు తామర లివిగో

ఆమె : సరిసరి రావోయీ, ఉపవన మందిర మదిగో,

యక్షు : సెలయేరులు పొదరిండ్లు త్వరగ దాటుచు అలయింపకు

ఆమె : వనమంతయు పరుగిడమే అలయికగా గణియింపకు

యక్షు : ధనపతి సరసిని విరిసిన కనకకమలము లివే
నా సేతుల కై సేతును నీ ధమ్మిల్లమునందున

ఆమె : కురు లందున తురుమగ వేగిరమా ఆగుము రవంత
సిగ్గగు నాకేలో మనల శుకపికములు కనినంత

యక్షు : నిలుమా సఖి నిలుమా కనకపుతామర లివిగో

ఆమె : సరిసరి రావోయీ ఉపవనమందిర మిదిగో...

-కిలకిల నవ్వుకొంటూ ఇద్దరూ నిష్క్రమిస్తారు-

-: భేరీఘంటానాదం :-

ఒకగొంతు : చంద్రశేఖరు నర్చించు సమయమాయె ;
యక్షు డేలొకో నిత్యకృత్యమ్ముమరచి
తేదు స్వర్ణకమలములు నే డటంచు
రాజరాజు కుభేరుడుగ్రతనుపొందె

-భేరి ఘంటానాదము వినిపించి కరిగిపోతుంది-

ఆమె : అద్దము చూపవో సఖా అద్దము చూపవో
పత్రభంగముల చిత్రించు కొనెద

యక్షు : అద్దమిదే సఖి సఖి, అద్ద మిదే సఖి నీ
ముద్దుమోము నూగించు ఊయెల...అద్ద...

ఆమె : సీమంతమ్మున తిలకము దిద్దిన నీ మృదుకరముల
మెదలకుండగా

యక్షు : ముత్తెపుపూసలొస్వేదకణములో, మోమునలముకొనె
ఒత్తనా సఖి

ఆమె : ముత్తెపుకాంతుల పత్రభంగముల స్వేదకణములని
చెరుపకో సఖా

యక్షు : పత్రభంగముల తడియారంగా ఉహ్హని ఒకపరి
ఊదనా సఖీ...

ఆమె : ఉహ్హని యూదిన ఊర్పుటావిరుల దర్పణ బింబము
కప్పువడుసఖా...

-ఉఫ్, ఉహూ, ఉఫ్-ఉహూ అనుకొంటూ ఇద్దరూ
కిలకిల నవుతారు -

— భేరీ ఘంటారావం —

రాజదూత : హేమమాలి హేమమాలి ఏమి యీ అవజ్ఞ
ఏమరచితివేమోయీ నేడిటు రాజాజ్ఞ
-భేరీ ఘంటానాదం-

యక్షు : సఖి యిటుతే కమలములు
సత్వరముగ తే తే తే
ఈశ్వరార్చనకు ప్రభునకు
ఈయవలయు కమలము లివి.

ఆమె : అయ్యో అపరాధమాయె
అయిన నేమి యివి గివిగో...

యక్షు : రాజదూతకిచ్చి పంపి, రయమున నిను చేరుకొందు

ఆమె : ఈశ్వరార్చనకు సమయము, ఎంతమించిపోయినదో...

యక్షు : అయ్యా రాజదూత నే నన్యమనస్కుత నుంటిని
వీని నీవె కొనిపోయి వేగమె ప్రభువున కిమ్ము

రాజదూత : ప్రభుపూజా సమయముమించె నీ ప్రణయకలాపము
శ్రుతిమించె
ఈ సుమముల నే నిత్తునుగానీ మీసుఖమున కే
గతియగునో

—:భేరీ ఘంటానాదం:—

యక్షు : నీ పలువరుసలు నీ కనుకొలుకులు
నీ నడివంపులు నీ నడసొంపులు
కనకుండా నే మనగలనా, నా సఖి నినువిడి
మనగలనా...
నీ ముంగురులూ నీ నునువ్రేళులు
నీ వీణాశ్రుతి నీగళ మధురుతి
కనక వినక నే మనగలనా నాసఖి నినువిడి
మనగలనా...

నాకమ్మేలా, నందనమేలా
ఇద్దరు : మన ప్రేమయే మన ప్రేమయే
యక్షు : అలకాపురీ నవలతాంతమధువు లేలా
లలితాంగి నీ ప్రణయజలధిలోన తేలా
ఆమె : అనురాగడోల యం దూగి తూగుదామా
ఆనందవార్ధిలో సాగి పోవుదామా...నా...
ఇద్దరు : ఏ కామ్యపదవి యే నింక చాలు చాలు
లోకాల కవలి ఏకైక పదవి నేలు....మన ప్రేమ యే....

—: హఠాద్భేరీ నినాదం :—

రాజదూత : మర్త్యుడవుపోలె ప్రణయమ్ము మరగి భృత్య
ధర్మమేమరి రాజాజ్ఞ తప్పినావు

కావున కుబేర శాపమ్మిదే వియోగ
తాపమున వత్సరము ధరాతలిని గూలి
మహిమ గోల్పడి మర్త్యుడై మనుదుగాక !

—విషాదసంగీతం—

ఆమె : దుస్సహమీశాపమయ్యో దుర్భరము వియోగమయ్యో
నిస్సహాయుడే తానెటు నిగ్రహించుకోగలడో
దుస్తర మీశాపమయ్యో వత్సరము వియోగమయ్యో
నిస్తుల ప్రణయుడే యెటు నిర్వహించుకోగలడో
ఏలనాదు సౌందర్యము, ఏలనాదు తారుణ్యము
తనకు శాపకారణమ్ము, క్షణమున భస్మమ్ముకాదె
ఎవరు నన్ను పలుకరింతు రెవరు నన్ను పాడింతురు
ఎవరీ ఉపవనీ బాల మయూరమ్ము నాడింతురు...

బృందగానం : మితిమించిన ప్రణయలోలతా ప్రభు
సేవా విధిలో ప్రమత్తతా
ప్రభుశాపమ్మున పదచ్యుతీ వత్సర ప్రవాసము
విధురగతి
అలకాపురిలోన ప్రేయసి ; ఆవల రామగిరివని
ప్రియుండు
కడపంగ దగు దినాలెన్నో అని గణియించుచు బ్రతు
కీడ్చెదరు

యక్షు : మెరసే మబ్బులలోనో, విరిసే పూవులపైనో
చరియించే నాచెలీ చెలీ మేను
పులకించే నాచెలీ చెలీ

దివ్యలోకమునుండి దిగకోయి దిగకోయి
దేవతా మూర్తీ నాచెలీ దేవతామూర్తీ నాచెలీ ...
వలచే గాలులపైనో తలచే దారులలోనో
తలపించే నాచెలీ చెలీ మేను
మరపించే నాచెలీ చెలీ
దివ్యలోకమునుండి దిగకోయి దిగనోయి
దేవతామూర్తీ నాచెలీ దేవతామూర్తీ నాచెలీ...

కవి : తస్మిన్నద్రౌ కతిచి దబలావిప్రయుక్త స్స కామీ
నీత్వా మాసాన్ కనకవలయ భ్రంశరిక్త ప్రకోష్ఠః
—ఉరుము చప్పుడు—

బృందగానం : వొచ్చిందా తిరిగీ వొచ్చిందా
తొంగిచూసిన ములగసిరకి పొంగిపోయే తొలిమేగం
వొచ్చిందా తిరిగీ వొచ్చిందా ॥ వొ ॥
నల్లం కరి యేన్గులబారో కొల్లేటీ కొంగలతీరో
అందాల మెరుపురథాలో కిందామీదౌతు నింగి
రాలేయా పొంగి కూలేయా ॥ వొ ॥
యేటివొడ్డున మొల్లరుప్పా యెల్లువగా నవ్వింది
నవ్వుతూ తనకళ్లా నవరసులూ రువ్వింది
తలుకూలే ములుకూలై వలపూలారే పంగ ॥ వొ ॥

కవి : ఆషాఢస్య ప్రథమదివసే మేఘమాశ్లిష్టసానుం
వప్రక్రీడా పరిణతగజప్రేక్షణీయం దదర్శ...

బృంద : అరుదెంచె మింటిపై ఆషాఢ మేఘము
ఆ వేయి తలలతో శేషాహి ఠీవితో
ఆ రామగిరులపై ఆ తపోవనులలో
ప్రియకాంతనుబాసి ఏడాదిప్రవాసి
ఆగాగుమనియెను ఆషాఢ మేఘమున్...

యక్ష : మేఘమా మేఘమా
గంగవలపులో సొలపులో
బెంగయూర్పులో
కనలు నెండలో తేలుతూ
గగన మంటెదో...
వలపుటలలలో కలలలో
వగల సగమయీ
వెలుగు పొరలలో యిరులలో
తిరిగి వరుగయీ
మరుగు ప్రేమికుల్ నీ
కన్న దమ్ములన్నదమ్ములు... ॥ మే ॥

కవి : ధూమజ్యోతి స్సలిల మరుతాం సన్నిపాతః క్వ మేఘః
సందేశార్థాః క్వ పటుకరణైః ప్రాణిభిః ప్రాపణీయాః
ఇత్యౌత్సుక్యా దపరిగణయన్ గుహ్యక స్తం యయాచే
కామార్తాహి ప్రకృతికృపణా శ్చేతనాచేతనేషు.
(ఉరుము చప్పుడు)

బృంద : నీరు నిప్పు గాలి పొగల చేరిక నీరద మది యెక్కడ
ప్రాణులచే నగు సందేశమ్ముల భారవహన మెక్కడ
ప్రణయార్తికి చేతనాచేతన వ్యత్యాస మ్మెక్కడ

యక్షు : అమృత మధుర జీవనదా జలదా
అలకాపురి చనవోయీ, నా
చెలికి ప్రణయ సందేశము గొనవో
అలకాపురి చనవోయీ...

బృంద : అలకాపురి చనవోయీ జలదా, అలకాపురిచనవోయీ

యక్షు : ప్రణయదూతవు ప్రాణదాతవు
విధురహృదయ సంయోగ విధాతవు
రామగిరివనుల, ప్రేమతాపసిగ
సేమముంటినని చెలి కెరిగింపుమ...
నర్మదహృదిపై భర్మదీప్తులా
చంద్రశిలల విహరింపుమా
సాంధ్యరాగముల వింధ్యసానువుల
చల్లదనము గ్రహియింపుమా...

బృందం : అలకాపురిచనవోయీ జలదా, అలకాపురి చనవోయీ

యక్షు : కొండకొండ నీ వెండిమెరపులో
దండదండ మల్లికలూ
కొలను కొలను పద్మినుల వలపులో
కెలన కెలన హంసికలూ...
ఉజ్జ్వల శంపాసఖ చనవోయీ
ఉజ్జయినిని గనవోయీ

మహాకాళు దేహాళి నీవాళుల
మాధుర్యము గొనవోయీ...
సుందర రమణీ కుంతల ధూప సు
గంధము చని గొనవోయీ
ఉజ్జ్వల శంపా సఖ...

బృందం : రమ్మోయి జలధరా మదభరా
స్వాగతమ్మోయి అమృత ధారాధరా ! రమ్మోయి
ఉజ్జయిని ప్రేమ సామ్రాజ్యాల నెలవంచు
ఊరూర ఇంటింట మారుమ్రోగగనిమ్ము ॥ ర ॥
ఆ మహాకాళు ఫాలాక్షి కెంజాయ
అభిసారికల పాదలాక్ష క్రొంజాయ
ఆనంద ధామాన నరయగా రమ్ము
ఆమంద్రరవళి నాలాపించి పొమ్మోయి ॥ ర ॥

- ఉరుము -

యక్షు : గంగా విమల తరంగ భింగమతి
గళగంభీర మృదంగ మొలయనీ
హిమశైలముపై కిన్నెర కన్నెల
వరన ర్తనముల వంశీరవముల
గంగాధరు హృదయంగమ గాథల
గళగంభీర మృదంగ మొలయనీ
అమృత మధుర జీవనదా, జలదా
అలకాపురి చనవోయీ...

బృందం : అలకాపురిచనవోయీ, జలదా అలకాపురి చనవోయీ

యక్షు : పూలతరులపై తీవలపై గీ
తాలుపాడు మధుపావళులు
తండతండముల తామరకొలనుల
తారెడు తరుణమరాళములు
నిండు గళముతో పురివిడ పాడుచు
ఆడెడు మత్త మయూరములు
నిత్య వసంతము నిత్య శారదము
అమర ధామ మలకానగరి...

బృందం : అలకాపురిచనవోయీ జలదా, అలకాపురి చనలోయీ

కవి : హస్తే లీలా కమల మలకే బాలకుందానువిద్ధం
నీతా లోధ్రప్రసవరజసా పాండుతా మాననశ్రీః

బృందం : కరముల లీలా కమలాలు, అలకల తెలిమొల్లసుమాలు
ముఖములపై లోధ్రరజాలు, శిఖలను విరియుకురవకాలు
చెవుల కోమలశిరీషాలు, సీమంతముల కడిమి పూలు
తలపగలమె అలకానగరీ, లలనావళి చక్కదనాలు
వలపు లొలుకు తీయదనాలు...

కవి : తత్రాగారం ధనపతిగృహా దుత్త రేణాస్మదీయం
దూరాల్లక్ష్యం సురపతి ధనుశ్చారుణా తోరణేన...

యక్షు : ధనపతి గృహమున కుత్తర
మున నాయిలు కలదు,
చెలి పెంచిన మందారము
కలకల హరివిల్లయి
ముంగిలి తోరణమై నిను
చెంగట రమ్మనదో...

బృందం : అలకాపురి చనవో, ఓ జలదా, ఓ జలదా...
కవి : తన్వీ శ్యామా, శిఖరిదశనా, పక్వబింబాధరోష్ఠీ
మధ్యేక్షామా చకితహరిణీప్రేక్షణా నిమ్ననాభిః
యక్షు : అశ్రుసిక్త హరిణనేత్రి విరహతప్త శ్యామ గాత్రి
అలస గమన సుమకోమల అట నా సఖ గనుమా...
బృందం : మేఘునికంటె మునుముందేగుదమా మనము
అలకాపురి తన ప్రేయసి కలరూ పెరుగుదము
ఆమె : ఏదూర సీమనో, ఏ విపిన భూమినో
ఈవిరహ మెన్నాళ్లు ఎటుసైచునో, విభుడు....ఏ....
ఇంత తపియించి కృశియింతునే నే నిందు
పరవాసియౌ ప్రాణపతి సౌఖ్య మెటు లందు...ఏ....
మలయానిలుడు నేడు కలగి తిరుగాడునే
మదిని పాలిన యాశలకు రెక్కలాడునే
శాపాపసానమ్ము సరిగ నేడే నేమొ
గోడపై పారాణి గురుతు లిక చాలేమొ...ఏ...
బృంద : మలయపవన సందేశములో
మదిని తోచు మధురాశలలో
రాగ లలిత మూర్ఛనలవలె
మేఘ మంద్ర గర్జనలవిగో
ఆమె : జలదా, ఓ జలదా, ప్రియవాక్యము కలదా,
మలయానిల చలిత విమానముపై నీ యాత్ర
కలదా రామగిరివనుల ప్రియుని కుశలవార్త..జలదా
మేఘు : ఓ చిర సౌభాగ్యవతీ, ఓ శాపార్త విరహిణీ
కనుమిదిగో కైకొను మిదిగో

నీ ప్రణయాశా విద్యున్మాలలు
నీ సఖు సందేశామృత ధారలు
రామగిరి వనుల ప్రేమ తాపసిగ
నీవలె సగమై నిరీక్ష గడపెడు

బృందం : నీ సఖు సందేశామృత ధారలు
నీ ప్రణయాశా విద్యున్మాలలు
కనుమివిగో, కై కొనుమివిగో...

యక్ష : తీరిపోవులే మన శాపమ్మిక
చేరవత్తు నిను నా ప్రియతమ
గిర గిర తిరిగే చక్రనేమి వలె
క్రిందుమీదులౌ సుఖదుఃఖమ్ములు -
శాపమిక దీరు నెచ్చెలీ శార్ఙ్గపాణి
భుజగశయనాన పవళింపు పూర్తి చేసి
లేచు నాటికి నెలలు నాల్గింక గడవ
నిండు శారదరాత్రులే నీకు నాకు

బృంద : నీ సఖు సందేశామృత ధారలు
నీ ప్రణయాశా విద్యున్మాలలు
కనుమివిగో కై కొను మివిగో...

కవి : తత్సందేశం జలధర పరో దివ్యవాచా చచక్షే
ప్రాణాం స్తస్యా జనహితరవో రక్షితుం యక్షవధ్వా
ప్రాప్యోద న్తం ప్రముదితమనా సాపి తస్థౌ స్వభర్తుః
కేషాం నస్యాదభిమత ఫలా ప్రార్థనాహ్యు త్తమానామ్

తారస్థాయి

చండీదాసు

(ప్రణయ జీవియైన ఒక వంగ కవి జీవిత కీర్తనం.)

పాత్ర పరిచితి :

చండీదాసు ; ఆదర్శశీలి, రాధాకృష్ణ భక్తుడు, కవియైన యువకుడు నకులదాసు ; ఆయన సోదరుడు, విశాలాక్షి ఆలయంలో అర్చకుడు. రామిని ; చండీదాసునకు ప్రేమ పాత్రురాలైన రజకిని. ఆలయదాసి, పూజారులు, ధర్మ కర్తలు, సాంఘికులు, రజక జనం...

(పూర్వ రంగం)

బృందగీతి : ప్రేమగానము ; ప్రేమగానము
సకల జగదభిరామ గానము !!
ఆదికవి వాల్మీకి కోకిల
అమృత మంజుల సామగానము !!
రామగిరి వని దివ్య వంశీ
విరహాపూరిత భవ్యగానము !!
నాట్యదాత్మ సఖీ పదాంకిత
నవ్యతమ జయదేవగానము !
రజకినీ ప్రియుడైన చండీదాసు
విశ్వ ప్రణయ గానము !!
ప్రేమగానము ; ప్రేమగానము;
సకల జగదభిరామగానము !!

(ఒకటో రంగము)

నన్నూరా గ్రామంలోని విశాలాక్షి దేవాలయం, గర్భగుడిలో శంఖ ధ్వానం, ఘంటానాదం - ఆవరణలో సన్నాయి, మంటపంలో పూజారులు.)

బృందగీతి : త్వాం నమామో వయం మాతరమ్ ;
త్వాం నమామో వయం మాతరమ్ !!
నళినీదళ సంస్థిత శుభశయనే ;
అళినీలాలక చుంబిత నయనే !
లలిత మధుర హాసాంచిత వదనే ;
హసితచ్ఛవి సంకాశితరదనే !!
దిగంత సరిత ప్రణవరూపిణి
అనంత అచల ప్రణయగాయని
త్వాం నమామో వయం మాతరమ్ ;
త్వాం నమామో వయమ్ !!
(పరిక్రమిస్తాడు)

మధుదాసు : చండీ ; చండీ ;
దేవి సేవించుటకు మించిపోవు వేళ
సజ్జ చేబట్టి పూదోట పజ్జనిల్చి
వెఱ్ఱిగానమ్మెతో దృష్టి వ్రేలవైచి
ఒక్క కుసుమమ్మయిన కోయకుంటివేల ?

చండీదాసు : (నిమీలిత దృష్టితో తన్మయుడై)
తలపు తెరల డోలల నూగుమనసే
చెలిమికలల జోలలతోగు సొగసే
పాడి, మనికి స్వర్గముగాగ

గడిపివైతును
గడియ గడియ మాధవు ప్రేమగాధ
ఒడలు మరచు రాధిక తీయబాధ ;
పాడి, జగమె బృందావనిగ సలిపి వైతును
గడియ గడియ మాధవు ప్రేమగాధ ;
పాడి, జగమె బృందావనిగ సలిపివైతును.

(దూరం నుంచి నేలవూడ్చే రజక కన్య — రామిని)

రామిని : తెరువరులు లేని బాట
మరపునకు రాని పాట...

పూజారి : ఏలాలతవలె ఊగెద వేలా ;
రాలోనికి రావయ్యా చండీ ;
రజకిని చూపులదారి మసలకు
బ్రహ్మజన్మ, ధర్మము నేమరకు ;

రామిని : (నేల వూడ్చుతూ ప్రవేశం)
తెరువరులు లేని బాట
మరపునకు రాని బాట
కరవునకు నెండు నోట
కురియు నమృతంపు నూట

చండీదాసు : (ఆమెనెదుర్కొని)
ఓహో తరుణాశాజ్యోతీ ;
నీహారసదృశమే నీగీతి
దీనాన న వగు ఓసాతీ ;
మానసమున కలిగెను ప్రీతి

పూజారి : అలవోకగ రజకిని పాడే, ఆ
వలపుపాటపై వ్యాఖ్యలవేల ?
చేరువగా పోబోకు సుమా !
దూరమయ్యేదవు కులదేవతకు ;

రామిని : మీ రెవరో మహా మాన్య ;
నేను పేద రజకకన్య—
వలపు బరువు తలపులచే
మీదు తేనె పలుకులచే
భయమున నా మది కలంగు,
ప్రియమున నా యెద చెలంగు ;
సరస నిలువ శాని దాన,
క్షమియింపుడు పోవుదాన.

చండీదాసు : మాధవ మధు మురళీధ్వని
రాధాన్వేషణలో...
యుగ యుగాలు జగజగాలు
వేచి వేచి తిరిగి తిరిగి
బృందావనమందే, కాళిందీ తీరమునందే
సఫల మనోరథ కాంచె
మాధవ మధుమురళి ;

-: కొందరు సాంఘికులు వృద్ధులు కలకలంతో చరచర వస్తారు :-

సాంఘికుడు : పతిత జనములతోడ సంభాషణమ్ము
ధార్మికుడ ; మాను, పాప సంధాయకమ్ము
ప్రేమ పేరిట మతి నీతి నీమ ముడిగె ;
చాలు కుహనా కవిత్వ సంస్కార మింక

రామిని : (వెనుకకు తప్పుకుంటూ)
స్వామి, పేదదాన మీదు
చదువు లెరుగనట్టిదాన
పూజ్య కృపాపీక్షణాల
బ్రదుకు గడపు దాసురాల
సహజము, నా దోస మేదో
క్షమా పాత్రమో కాదో ;
స్వామి, పేదదాన, నన్ను
క్షమియింపుడు పోవుదాన ;

చండీదాసు : జ్యోత్స్నా తరళిత తరింగిణీ రజనీ,
మత్స్వప్నాశయ దివ్యరాగిణీ తరుణీ;
విజన మదీయ హృదయ గృహ తారానారీ ;
రజకినీ రూప మాధురీ ; నవకిశోరీ

-: సాంఘికుల కలకలం హెచ్చుతుంది :-

రామిని : (మళ్ళీ మోకరిలుతుంది)
దివ్యమైన మీ సన్నిధి
పేదనైన నా పెన్నిధి
తెలియని నా మదిని రేగి
కల లెవో జడు లయి మూగు ;
మీరు వలపుతెరువరులో,
అమృత మాను సురవరులో ;
ఊపి రాడనీక కురియు
ఈ పరిమళముల బరువు
ఓపలేను, కరగి పోదు,

ఒరగిపోదు మీయడుగుల ;
ఎదలోపలి యెదలో యే
నదులో కదలి పొంగి మీ
పదాబ్జముల పయికి జారి
మెదలగోరు నిది దోసమొ ?...

-: తిరస్కార సూచకంగా సాంఘికుల కోలాహలం :-

సాంఘికులు : దోసమే రజకినీ వృథాయాసమేను
అధమ సంజాత, హాతని దగ్రజన్మ
కాన తత్పదచ్ఛాయ యందేని నిలువ
తగవు ; కట్టుకథల చెల్మి కెగయలేవు !

చండీదాసు : ప్రణయఖేలలో ప్రేయసి రాధిక
ప్రేమికుడే మాధవుడు !
ప్రణయశక్తి రాధిక జగన్మాత
ప్రేమమూర్తి మాధవుడు జగత్పిత !
ఓ జగద్వ్యాపినీ ! రజకినీ రూపిణీ
జగజ్జననీ ! అనంత ప్రేమఖనీ !
నీ శీతల చరణ తలమ్మే శరణమ్మోయి
దివ్యతన్వీ !

—సాంఘికుల కలకలం—

బృందగీతి : కలవంశీ స్వర ధునులో
మలయానిల మధురిమలో ;
ఝురులై పొరలుచు పులకించున్
విరులై యురలుచు సొలయించున్ ;

యువసౌరభ మదరుతులో
నవభావోజ్జ్వల గతులో ;
అళులై పాటల తమకించున్
అలలై ఆశల నెమకించున్ ;
హిమ మౌక్తిక తరళిమలో ;
తరుణాశల అరుణిమలో ;
నెలలై అమృతము లొలికించున్
కలలై కోర్కుల మొలిపించున్ !

రెండో రంగము

(పక్షుల కలరవాలతో ప్రాతఃకాలపు వెలుగుల్లో రజకవాటిక. ఊత పదంతో - రేవులో - బట్టలుదుకుకొనే రజకజనం.)

బృందగీతి : తొలుసంజ విరిసేటి పూవా, నువ్వు
మలు సంజనే వాడిపోవా ;
మురికి మడుగున కన్ను విడిచావే, సిరికి
సిరమెక్కి సివమెక్కి నడిచావే ;
కతలు కబురులు సత్తె మంటావు ; నువ్వు
వెతల పా లౌదు వేమంటావు ?
వెలుగు చీకట్లు మరిచావా, నీకు
కలుగు నిక్కట్లు తలిచావా !

—తన గృహము ముంగిట—

రామిని : ఈ పేద పూవలపు లే పగిది చేరునో
ఆశాళలను దాటి ఆ ప్రభాకరమూర్తి ; ॥ ఈపేద ॥
వలపేది తలపేది మరపున నశించునో ;

ఆలము నాళల వెలుతురుల ప్రశోభించునో॥ ఈపేద ॥
పంకజాంగనకు అకలంక తేజోఘనుని
అంకపీఠము కోరు టడియాసయే యేమొ! ॥ ఈపేద॥
మసలు సూర్యుని మంట విసురులో నుసి యౌనో
ఎసగు ప్రేమజ్యోతి కొసల నైక్యమె యౌనొ!
॥ ఈపేద ॥

(దూరమునుండి చండీదాసు కేక)

చండీదాసు : రామినీ, రామినీ! పూర్ణిమా యామినీ
ధవళకాదంబినీ తరళచ్ఛదనలోల నయనకల్లోలినీ!

రామిని : పిలిచారే ఠాకూరు ;
తలపున వలపులు మీరు
కన్నుల అశ్రులు రాలు
కనగలనా ఠాకూరు ?

చండీదాసు : (దూరమునుంచే)
రామినీ, రామినీ! (దగ్గరగవచ్చి) పూర్ణిమాయామినీ!
కనలేనే చెలి కనలేనే
నయన సుమదళము పయిని హిమకణము
వినలేనే చెలి వినలేనే
మందమధురరుతియందు విధురగతి
వినలేనే చెలి వినలేనే!
చెలిమి కలిమి నెదలో నలత
కలలోపల లోకము కలత
బ్రతుకు బ్రతుకే బరువై...కరవై
కనలేనే......కనలేనే...

రామినీ, రామినీ!...
కనలు కమలమ్ము తుహినాంబు కణములందు
రవికరస్పర్శనంది చిర్నగవు చిందు
వదనశశి జూచి బాష్పాంబువార్థి యెగయు
వార్థి కదలాడి యెగయదో వదనశశియు...

రామిని : ఎంతదయో! ఎన్నాళ్ళకు! ఆహా! ఠాకూరు రాక;
ఇంత దీనురాలి నను గ్రహించినారు సేదైన,
దాసిని వీడకుడు, విశ్రమింపు డిదిగో తరుశాఖ;
సరసవెన్నడు మీరు నిలిచి యున్నారో;
ఒరసి చూపుల చూపు లొల్కుచున్నారో;
ఇరుల త్రోసి హసించు వెలుగు కన్నానె;
వలితెమ్మెరల పాటలోలసె;
చలువ వెన్నెల రేని తళతళలు పొలసె
మనసులోపలి వెతల జడివాన వెలిసె;
మూకవడి ముడుగు నా స్వరము;
ఠాకూరు రాకలో తియ్యకలవరము;

చండీదాసు : జీవననందినీ! జీవననందినీ!
నీ, మందహాస చంద్రరేఖ
స్పందనా వికాసమందు విందుగ క్రొందళ్కులెన్నొ
చిందె;
జీవన నందినీ, జీవన నందినీ...
నీ, సుందర నయనాళి యుగళి
మంద్రగాన రవళియందు విందుగ క్రొందేనెలెన్నొ
చిందె;

జీవననందినీ, జీవననందినీ...
నీ, చందన నిశ్వసన పవన
బృంద మృదువిలాసమందు విందుగ క్రొందావులెన్నొ
చిందె;
జీవననందినీ, జీవననందినీ....

ఇద్దరు : మన ప్రేమ
సస్య సౌందర్య భూములలో
ప్రభవించి ప్రభవించి
నమ్రమరు సీమమగునో
కమ్ర సుమధామమగునో;
మన ప్రేమ....
కల్లోలినీ తరంగములన్
పయనించి పయనించి
శీర్ణ సికతాద్రి యగునో
పూర్ణకలశాబ్ధి యగునో ;
మన ప్రేమ....
కాలగాఢాగ్ని కీలలలో
తపియించి తపియించి
దగ్ధ తరుకాండ మగునో
ముగ్ధ మధుభాండ మగునో;
మన ప్రేమ....
దీర్ఘ ఝుంఝూ మారుతములన్
ప్రసరించి ప్రసరించి
విరహ నిశ్వాసమగునో

సరస దరహాసమగునో ;
మన ప్రేమ...
సువిశాల గగన వీథులలో
విహరించి విహరించి
ప్రణయ స్వేచ్ఛాభ్రగామి యగునో
నిరవధిక సౌఖ్య ధాని యగునో!

(రజకవాటిలో రజకబృందపు గొంతులలోనుండి - ఉండి ఉండి... 'తొలుసంజ విరిసేటి పూవా నువ్వు మలుసంజనే వాడిపోవా' అనే బృందగీతి దూరంనుంచీ క్రమంగా దగ్గరై వినవస్తుంది.)

: మూఁడో రంగము :

(గర్భగుడిలో- చిరుగంట గణగణ వాయిస్తూ దేవతార్చనలో నిమగ్నుడైన నకులదాసు)

నకులదాసు : ఆదిశక్తీ ; దేవి ;
వేదత్రయీ మూర్తీ ;
ధర్మసంకాశినీ ;
నిర్మలాత్మ ప్రభాభాసినీ ;
హేజననీ ;
పతిత దీన క్షమాసంగినీ
ప్రేమాంతరంగిణీ ;
పావనీ ;

-: ముందు వాకిట కలకలముతో సాంఘికులు :-

సాంఘికుడు : అహహా ; దేవీచరణశీలు డహరహమ్ము ;
ఆదిశక్తి సమర్చనాభ్యాసపరత
గర్భగుడియందె, ధర్మభంగమ్ము చేయు
భ్రాతృ ధౌర్త్య ముపేక్షించు వ్యర్థమమత
గర్భగుడియందె ఘోరార కాలమహిమ ;

-: నకులదాసు చేతిలోని దేవతార్చన గంట జారి క్రింద పడుతుంది :-

నిత్యకర్మవ్యతిక్రామి నిందితపథ
గామి నేటితో నర్చాధికార మెడలు ;
నేటితో నాత్మ సంఘ సాన్నిధ్య మెడలు ;
ఇదియె ధర్మజ్ఞసమితి విధించు శాస్తి ;
ఇదియె ధర్మచ్యుతు డనుభవించు శాస్తి ;

అందరు : చండీదాసు స్వధర్మపాలనకు వెలి ;
చండీదాసు స్వసంఘలాలనకు వెలి ;

-: భేరీ మ్రోగుతుంది - తొట్రుపాటుతో నకులదాసు :-

నకులదాసు : శరణు శరణు ప్రశాంత దాంత స్వాంతులారా,
శరణు శరణు ;
మీదు దూషణ భాషణమ్ముల కేనె బాధ్యుడ ;
బాలు డాత డపరిణతుండు ;
ఉద్వేలమౌ భావగతి నాపగ చాల డాతడు ;
బాలు డాతడు ;

౧. సాంఘి : బాల్యప్రౌఢి, వయస్సా
కల్యారూఢియు నభేదకలితంబులు, దౌ
శ్శీల్యా చరణంబున దౌ
ర్బల్యానీత స్వకర్మభంజన మందున్

౨.వ సాంఘి: అధ్యాత్మ పరత్వము చెడు
మిథ్యేంద్రియ లాలసత్వ మిహికా పథికుల్
వధ్యులె కాకుండినచో
సాధ్యమె ధర్మంబు పృథివి సాగుట కెటులున్ ...

నకులదాసు : ఎరుగమిని చేయు తప్పే జీవితమ్మెల్ల
తరిమి సాధింపగా తగవగునె ధర్మాత్మ
పొరబడిన దుర్బలుల సరిచేయగా వెరవె
కరుణింపరో కృపామహితాత్ములార ;

సంఘవృద్ధు : కఠిన దండనకాని మార్గ మెమ్మకటి
కలదు ప్రాయశ్చిత్త కర్మమ్మె ;
దేవి సన్నిధి దివిజ తర్పణ
కర్మదీక్షితు డౌచు సత్పథ
గమనమునకై ప్రతిన పట్టిన
సవ్యముగ నా పైని నడచిన
సాంఘిక స్వత్వమున కర్హత
సంఘటిల్లును, సంఘవృద్ధులు
సమ్మతింతురు, సంతసింతురు ;

నకులదాసు : భాతృప్రేమార్ద్రిమౌ ఆశలే
నా హృదిని కలుగు ;
మహిత సంఘ ప్రేమ పాత్రుడై
నా భ్రాత మెలగు ;
మాతృసేవా ప్రసవ మాన్యుడై
ధన్యుడై చెలగు ;
పతిత దీనతమాసంగినీ,
ప్రేమాంతరంగిణీ ; జననీ ;

అందరు : దిగంత సరిత ప్రణవరూపిణి ;
అనంత అచల ప్రణయగాయని ;
త్వాం నమామో వయం మాతరమ్ ;

(నాలుగో రంగము)

సాంఘికులు శాసనం వల్ల సమాగమానికి వీలులేక, తపిస్తూన్న రామినీ చండీదాసుల వియోగవేదన.

బృందగీతి : ఎవరు విన్నారెవరు కన్నారు ;
రాధికా ప్రణయమ్మునకు సాటి
మాధవుని ప్రేమమ్మునకు సాటి ;
ఎడలు రెండూ ఏకమన్నారు ! ఎవరు !
గడెవియోగమె సైచమన్నారు !
తమ సమాగమ మింక ముగిసేనో
తనువొరసి ఉసురులే యెగసీనో ! ఎవరు !
చందురుని చెంగలువ వలచేని
చాతకము. జలధరుని తలచేని
చలి తుపానుల కలువ మడిసేని ;
చాతకము దాహార్తి నుడిసేని ;
చందురుడు చెంగలువ జూచేన ?
జలధరుడు చాతకము గాచేన ?
ఏటికో యీ క్షణిక ప్రణయాలు
సాటిలేనిది రాధ ప్రణయమ్మో ;
సాటిలేనిది కృష్ణు ప్రేమమ్మో ! ఎవరు !
తేటివలపే మేటి అంటావ ?
పూవు వలపే పొగడబోతావ ?
పూవు కొరకై తేటిరాదేని,
తేటికొరకై పూవు పోయేన ?

పటికో, యీ క్షణిక ప్రణయాలు ;
సాటిలేనిది రాధ ప్రణయమ్మో ;
సాటిలేనిదీ కృష్ణు ప్రేమమ్మో ;
(రజక వాటిలో రామిని వలపోత)

రామిని : కురియదేలో వ్రజభువిలో
మధుమురళీ సుధాఝురీ ;
యమునదరిన్ తమ మలమెన్
పిలుపులెవో కలచునెదన్
శ్వసనవినా తృషిత మహిన్
నీరవతా, విరాగతా ;
విరహవ్యథా విదాహమో ;
నిదాఘమో ; నిరయమ్మో ;
(ఆలయములో చండీదాసు తలపోత)

చండీదాసు : నా మురళి,
మధుర శ్రుతుల పలుకదే !
నా హృది
సుధాధారలను చిలుకదే !!
కోకిలకు
మూగవోయెనో కంఠరవము !
కేకికిక
ఆగిపోయెనో నాట్యజవము !!
నా మురళి
మధుర శ్రుతుల పలుకదే !!
చీకటులు

మూకముసురుగ రగిలెనే;
ఘూకరుతి
వ్యాకులత కెదపగులునే !!
నా మురళి
మధుర శ్రుతుల పలుకదే,
(రజకవాటిలో రామిని వాపోత)

రామిని: దాసికానా ప్రాణబంధూ
నన్నుదాసింతువే ప్రేమసింధూ;
ఆశలే సురిగి తూలెవో; ఆకాశమే విరిగి కూలేనో !!
దాసికానా;
చెలికై తపించు ఏకాకి, మనికి,
ఆకలిలో నశించు వడసోకి;
హృదయమ్ముపై రాలు రువ్వ, లోకమ్ము
అదయమౌ వెడనవ్వు నవ్వ; దాసికానా;
చంద్రుడే యిరులలో దాగె, జగము
తంద్రలో కనుమూసి తోగె;
బృందావనికి నీవురావో, మధుర
మందానిలము లింక లేవో;
దాసికానా ప్రాణబంధూ;
నన్నుదాసింతువే ప్రేమసింధూ;

(బయట ప్రళయంగా ఝంఝూమారుతం వీస్తూంటే ఆలయంలోపల కరగిపోయిన గుండెతో చండీదాసు.)

చండీదాసు: ప్రియతమా; గాఢాంధకార బంధుర రాత్రి
గగనమ్ము కాలమేఘాచ్ఛన్న మీరాత్రి

నలుగడల తాపసంకులమౌ మనస్సులో
అలముకొను పాపపంకిలమౌ తమస్సులో
వలచికొన్నాను నా కరుణానిధిని నిన్ను
పిలిచికొన్నాను ;
దరికి రాబోవు నీదారి కంటకితమ్ము
తలుపు గడెవైచి హేళన చేయు సంఘమ్ము
కుటిలలోకమ్ము ప్రేమ కృపా దరిద్రమ్ము ;
జటిల ధర్మ వివాద జడితమ్ము హృదయమ్ము
క్రూరమగు లోక ధర్మము నెదుర్కొనలేను
కోరికగు ప్రణయ జీవిక నందుకొనలేను ;
గగనమ్ము కాలమేఘాచ్ఛన్న మీరాత్రి ;
ప్రియతమా ; గాఢాంధకార బంధుర రాత్రి ;

(ప్రకృతి ఒక్కసారిగా కొన్ని క్షణాలసేపు శాంతిస్తుంది ఒక సంఘ వృద్ధుడు వోదార్పుగా చండివద్దకు చేరుతాడు)

సంఘవృద్ధు : వేళమించె కన్నులు తెరువుము
విశాలాక్షి పదములనొరగుము ;
చిరుత హృదయ మాగాటమ్మున
పొరలు గ్రమ్మె ధర్మ మ్మొడలను
వంత లుడుపు ధర్మమార్గము—
శాంతియుతము ధర్మజీవిక ;

-: దూరాన సన్నాయి, మంత్రఘోష :-

(ఐదో రంగము)

-: ఆలయంలో, సన్నాయి - ఘంటానాదం వినవస్తూంటాయి :-

బృందగీతి : ప్రణయ పరిశుద్ధుండు
చండీదాసు ప్రాయశ్చిత్తమంట ;
వలపుతాపసియైన మాధవు
మనసె కల్మష కలితమంట ;
చెలిమికై తపియించు రామిని
చిరుత హృదయము వ్రేల్చుమంట
మలిన ధర్మప్రోక్తలా
ఆచార్యవర్యులె కర్తలంట ;
ప్రణయ పరిశుద్ధుండు
చండీదాసు ప్రాయశ్చిత్తమంట

(దూరాన రుంయిమని బరువైన గాలి యీల. రజకవాటినుండి పరుగెత్తి వస్తూ రామిని)

రామిని : ఎడద పగులునో, బ్రదుకెరగులునో
విరహజీవికే - యేవిధిని గడచునో
మరపుటిరులలో, మరిగి సురుగునో
చదివిన నరులే, అదయహృదయులో—
తెలివి మరుగులో, వలపు తలపరో ?...

(రుంయిమని వినబడే పవన రోదనమును చీల్చుకొని రామిని ఆర్తారావం వినబడుతుంది)

రామిని : ప్రణయమూర్తి ప్రాయశ్చిత్తమో ;
ప్రేమికార్తి లోకోత్పాతమో ;

(దేవాలయంలో, ప్రాయశ్చిత్త మంటపం-మంత్రఘోష.)

అర్చకులు : జయ విశాలాక్షీ ! జయ విశాలాక్షీ
దేవ్యై నమోస్తు దివిదేవ గణార్చితాయై
భూత్యై నమోస్తు భువనార్తి వినాశనాయై
శాంత్యై నమోస్తు శరణాగత రక్షణాయై
క్షాంత్యై నమోస్తు దురితక్షయకారణాయై
(సుదూరంలో రామిని ఆర్తనాదం.)

రామిని : ప్రాణాధికా ! ప్రాలుమాలికా ;
ప్రళయ ఝుంఝు వీతెంచునిదే ;
ప్రణయ శక్తి విజృంభించు నిదే !

(అర్చకులు బిగ్గరగాను-వెంట-చండీదాసు మందంగా ఆలస్యంగాను - మంత్రపాఠం.)

అర్చ, చండీ : ధర్మ ప్రకాశినీ ! ధర్మ సంకాశినీ !
మహాపాపినం స్వధర్మచ్యుతం
మాంశోధయ పరిశోధయ ;
మాంపాలయ ప్రపాలయ
భావి సౌశీల్య ప్రతిజ్ఞాతారం
మాం రక్షయ పరిరక్షయ !

(ఆత్రంగా పరిగెత్తివస్తూన్న రామిని గొంతు దగ్గరవుతూంది.)

రామిని : ప్రాణపతీ ! ప్రణయైకమతీ !

(మంత్రపాఠం అర్చకులుమాత్రమే - పరధ్యానంగా వెంట అనుకరించని చండీదాసును హెచ్చరిస్తూ - నొక్కి-నొక్కి చదువుతుంటారు.)

అర్చకులు : భావి సౌజన్య ప్రతిజ్ఞాతారం
మాంపాలయ ప్రపాలయ !
(హెచ్చరికగా తిరిగి అదే చదువుతారు.)

(ప్రాయశ్చిత్త రంగంలోకి రామిని వచ్చివేసింది.)

రామిని: ప్రాణపతీ! ప్రణయైకమతీ!

పళ్యములు పాత్రలు దళాలున వదలివేసి ఆచార్యుల హాహాకారాలు లెక్కచేయక చండీదాసు వచ్చి రామిని పాదాలవద్ద మోకాళ్లపై వ్రాలిపోతాడు)

చండీదాసు: ప్రణయినీ; రామినీ!
స్నిగ్ధతేజో ధామినీ, దివ్యభామినీ!
శాశ్వతేకైక సౌధర్మ్య స్వరూపిణీ;
చకితరవి శశి తారకా ప్రభావ్యాపినీ!
చరణచారణ సకల దివిజ మనుజావళీ;
నిరుపమ ప్రేమిని!
వరప్రేమ గాయని, వాసంతదాయిని;
విశ్వసుందరి, వేదమాత; గాయత్రీ!

(ప్రాయశ్చిత్త మంటపంలో - సాంఘికుల ధన్యవాదాలు ... ధిక్కారాలు- ఛీత్కారాలు- కల్లోలంనుంచి వెలువడి చండీదాసు, రామిని కలసి ప్రస్థానము. ఆలయ ప్రాంగణంలో)

ఆచార్యులు: తక్కువ వెలంది వేదమాతగ నుతించు;
విజ్ఞసంఘంబులోననే విప్లవంబో
వెర్రితలలో ఘటిల్లెడు వీనికతన
ఈ క్షణమె - ధర్మ పతితుడౌ నితడు జన్మ
భూమినుండ ననర్హుడై పోవుగాక!

నకులదాసు: అగ్రజుని స్నిగ్ధ హృదయమ్ము ప్రీల్చితివోయి
అనుజ అనుజా పోవుదువా, పోవుదువో తండ్రి!
పోవుదువా తండ్రి; పోయితివా;
దేవీ, విశాలాక్షీ — ఓ విశ్వహృదయినీ

భగ్నహృదయుడను, విభ్రాతృకుడ
లోఁగొనుమమ్మ !

(గుండె పగిలి కూలిపోతాడు.)

సాంఘికుడు : వంశమును సంఘమును గురువరుల ధిక్క
రించు పాపి, ఆత్మ భ్రాతృ ప్రేమమణిని
కాలదన్ను నారకలోక గామి - అరిగె ;
సంఘమున కొక యెడ సుప్రశాంతి గలిగె
ప్రేమఖని నకులాచార్యు హృదియె వ్రీల
సర్వలోకమ్మునకును విషాదమయ్యె !

(జనసందోహం క్రమంగా తగ్గుతుంది)

ఉత్తర రంగము

బృందగీతి : మాధవదేవుని మధువనము జగము
రాధారమణీ జీవనము :
ప్రణవ వికంపిత పవనాలింగిత
తరుకుంజలతాకరము :
ప్రణయ కదంబిత మధుకర చుంబిత
ప్రసవ సౌరభాకరము :
మదశకుంతరవ మధు ప్రభాతము
హృదయ రాగమంజరీ విభాతము:
గ్రీష్మవికాస విచికిలోచ్ఛ్వాసము
ఊష్మాగమ వంశీ నిశ్వాసము :
జలధర మర్మర దౌత్యోల్లాసము
చలద్విన ర్తక చపలాహాసము ;

శశికర సుషమాలస విన్యాసము
శిశిర తుషార విహార విలాసము;
రాధా మాధవ ఖేలనము జగము
బాధా ఖేదో న్మూలనము;

(మహాప్రస్థానంలో - చండీదాసు, రామిని ప్రణయతరణిపైని)

రామిని : నినువీడి మనుదునే నాథ ; నా
మనికి కనువెలుగీవె కాద ;
ఒరగి నీ యెడదనే మెదలి, నే
కరగిపోయెద మేను వదలి ;

చండీదాసు : నిను వినా, దేవి; నాకమ్మైన వలతునే
క్షమియింపవో-ధర్మ జడితుదోషము ప్రియా
కలల లోకపు టంచు మెరసి నీవై వెలసె
వలపు తెరువరి యెడద సొలసి తీవలు మలసె
తెలివి మరుగున దాగి వలపు నెరుగని భూమి
నిను వినా, దేవి; నాకమ్మైన వలతునా ?
మనికి స్వర్గ మ్మెపుడు కాదు ;
జగము బృందావనము కాదు ;
మనమె స్వర్గము సఖి ;
మనమె బృందావనము !

రామిని : నీ రాధికను నేనె !

చండీదాసు : నీ మాధవుడ నేనె !

ఇద్దరు : మనమె స్వర్గము ప్రియా !
మనమె బృందావనము !

(అశాంచల అవధిలో మహాప్రస్థాన ప్రణయ నౌకలో)

ఇద్దరు : ప్రియా, నడవనీ మన ప్రణయనౌక-
వేగ గడవనీ లోకమ్మువాక !
మనకు కాల మొకటే వెల్గురేక
ఎడద లేకమై సోలు నందాక
ప్రియా ! నడవనీ మన ప్రణయనౌక !

బృందగీతి : ప్రణయఖేలలో ప్రేయసి రాధిక
ప్రేమికుడే మాధవుడు !
ప్రణయశక్తి రాధిక జగన్మాత
ప్రేమమూర్తి మాధవుడు జగత్పిత !
రజకినీ ప్రియుడైన చండీ
దాసు విశ్వ ప్రణయగానము !
ప్రేమగానము, ప్రేమగానము !
సకల జగదభిరామగానము !

లకుమా దేవి

(శ్రీ ఖావరాజు వేంకటకృష్ణరావుగారు, కొన్ని చరిత్రాధారములపై ఊహించి కల్పించిన కథ - ఈ నాటికకు ఆధారము.)

రచయిత : కృతజ్ఞుడు.

(రాజులలో స్నేహము కత్తిమీద సాము. ఏ నిమిషమున ఏమగునో చెప్పలేము. 'నీ నాట్యమహిమ నిజముగ వేల్పు చేడియలగు ఊర్వశీ తిలోత్త మాదులను గూడ సిగ్గుపడ జేయుచున్నది. దేవీ, లకుమా సుందరీ' అని బహూకరించి తన ప్రేమ సామ్రాజ్య పీఠమున నధివసింప జేసిన వసంతరాయ బిరుదాన్వితుడు, కుమారగిరి వల్లభుడే ఈర్ష్యా పరవశులైన కుమతుల రహస్య వచనములకు చెవి యొగ్గి ఆమె శీలమును సంశయించి, నీవు నిర్దోషి 'వని నిరూపించుకొనుటకై, ఈ గోపుర శిఖరమునుండి నేల మీదికి దుముకవలయును' అని ఆజ్ఞయిడిన, అభిమానవతియైన లకుమ ఏమి చేయగలదు ; లకుమ తన సౌశీల్యమును నిరూపించినదిగాని, హృదయేశ్వరుని అవిశ్వాసమును సహింప గలదా ?)

బృంద : హృదయమ్ముల మధురమ్ముగ
నుదయించెను ప్రణయశ్రుతు
లుదయించెను ప్రణయ శ్రుతు
లుదయించెను......
ప్రణయ శ్రుతు లెగసి యెగసి
విశ్వమెల్ల యెడల పరచుకొనియె
నెల్ల యెడల పరచుకొనియె - లోన
అణువణువున సొగసులూరి
అద్భుత నాట్యాలు తీరి

అతిలోకపు సౌందర్యము
అవ్యయమౌ ఆనందము
అణువణువున ఆనందము
ఆనందము ఆనందము...
ఏదో హాతా దుపద్రవ
మ్మేదో హాతా దుపద్రవమ్ము ;
గ్రహకూటము, తారకాళి, గతులు మారు
సంక్షోభము ;
విశ్వవీథి హాహారవము
భగ్న హృదయ బాధాస్వర
మేదో హాతా దుపద్రవమ్ము ;...
విషాద మేఘాంబు పూర వికిర కేశపాశముతో,
హృదయము చిదికిన ఏ సతి వదనమ్మో ఆకాశము ;
జగదరిష్ట కారియైన ధూమకేతు వాలమో,
ఛిన్న హృదయరక్త రాగ రంజిత కరవాలమో ;
విభునిచేత శంకితయౌ విమల హృదయ ఆత్మఘాత
వినువారికి కనువారికి హృదులు కరగు ఆర్ద్రగాథ...

(కొండవీటిలో సంగీత సాహిత్యములందునూ నాట్యశాస్త్రము నందునూ వర్ణనాతీతమైన అభిమానము గల వసంతరాయ బిరుదాంకితుడగు కుమారగిరి ప్రభువు కొలువు కూటమున వసంతోత్సవము - వాద్యఘోష.)

వందిమాగధ బృందగీతి :

జయము జయమోయి : రెడ్డివంశ ప్రదీపా ;
జయమహో ; దిగ్దిగంత కీర్తి ప్రతాపా ;

జయము మాణిక్య సింహాసనాధీశ్వరా;
జయము సర్వస్వ దానధర్మపరాయణా ;
జయము జయము ఇమ్మడి గరుడ నారాయణా ;

... ...

కాటియవేమన : జయోస్తు, కుమారగిరి భూ
దయితా, మా భరతశాస్త్ర తత్వవ్యాఖ్యల్
వయస్వినీ వసంతమధు
మయోల్లసిత నర్తనముల మాన్యములగుతన్ ...

కుమారగిరి : సేమమె బావా ? కాటయ
వేమా ! ఇద మాసనమ్ము, విబుధ వసంతా
రామము త్వదా గమనమున
వే మడుగుల శోభవించె విబుధ వతంసా...

కాటయ : కుమారగిరి భూవర, ఈ
సమాగతానేక విబుధ సత్కవి సభలో
సమానరహిత నర్తకి, ల
కుమాదేవి చైత్ర నృత్యగోష్ఠిని కనుడీ ;

లకుమ : ఇది వసంత రాజసభా భవనమ్మో

బృందం : వసంతోద్యానవనమో
ఏ దెసనో కోకో, కోకో,
ఏదెసనో కోకో, యని ఒక కేకా

బృందం : దెసదెస కోకిల బాకా

లకుమ : బాకా వెనుకనె యెర్రని పచ్చని

స్త్రీలు : రంగుల చివురు పతాకా

లకుమ : ఆ దెస ఈ దెస క్రమ్మెను ధిమ్మని

స్త్రీలు : తుమ్మెద ఝుంకృతి దుందుభి

పురుషులు : ఝుమ్మని తుమ్మెద హుంకృతి దుందుభి

స్త్రీలు : తెమ్మెర తెమ్మెర

పురుషులు : ఏమనె తెమ్మెర

స్త్రీలు : విడెను మంచుతెర

పురుషులు : వచ్చె వచ్చెను వసంతుడని,

స్త్రీలు : అందులకా యీ యుత్సవము ?

పురుషులు : అందపు తియ్యని కలవరము :

స్త్రీలు : ఇది వసంతరాజ శుభోదయమా ;

పురుషులు : నవ వసంత ఋతు రాజోదయమా !

లకుమ : నిత్యవసంతా, నవ్య వసంతా
నిత్య స్వాగతమోయీ ప్రభూ ॥ నిత్య ॥
నిత్యయౌవనా ప్రణయార్ద్రావన
నిస్తులకీర్తి ధవళితాశాంతా ॥ నిత్య ॥
తరుణీ ప్రణయారామ మనోహర
తరుణ వసంతుడ వీవె ప్రభూ ॥ నిత్య ॥
హృదయ కుసుమమును పదముల నుంతును
కరుణాదృష్టిని కాంచు ప్రభూ ॥ నిత్య ॥
వరముగా నిమ్ము పావనము, నీదు
మధు వనము నందు జీవనము ॥ నిత్య ॥

జనబృందం : సాదు సాదు లకుమాదేవీ
సాదు సాదు లకుమాదేవీ

సుకుమార నృత్య సౌందర్యభావ
సంధాయినీ, అమరగాయనీ
అపరూప కల్పనా మాధురీ ఝరీ
అసమాన నాట్యలహరీ... ॥ సాదు సాదు ॥

కుమారగిరి : బావా, కాటయవేమ చ
మూ వల్లభ, మహిత భరతముని వాక్కులకున్
మీ వ్యాఖ్య వెలుగు దివ్వియ
మీ వ్యాఖ్యకు లకుమ నాట్యమే వెలుగుసుడీ

కాటయవేమ : అల వసంత నృత్య మానందముగ జేసి
లకుమ సకల నయన లక్ష్మియయ్యె
అల వసంత నృపతి కంకితమై నిత్య
యశమునందు మాదు వ్యాఖ్య జగతి...

కథా కథన బృందగానం :
ఆ సుందరాంగాల, ఆ కృపాపాంగాల
నాట్యాల మురిపించిన మిటారి లకుమ !
ఆ భ్రూ విభంగాల, వేణీ తరంగాల
వలవంత హింసించిన కటారి లకుమ !
సుకుమారుడు కుమారగిరి కోమల హృదంబుధిని
పొంగి పొరలించు శశి మూర్తి లకుమ !
ప్రేమాళువు వసంత భూపాల హృదనంత సా
మ్రాజ్యమ్ము నేలు దేవేరి లకుమ !

కవి : జయతి మహిమా లోకాతీతః కుమారగిరి ప్రభోః
స్పదసి లకుమాదేవీ యస్య ప్రియా సదృశీ శ్రియా
నవ మభినయం నాట్యార్థానాం తనోతి నవ్రహసధా
వితరతి బహూనర్థా నర్థివ్రజాయ సహస్రశః ...

రెండో రంగము

(ప్రదేశము - వసంతోద్యానవనము)

కుమార : హృదయేశ్వరి, ఏమని పాడెను కోయిల
ఏమేమని ?

లకుమ : హృదయేశ్వర, మధువని మరల పిలుచు
నామనివీవని ;

కుమార : న న్నామని అనెనా, అనలేదా నిన్నేమని ?

లకుమ : రా జామని యగుచో, రాణీ వనరమయే యనె ;

కుమార : కోకో యని ఆ కోయిల ఏకాన్క లందుకోయనె ;

లకుమ ; వలపు తేనియలు, పరువపు ఫలము లందుకోయనె ;

కుమార : ఓ వనరమ,

లకుమ : ఓ వసంత...

ఇద్దరు : హాయిగ నేలుదము వసంతారామము జగతి ;
ప్రణయ శాసనమ్ము ప్రణయ సామ్రాజ్యము మనది ;

కథా కథన బృందం :
చిత్ర సాహిత్యాంగణముగా
నాట్యగీతా మండపముగా
ఆవసంతావనీశుడు లకుమా సఖి

ప్రేమాలయముగా
కట్టించె గృహరాజ సౌధమ్ము;
యుగయుగమ్ముల ప్రణయ బంధమ్ము:

(మూడో రంగము)

(ప్రదేశము - అంతః పురము)

—: అంతఃపురంలో వదంతి బృందం :—

"ఇదిగో - ఓహోయ్" "ఇదిగో, ఇదిగో, ఓహోయ్"
"విన్నావా యీమాట" "అన్నట్టే మాటే మాట?"
"ఆమాటన కూడదు గాని అబ్బ, తలిస్తే దుర్భరము"
"ఊరూ పేరూలేని నర్తకికి" — "ఉష్ ఉష్..."
"ఉష్షూలేదు, గిష్షూలేదు, - ఉలుకెందుకు ఉన్నమాటకే,"
"నే సహించలేన్" "నే సహించలేన్......"
"నే సహించలేన్......" సహించలేన్...
"ఊరూపేరూ లేని నర్తకికి - ఉన్నట్టుండగ అందలమా?"
"వదంతి వేద్దాము రాజు మనస్సు విరుద్దాము"
"ఇదిగో ఓహోయ్ ఇదిగో ఇదిగో ఓహోయ్"
"విన్నావా ఈమాట?" "అన్నట్టే మా టేమాట?"
"రాజు కంటిలో కారమా?" "లకుమాదేవికి
ప్రియులెందరు?" "ఆఁ?"
"ఇద్దరు ముగ్గురు..." — "ఇద్దరు ముగ్గురు"-
"నమ్మినరాజుకె ద్రోహమా"
"ద్రోహమా"... "ద్రోహమా..."

రాజు : —: ఆగ్రహంతో ప్రవేశించి :—

ద్రోహమా, క్షమింపము, నాట్యమోహినీ
సరస్వతీ దేవి యవతార రమ్య మూర్తి
వేమె యనిపించి, వలపించి హృదయరాజ్య
పద మధిష్ఠించు నీవే యపాత్ర వగుదా ?
ఈ లకుమా రమణి నడత
మాదు హృదికి తీరని వెత;
కాటయ వేమా, ఇది మీ
కానుక యేనా ? ఇది యే
పాటి నర్తకియో, యెంత
కుటిల బుద్ధి; కుమతి; ద్రోహి;

కాటయ : ఓ వసంత భూజానీ
ఓరిమి, ఓరిమి, ఓరిమి;
అంతటి ప్రణయాస్పదకే - అంతటి వినయగుణవతికె
ఇంతటి యపవాదు నే నోకించుకయును నమ్మజాల;
ఓ వసంతభూజానీ
ఓరిమి ఓరిమి ఓరిమి;

రాజు : అపవాదకళంకిత దెస
కు పోయి చూడ మిక; చాలు కుహనాప్రేమల్;
అపూర్వ నర్తనలు, చాలు
విపరీతానుభవ వృథావేళ పరతలున్;

బృందగీతి : కళాసరస్వతి కాలియందియలు
ఘల్లున మ్రోగని వాయె,

కలస్వనమ్ముల వీణాగళములు
తంతులు పలుకని వాయె,
గృహరాజ సౌధమున దీపికలే
వెలుగులు మూసిన వాయె;

నాలుగో రంగము

—: గృహరాజ సౌధమున ఏకాకినియైన లకుమ :-

లకుమ : నీ పాదములు తాకు ఆపావన
రజః కణాలె నా సుమశయ్య గాదె నాథ;
యేలాగు తలయెత్తెనో గాని నీలాపనింద
నా బ్రదుకే దహించు నాథ;
నీ దివ్య సన్నిధియే లేక నానింద
నేరీతి బాపుకో నేర్తు నాథ;

వందిమాగధులు : జయ జయ కర్పూర వసంతా;
జయ వీరభోగ విజితానంతా;
జయ కుమారగిరి వసంతరాయా;
జయ కవి పండిత నిత్యధ్యేయా;

లకుమ : దోషికాని దాసురాలిపైన
ఏవిధాన నాగ్రహమ్ము పూని
ఎంత కఠిన శిక్షవై చినారో ?
ఇంత కరుణ జూప వచ్చినారో ?

కుమారగిరి : లకుమా, లెమ్ము పరీక్షిం
పక యే నిను స్వీకరింప మాకొప్పదుగా
సకల ప్రజ కకలంకత

ప్రకటించు పరీక్షకాగి పడయుము మమ్మున్
గృహరాజ సౌధంబు
గోపురపు శిఖరమ్ము
కొనసనుండి దుమికెదవ లకుమా? - భువిపైకి
దుమికి తలపూ వాడకయె నిల్తువేని
నలుసంతయేని అలసట పొందవేని,
మా ప్రేమ కీవు పాత్రమ వౌదుల కుమా!!

లకుమ : నా మధురాశయములు పూజనములు
నిజమైతే, నిజమైతే—
నా గురుసేవలు, కళాతపమ్ములు
నిజమైతే, నిజమైతే—
గృహరాజ సౌధ గోపురము
భూమాత కౌగిలియు నొకటైతే
నా ప్రభుని ప్రేమ నాదౌను :—

(గోపుర శిఖరమునుంచి లకుమ భూమిపైకి దుముకుటను సూచించు వాద్య సంగీత ధ్వనులు)

బృందగీతి : గృహరాజ సౌధవలభి నుండి దుమికెను దుమికెను;
రాలెడు చివురాకో,
తళతళ మెరయు పదమ బాకో,
పెనుగాలి యలలు ఛేదిల్లి పరచు
సుడిగుండములను తిరుగుచు
గిరగిర తిరుగుచు గిరగిర తిరుగుచు!!
హరివిల్లు వోలె తెరలౌచు వెలుగు
గొడుగుగా విరిసి పావడా!!

వెలుగు గొడుగు పావడా, గాలి
పొరలపై తేలియాడగా; - భూమిపై
రాలిన చివురాకో !
రాలిన చివురాకో !

బృందగానం : సాదు సాదు లకుమాదేవీ
సాదు సాదు అలంక చరిత్రీ
సాదు సుకుమారగాత్రీ...

కుమార : లకుమా, మదీయ ప్రేయసి
అకలంక చరిత్ర; బహుజనారాధ్యవు ! ని
న్నకారణమ్ముగను బరీ
క్షకు పిల్చితి; నాదు తప్పు సైరింపగదే !
రమ్మ ప్రేయసీ, నాదు అర్ధాంగలక్ష్మి !
ఇమ్మ నీ క్షమాభిక్షగా ప్రణయరక్ష !

లకుమ : దాసిని దరిజేరకుడు ప్రభూ
ప్రజావాక్యమే కర్తవ్యముగా
పాలించే ధర్మపరిభువే
విశ్వసింపరుగ మీ ప్రేయసినే
విశ్వసింతురు వదంతులనే
ఈ హృదయమ్మున రగిలే
ఆ యవమానాగ్నులనే
ఈ చిరుబాకున చల్లార్చుదునో !

-: మొలనున్న బాకుతో పొడుచుకొని భూమిపై ఒరిగిపోవును :-

రాజు : గతించితే లకుమా
అవమాన ఖిన్న సుకుమార

హృదయ! లకుమా, అయ్యో! లకుమా!
ఈ భూమినింక వాసంత వైభవములేవీ!
లకుమా విన రత్నములేవీ!
ఈసిరులు వృథా! సంపదలు వృథా!
రాజ్యమ్ము వృథా! భోగమ్మువృథా!
లోకమ్ము వృథా! నాకమ్ము వృథా!
ప్రేయసియె వినా జీవితమె వృథా!

బృందగీతి : విభునిచేత శంకితయౌ విమలహృదయ ఆత్మఘాత
వినువారికి కనువారికి
హృదులు కరగు ఆర్ద్రి గాథ!

విజయ విధాత

[కేనోపనిషద్గాథ ననుసరించిన రచన]

(దృశ్యము - దేవేంద్రుని సుధర్మాంగణము)

సుర వందిమాగధులు :

జయతు జయతు త్రిదశ సార్వభౌమా,
జయతు జయతు సుత్రామా,
జయతు జయతు శచీ రాజ్ఞీసఖా,
జయతు జయతు శతమఖా !

(హఠాద్విషాదలోకారిష్ట సూచక సంగీతము.)

ఇంద్రుడు : దిక్పాలకులారా, ఓ
దేవగురూ, అదియేమో,
నిర్నిమిత్తముగ ఏవో
దుర్నిమిత్తములు తోచెడి
ఋషులు, అప్సరసలును, దే
వసభ కదే యేతెంతురు
సరభసగతి నే డదేలా.

ఋషులు, అప్సరసలు :

శరణోయి, త్రివిష్టపాధిపా,
త్వరపడవోయి, జగాల బ్రోవగా,
దుష్టజనావిష్ట మౌటచే
ఈ విశ్వమున కరిష్ట మాయెనే

ఇంద్రుడు : దేవసభకు వేంచేసిన మీకే
దీనాననము లవేలా
వణకు వాతెరలు మోడ్చిన చేతులు
వంచిన శిరము లవేలో

ఋషులు, అప్సరసలు :
సహింతువోయీ, శచీపతీ, యీ
దేవమౌని జనహింసా,
రాక్షససైన్య రిరంసా
శరణు శరణు శతమఖా, చేయగదె
దేవ మౌని జనరక్షా,
దానవ దుర్జన శిక్షా,
ధాత లేడనుచు దుర్జను డొక్కడు
దండించెడు మము సేనలతో
ధాత ప్రతినిధివి దుర్జన సేనల
దండింపుము వజ్రపాణివై

ఇంద్రుడు : వజ్రపాణి నే నుండగనే
దుర్జనులా లోకములందు ?
మోదగ నా వజ్రముతోడ
ఛేదిలు దుర్జన భుజమ్ములు

సురవందిమాగధులు :
జయజయ పర్వత పక్ష విదారీ
జయ జయ వజ్రాయుధ ధారీ
జయ విష్ణు కృపామృత వర్ధనా
జయ జయ వృత్రాసుర మర్దనా

దేవసైన్యము : సురలము సురలము మేము
మంచికి గురులము మేము
చెడుగును నుడుపగ పోరు, అ
సురుల మమరులము మేము

(ప్రజాఘోష - దుందుభి కాహళులు - దేవసైన్యములు జైత్ర యాత్రకు పోవును.)

అసురసైన్యము :
శరభశరభ శ్శరభశ్శరభ
సురలతో ఆజన్మ వైరము మాది
అసురులను మేధావి బిరుదము మాది
సురల ధర్మము రూపుమాపి, అ
సురుల ధర్మము జగతి చాటగ,
సురలతో ఆజన్మ వైరము మాది,
అసురులను మేధావి బిరుదము మాది,
శరభ శరభ శ్శరభ శ్శరభ

అసురాధిపుడు : (బృందం వంత) :
అసురాధిపతి నేనెగా,
అవిధాతయును నేనెగా అలల లలలల లలల లలల
కానిపించెడు దెల్ల తథ్యము
కానిపించని దెల్ల మిథ్య అలల లలలల లలల లలల
కానరాని విధాత లేదు,
కాననగు నేనే విధాత, అలల లలలల లలల లలల
ఎల్ల జగముల కెల్ల సృష్టికి
ఏనె నేనె ప్రభుండగా, అలల లలలల లలల లలల

అసుర సైన్యము :

జయ జయ దానవనాయక ;
జయ జయ లోక విధాయక ;
జయ అపహృత సురకీర్తి ;
సకల భువన చక్రవర్తీ ;

(యుద్ధ ఘోషలు, దేవదానవుల యుద్ధము)

కథాకథన బృందగానం :

హోరా హోరిగ పోరాట మ్మాయె
దేవాసురులకు ఘోరసమర మాయె
అస్త్ర శస్త్రముల ఆర్భాటమ్ములతో,
బాహాటమ్ముగ బాహాబాహిగను,
దండా దండిగ ముష్టాముష్టిగను,
ఖడ్గాఖడ్గిగ - గదాగదిగాగను,
హోరా హోరిగ పోరాట మ్మాయె,
దేవాసురులకు ఘోరసమర మాయె.

(యుద్ధానంతరము, జయించిన సురసైన్యవాహినులు.)

(రెండో రంగము)

సురబృందము : విజయ విధాతల మేమే
విశ్వవిజేతల మేమే,
సురలము సురలము మేము
మంచికి గురులము మేము
చెడుగును నుడుపగ పోరు, అ
మరులము మరులము మేమే

విజయ విధాతల మేమే,
విశ్వ విజేతల మేమే,

అప్సరోబృందము :

అనంతయౌవన మచల వసంత
మౌనందనవని మాది ;
అజరామర నిత్యజీవనదమౌ
అమృత భాండమే మాది ;
అష్టదిగ్గజాళి కగ్రవరమౌ
ఐరావతమ్మె మాది ;
స్వచ్ఛ ధాళధళ్యమున కుపదయౌ
ఉచ్చైశ్రవమ్మె మాది ;
కామితార్థముల నిచ్చు ధేనువును
కల్పవృక్షమును మావి ;
సుత్రామ సార్వభౌమ కృపాంచిత
సుధర్మాలయము మాది ;

కథాకథన బృందగీతి :

హాహా దళనిపాతధ్వని ;
కఠోరమై ప్రతిరవించె ;
విజయగర్వ మోహాంధత
విఱ్ఱవీగు సురల యెదుట
విశ్వేశ్వరు డాగ్రహించి
యక్షాకృతి దాల్చి నిల్చె ;

ఇంద్రుడు : ఇది యేమి యపరూప
మిది యేమి విపరీత

మెరుగరా దిది యెట్టి
యక్ష స్వరూపమో
ఓయగ్ని భట్టార
కా, జాతవేదుండ
ఎరిగి రావోయి ఆ
యక్ష రూప మ్మెదో

అగ్ని : మహాప్రసాదము మఘవా, మహావిజయ మహి
మాన్విత
ఇదే పోయి యెరిగివత్తు, నెదో యక్షు కల తెరంగు

కథాకథన బృందం :
యక్షాకృతి నిల్చిన విపరీతపు కలరూపు నెరుగు
దీక్ష మెయి, తారసిల్లిన యగ్నికి ప్రశ్నపరంపర ;

యక్ష : ఎవరు నీవు ?

అగ్ని : ఏ నగ్నిని,
ఏనె జాత వేదుండను

యక్ష : ఏ మహిమల నీ ప్రసిద్ధి ?
ఏ ఘనతల నీ ప్రశస్తి ?

అగ్ని : ఈ విశ్వమునందు కలుగు
ఎల్ల వస్తువుల దహింతు

యక్ష : ఒహో, అటులనా, ఏదీ ?
దహింపు మీ తృణమ్మును.

అగ్ని : తృణమ్మునా దహించుట
క్షణాన కోట్లు కాల్పనే

ఉష్ణాని ఊర్చిన జాలదె
సహస్ర జిహ్వుండ నేను

యక్షు : ఒహో, అటులనా, ఏదీ ?
ఉష్ణాని ఊర్చుము, చూతము

(అగ్ని, చిన్న చిన్న కీలలను క్రక్కినట్లు సూచించు సంగీతము)

అగ్ని : నాలుకగా ఒక జ్వాలాకీలను
తేలించితి కాలదేలో తృణము
ఒక కీలా, మరియొక కీలా, ఇం
కొక కీలా నాలుకలై తేలగ
జ్వాలా కీలా మాలిక లెన్నిటి
ప్రజ్వలించినా దహింపకున్నవి
హృదిలో ఒదిగిన దావానలము లివే
కడుపున నడగిన బడబానలము లివే
అగ్ని భూధర శతఘ్ని ద్రవము లివే
అణురూపాస్త్ర ప్రళయజ్వాల లివే

(అగ్ని ప్రళయాగ్నిజ్వాలలుగా విజృంభించి తగ్గిన సంగీతము దానితో సమముగా యక్షుని అట్టహాసము.)

(నిశ్శబ్దము - గాలి చప్పుడు)

కథాకథన బృందం :
లోకోత్తర యక్షాకృతి
రూపము కలతెరగు తెలియనోపడు, సరి ఆ
త్మాపకర్షక పరీక్షను
అవమానము నంది నిలిచె నగ్ని దేవుడే ;
అమర విభుని ఆజ్ఞపైని

అదుగో - వాయు దేవుడు
అహో! మలయలీలలు మరి
ప్రభంజనపు శక్తులు
అన్ని సేకరించుకొని
అరిగె యక్షు దరికి!

యక్ష : ఎవరు నీవు?

వాయు : పవనుండను,
ఏనె వియత్ గమనుండను

యక్ష : ఏ మహిమల నీ ప్రసిద్ధి?
ఏ ఘనతల నీ ప్రశస్తి?

వాయు : ఈ విశ్వమునందు కలుగు
నెల్ల వస్తు లెగిరింతును

యక్ష : ఏమీ, అంతవాడవా?
ఎగిరింతువో ఈ తృణమ్ము?

వాయు : ఉహ్హాని ఊదితి నేని
ఉండునె ఆ తృణ మచట?
ఊరులు వాడలు దేశాల్
పేరున కైనా మిగులవు

యక్ష : ఒహో, అటులనా, ఏదీ
ఉహ్హాని ఊదుము చూతము

(గాలి కొంచెం మెల్లగను, తరువాత కాస్త ఎక్కువగను వీచినట్లు సంగీతం.)

వాయు : ఊపిరి యెంతగ నూదిన గానీ
ఏ పాపమొ, ఈ తృణమ్ము కదలదు,

చలింప చరింప నేనే ప్రాణా
నిల మ్మగుదు జీవుల కది వృథయా ?
మంద మధుర సుమగంధవహుడనౌ
మలయానిలగతి వృథయా ? వృథయా ?
జగమ్ములను కల్లోలము చేసే
ఝంఝాగతులివె వృథయా వృథయా ?
ప్రళయకాల జీమూత ప్రచలత్
ప్రభంజనము లివి వృథయా ? వృథయా ?
విలయ విశ్వ గగనాంతరాళ గో
ళాంతర క్షోభ వృథయా ?

(ప్రళయ ప్రభంజనాలు వీచి తగ్గిన సంగీతము, దానితో సమముగా యక్షుని అట్టహాసము.)

కథాకథన బృందం :

ప్రభంజనుని గర్వభంజనమ్మున
దిగంతరమ్ములు మారుమ్రోగగా
మహాట్టహాసము చేయగ యక్షుడు
మహేంద్రుడు ధృతి వికల మ్మాయె !

దేవతలు : అనలుడు ననిలుడు నట్టిటు లైరి
అరయుము నీవే అమరాధిపతీ
అద్భుతమగు నీ యక్షరూపమెదో !

(యక్షరూపము అంతర్థానమైన సూచన)

ఇంద్రుడు : అరరే, అరరే, అరరే
అద్భుతమగు యక్షరూప
మంతర్థానమ్మాయెను
ఆ స్థలాన శోభమాన వైదర్శన మొసగితమ్మ

ఇందు శిశిర దరస్మితా
హేమవతీ, జ్ఞానదాత్రి
అమృతమూర్తి ఉమామాత
అజ్ఞాన మ్మెడలింపుము

ఉమ : తానే విజయ విధాత
తానే విశ్వవిజేత
మెరపుతీగవలె రెప్పపాటులో
స్ఫురించి దొరకని మహాతేజము! ॥ తానే ॥
బాహ్యజ్ఞానము స్మృతి సంకల్పము
మనస్సు కొసగే పరబ్రహ్మము
సకల జీవులకు హృదంతరాత్మ
నిఖిలలోక పూజ్యము పరమాత్మ! ॥ తానే ॥

బృందగీతి : అగ్ని జ్వలింపడు వాయువు వీవడు
తన సంకల్పము లేనిదే,
ఇంద్రుం డేలడు జగములు గ్రాలవు
తన సంకల్పము లేనిదే! ॥ తానే ॥
నేనె కర్తనని, సకల ఫలములకు
నేనె భోక్త ననుకొనిన భ్రమ!
తానె కర్త భోక్త సకలమునకును
నేను నీవులు నిమిత్తములే; ॥ తా ॥

విశ్వవీణ

(గ్రీసు దేశపు పౌరాణిక గాథలలోని వైణికుడు ఆర్ఫియస్ జీవితగాథ)

-: విశ్వవీణా సంగీతము :-

కవి : విశ్వవీణారవ విస్మృత మాధురులు
వినువీధుల ప్రసరించెన్
విశ్వజీవజాల మీ్మ వేళను
విమోహిత మ్మనిపించెన్ ;
స్థలమున జలమున సమీరణమ్మున
అనలాకాశములందున్
సదా ధ్వనించుచు కదలుచు ప్రాకెను
విశ్వవీణా మధురవము......

:- సంగీతము :-

బృంతగీతి : విందము, విందము రారే, వీనుల
విందౌ విశ్వవీణ ; రారే
విందము విశ్వవీణ ; వీనుల
విందౌ విశ్వవీణ ;

:- సంగీతము :-

మోగించు విశ్వవీణ ; వైణికా ;
మోగించు విశ్వవీణ ;
రాగమాధురికి సమ్మోహితులయి
సాగివచ్చు సకల జీవతతులివె

మ్రోగించు విశ్వవీణ; వైణికా;
మ్రోగించు విశ్వవీణ;
శిశిర హేమంతములలో మోడుల
చివురింపజేసె నే వీణ?
నిత్య వసంతముగాగ వనలతల
నిగుడించె పూల నే వీణ?
మ్రోగించు విశ్వవీణ; వైణికా;
మ్రోగించు విశ్వవీణ;

-: విశ్వవీణా సంగీతము :-

(ఈ పాటలో ఎడమవైపు భాగము, కుడివైపు భాగము ఒక ఆవృతం వ్యవధిగా ఒకదానివెనుక నొకటి ఎత్తుకొని పాడాలి)

వైణికుడు—	బృందగానము—
మధుర వీణనే	
మ్రోయింతునే;	సమ్మోహితాలా
	సకలజీవాళి;
సుధాఝురులనే	
కురియింతునే;	మాధుర్యవీచిలో
	మధుర భావాలలో
సుందర ప్రకృతికి	
వందనములనిడి	నందిత హృదయ
	స్పందనమ్ములో
సుఖస్వప్నముల	
స్మృతిలహరులతో	వివిధవర్ణముల
	విశ్వరూపముల

సురుచిర గానము
సృజియింతునే ; సృష్టి సృష్టితో
తనియింపవోయీ
మధురవీణనే
మోగియింతునే సమ్మోహితాలౌ
సకలజీవాళి...

-: సుందరి రాగాలాపన :-

బృంద : శ్రవఃపేయ సౌందర్య శిల్పి
ఓ వైణికా ; ఓ వైణికా ;
నయన పర్వ సౌందర్యవతి ఇదే
సుందరి ; ఇదె సుందరి ;
ఓ వైణికా ; ఓ వైణికా ;
నిను వలచెనోయ్ - ఈ సుందరి.

సుందరి : ఓ
భువన మోహన వైణికా ; నా
హృదయనాథుడ నీవెకా ; నా
తనువు తనువో ; మనసు మనసో ;
తరుణ సుందర ; భవ్య వీణా
తన్మయములై పోయెనోయ్, చే
కొనుము నను నీదాననోయ్...

వైణికుడు : నీలనీరదాంచలాన తేలే శంపాలతవో
కాలసాగరాన వెల్గు నారువోయు పూర్ణ శశివా ;
నారీ ; మనోజ్ఞరూపకిశోరీ ; మన్మనోహారిణి

నా సౌందర్య పిపాసయె నీ రూపము ధరియించెనో ;
నా వీణాగాన తపస్సే నీవై ఫలియించెనో ;
నారీ ; మనోజ్ఞ రూప కిశోరీ ; మన్మనోహారిణి ;

బృంద : ఇరువురి కన్నుల కొలుకుల
ప్రణయపు వెన్నెల వీవలు
కొనలుగ సాగుచు పెనవై చికొనె ;
ఇరువురి హృదయాంతరముల
ఎసగెడు కోర్కుల తరగలు
ఝరులై పొంగుచు దరిచేరుకొనె ;

వైణికుడు : ఏతంత్రి నీ మధుర హృదియో
సుందరి : ఏమోగిత నీ హృదయగీతియో ;

ఇద్దరు : ఈ విశ్వవీణ తంత్రుల జంట మన హృదయయుగళి ;
మన రాగసాగర తరంగమే యీ విశ్వ సరణి ;

వైణికుడు : నీలోన కాంచెద ననంత విశ్వ ప్రకృతి శోభలు ;
నిత్య నూతన వర్ణ నిరవద్య సౌందర్య రేఖలు ;

సుందరి : నీయందె విందు విశ్వాత్మ సృజనానందగీతి ;
ఉభయ సంధ్యల లయాన్విత రాగయుత లాస్యరీతి ;

ఇద్దరు : మన హృదయతంత్రి మ్రోగించు మంత్ర
మీ విశ్వ వీణ పలికించు వాణి ;
ఈ విశ్వవీణ నినదించు ప్రణవ
మే, మనదు బ్రదుకు నడిపించు ప్రణయ
మే !!......

బృందగానము: కన్నుల కొలుకుల వెడలిన
వెన్నెల తీవల విరిసిన
ప్రణయము ప్రణవమ్మై నినదించె,
దెసదెస మ్రోగు ప్రణవమున
ప్రసవభరాలస ప్రకృతియె
ప్రణయ తరంగితయై నర్తించె;

(దృశ్యాంతరము)

సన్యాసి : ఎవరున్నా రీ లోపల ? ఎవరమ్మా ఎవరు ?
ఆకలి గొని వచ్చిన అభ్యాగతి కొక్కింత భిక్ష

సుందరి : స్వామీ స్వాగతమిదె, తమ
రాక చేత మాగృహమ్మ
దెంతో పావనము ;

సన్యాసి : చల్లని పల్కుల స్వాగతమ్ము మా
యుల్లము నలరించినదో సుందరి ;
ఏల జాలి నిన్ను చూడ మాయెద ?
ఎరుగవేమొ కలుగబోవు నాపద ;

సుందరి : ఆపదయా ; - ఎవరి కది ?
తామెవ్వరు స్వామీ ; తమ
దే దేశ మ్మెరిగింపరొ ;

సన్యాసి : భువనమోహినీ ; సుందరీ,
భిక్షుకమాత్రుల మేము ;
మాదొక దేశమని యేమి ?
జగమె యిల్లు జడదారికి ;

నిత్య నిస్వనితమైన నీ ప్రియు వీణాగానము
నేడు వినంబడదదేల ? - నీ గృహాన నీరవతా ?

సుందరి : (అర్థోక్తిలోనే)
మా సేమము కోరు గురులకు
ఆసనమ్మదే అతిథి వరులకు ;
ఎరుగ నటంచును, ఆపద యంచును
ఏమో అంటిరె – ఏ మే మది ?

సన్యాసి : దాని కేమిలే, ఎంత హాయి ఇట ;
కాని పాప మేకాకిని నీ కిట
ఏమి లాభమో ప్రియు నెడబాపు ;
ఎన్న డెందుకతనికి పై చూపు ?

సుందరి : ఏమి మాట లివి - యతివరులేనా ?
ఎందుకు పలుకుదు రిది నిజమేనా ?

సన్యాసి : ఒకమా టడిగెద, నులుకక పలుకు ;
సుకమేకద మీ దంపతి బ్రతుకు ;

సుందరి : మా దంపతులకు ప్రణయమె బ్రతుకు,
మా దంపతులకు వసుధయె స్వర్గం,
వసుధా, ప్రణయం, బ్రతుకూ, స్వర్గం
వలల్లితే సృష్టికి ప్రతి సృష్టి ;

సన్యాసి : నిన్నుబోలు సౌజన్యరాశి, వే
రెన్నడైన పలుకంగ బోదులే ;
నీ సౌఖ్యమె కోరెదు వాడగుచో
నీ ప్రియు డిటు నిను విడి చననేలా ?

సుందరి : నిశాప్రశాంతత నిభృతారుణిమల
ఏ సంగీతపు ఆవేశమ్మో
తన్ను లేపగా నిద్రాలసనౌ
నన్ను లేపకే పోయి యుండును -
ఏ నదియొడ్డునో, ఏ వనమునకో
ప్రకృతి శ్రుతి తనగీతి వినుటకై !...

సన్యాసి : ఎంత యమాయిక వెంత బేలవు ?
ఎరుగవేమొ మగవారి తీరులను,
ఏల యీ వృథా సమర్థింపులు ;-
నిత్య నూతన ప్రియులు శిల్పులు ;

సుందరి : ఆపండీ యప్రస్తుత వాదము -
ఆతిథ్యమ్మే విస్మరించితిమి ;
చందనమ్మిదే, చామరమ్మిదే,
కందమూలములు, పువ్వుదేనె లివె ;

సన్యాసి : అన్ని అందినవి ఆదరోక్తితో—
అప్రస్తుత మీ ఆతిథ్యమ్మే ;
నీ ప్రియు డాపద నీల్గిన సంగతి
నీ కెరిగింపగ వచ్చితి సుందరి !

సుందరి : ఓ తపస్వి - నిజమేనా?- నా ప్రియునకె ఆపదయా ?
చేత వీణ, నోట పాట కన్నారా ? - విన్నారా ?
ఆపన్నుం డతడేనా ? - ఓ తపస్వి - నిజమేనా ?

సన్యాసి ; ముగిసిపోయెనంతా, కను
మూసి తెరచు నంతలోనె

వీణ మునిగి, తాను మునిగి
పాట మునిగి, పడవ మునిగె ;

సుందరి : లేదు, లేదు, మునుగలేదు
మీ పలుకులు నిజము కాదు ;
మునుగలేదు తనదు వీణ, మునుగలేదు నా ప్రియుండు
మునుగలేదు ప్రియుని పడవ ; మునుగలేదు
ప్రియుని పాట !

సన్యాసి : అల్పాయుష్కుని మాట కేమిలే,
అధిక శక్తిమంతుడ నను చూడుము ;
అదిగో వాహన, మ్మదె మన దేశము ;
పద తేలింతును స్వర్గభోగముల !

సుందరి : ఛీ ఛీ ఛీ ! పోవోయీ ;
నీచాత్ముడ వీ వెవరో ;
చంద్రహాసమున నీ తల
ఖండింతును కదలవేని !

సన్యాసి : వదలు వదలు మాయుధమ్ము
వదలవు ? అవురా, తెగింపు ;
వదలితి నిదె మంత్రితమ్ము
కాలకూట భుజంగము !

(సుందరి ఆర్తారావముతో నేల కూలుతుంది. సన్యాసి మాయమవుతాడు.)

బృందగానం : రాలె నదే సుమలతికా ;
తూలె నవే తారకలు ;
క్రుంగె నదే వసుంధరా !
కూలె నవే కుధరాలు !

ఆర్తారావము చేసెను అఖిల విహంగాలు...
హాహాకారము చేసెను అఖిల వన మృగాలు ;
విషాద మూర్ఛనలు మ్రోగె వీణా తంత్రులలో
వియోగ ఝుంఝులే రేగె వైణిక హృదయములో !

వైణికుడు : ఎందుపోయెను నీదు ప్రాణము
సుందరీ నా సుందరీ !
ఎదుట నుండియు మారుపలుక
విదేటి న్యాయము సుందరీ !
మందభాగ్యుడ నిన్నొకతె గృహ
మందు వదలితి సుందరీ !
ముందె తెలియగనైతి నీ గతి
మోస మగునని సుందరీ
ఏల నా కిక వీణయును గా
నమ్ము నా కిక నేలనో ;
ఏల నాకిక ప్రాణములు, నీ
వే గతింపగ సుందరీ !
నిను హరించిన సర్ప విషమే
నన్ను కూడ హరింపదో
నిన్ను జేరగ వత్తు నిదె, ఓ
సుందరీ ; నా సుందరీ !

బృందగానం : విడువకుమోయీ, వీణాగానము
వైణికా ; ఓ వైణికా !
విడువకుమోయీ, ప్రాణాశలనే

వైణికా, ఓ వైణికా!
సుందరి చేరగగోరుదువేని
అందుకొనుము నీ వీణను ;

అమృత వీణతో అందగరానిది
అసాధ్యమైనది లేదోయీ ;
మృత్యులోకమున సుందరి జేరగ
నీకే మృత్యు వదేలనోయ్ ;
అద్భుత వీణాగాన మహిమతో
అందని లోకా లేవోయీ !

వైణికుడు : వీణా! ప్రియవీణా !
సారింతును నీ తంత్రుల - తేలింపుము వినువీథుల
వీణా ; ప్రియవీణా ; నా వీణా; ప్రియవీణా ;
జనన మరణముల సీమాంతములకు వడిపోనీ ;
నీ నాదమహిమతో నను లోకాంతములకు పోనీ;
వీణా ; ప్రియవీణా ;
వాయువేగ మనోవేగములు చాలవు వీణా ;
ప్రేయసి పోయిన లోకమునకు వేగము పోనీ ;
వీణా ; ప్రియవీణా ; వీణా ; ప్రియవీణా ;

(లోకాంతర గమనము సూచించు సంగీతము)

బృందగానము :

మృత్యులోకమిదే, దుష్కర మృత్యులోకమిదే ...
వచ్చుచు పోయే
చచ్చిన జీవుల

నీడల జాడల
చీకటి దారుల
మృత్యులోకమిదే ; హాహా, మృత్యులోకమిదే ;
తీరని కోర్కుల
ఆరని దాహపు
బాధల నలిగే
ప్రాణుల మూల్గుల
మృత్యులోకమిదే ; ముష్కర మృత్యులోకమిదే ;
పాపపు బ్రతుకుల
బంధనముల విడి
కూపపు గోతుల
గోండ్రిపుల బడు
మృత్యులోకమిదే, హా, హా, మృత్యులోకమిదే,
నిప్పుల కోరల
మంటల నాల్కల
కత్తెర బోనుల
గాన్గులపీన్గుల
మృత్యులోకమిదే ! ముష్కర మృత్యులోకమిదే !!

:- మృత్యులోక సంగీతము :-

ఒకగొంతు : మృత్యులోకం దద్దరిల్లి
పోతోంది కొంత సేపటినుంచి...

ఇంకొకగొంతు :
అవునవును. భూమీ గోళాలూ
కంపించడం విన్నాం గాని

మృత్యులోకం కంపించిపోవడం
ఎరగం, ఇదివరకు...

ఒకగొంతు : కొన్ని క్షణాల క్రిందట :
ఈ చీకటిలో కొన్ని ఛేదించుకుని
అఖండమైన వెలుతురు కిరణం
ఒకటి వచ్చింది. దానితో
ఈ లోక వాసు లందరికీ
కళ్లు కావిరులు కమ్మేశాయి.

ఇంకొక : అంతేనా? ఆ వెనువెంటనే
ఒక అపూర్వ నాదం - ఆ నాదం
వినలేదూ నువ్వు?

ఒక : విన్నాను. విన్నప్పటినుంచీ
మర్త్యలోకంలో ఎప్పుడో
వదిలివేసిన హృదయము
నా రాతి వక్షములో మళ్లీ
మెదలినట్టయింది.

ఇంకొక : అందుకే కాబోలు నాకు కూడా
ఈ లోకంలో ఎన్నడూ కలగని
ఆరాటం కలిగింది............

మూడోగొంతు ;

ఏమిటీ. మీకూనా? మన
లోకాధిపతి మృత్యుదేవతే

అల్లాడిపోతే మనవంటివారి
మాట చెప్పనా యిక...

ఒక : ఏవిటీ - మృత్యుదేవతే ?

ఇంకొక : మృత్యుదేవతే చలించిపోయారా ?

మూడో : అవును. మొన్న సర్పదష్టయై
మన లోకానికి వచ్చిన
సుందరి లేదూ ? ఆమె ప్రియుడు
మ్రోగించే విశ్వవీణే
ఈ సంచలనానికి కారణమట

ఇంకొక ; ఆ సుందరి ప్రియుడా...
అంతటి అద్భుత వైణికుడా అతను ;

మూడో : అవును. ఆ విశ్వవీణా
మహిమ వల్లనే అతను మర్త్య
లోకం నుంచి బొందితోనే
ఇక్కడికి రాగలిగాడు
మన లోకపు చీకట్లను
ఛేదించి వేసిన వెలుగతనిదే.

ఒక : ఏడీ - ఇప్పుడెక్కడున్నాడతను ?

మూడో : మృత్యు దేవత సన్నిధిలోనే
అదుగో - అలా వెళ్లారంటే
ఆ ఛాయావరణం వెనుకనే
మృత్యు దేవత కొలువు తీర్చారు.

(ఈ పాట ఎడమ, కుడిభాగములను ఒక ఆవృతం వ్యవధిలో ఒక దాని తరువాత వొకటి ఎత్తుకొని పాడాలి.)

(సంగీతము)

మృత్యుదేవత :	గాయకబృందం :
తేజోమూర్తీ; దివ్య వైణికా ;	ఓహో దివ్య వైణికా
మా జోహారులు నీకు	జోహారులివే వైణికా ;
ప్రాణము పోయిన మర్త్యజనులకే	
ప్రవేశ మీ లోకమునందు ;	
సజీవిగామము చేరగ జాలిన,	ఓహో సత్వమూర్తీ ;
సత్వమూర్తీ ; ఓ ప్రణయ తపస్వీ ;	ఓహో ప్రణయతపస్వీ...
మంజుల వీణారుతిచే జగముల	
మైమరపించిన మోహన శిల్పీ ;	
కోరుకొనుము ; ఏ వరమైనా, నెర	
వేరునులే, సంకల్ప మాత్రమున ;	

వైణికుడు : నమోవాకములు మృత్యుదేవతా ;

నా ప్రేయసి నా కిమ్ము ;	బృందం :
నా వీణారుతి విన్న జగములకు	నీ వీణారుతివిన్న జగములకు
ఏ వంతయు లేదని వర మిమ్ము	ఏ వంతయులేదని వర మోయీ

మృత్యు దేవత : ఇదిగో నీ సఖి సుందరి గొనుమా ;

హృదయారాటము మానుమా ;	బృందం :
విశ్వవీణతో విశ్వమంతటిని	విశ్వవీణతో విశ్వమంతటిని
విమోహితమ్మొనరింపుమా...	విమోహితమ్మొనరింపుమా ;

(బృందగానము)

(విశ్వ వీణా సంగీతము)

బృందగానము :

విశ్వ వీణారవ విసృత మాధురులు
వినువీథుల ప్రసరించెన్
విశ్వ జీవజాల మ్మీ వేళను విమోహిత మ్మనిపించెన్ ;
స్థలమున జలమున సమీరణమ్మున అసలాకాశములందున్
సదాధ్వనించుచు కదలుచు ప్రాకెను విశ్వవీణామధురవము !!

(విశ్వ వీణా సంగీతము)

'స్వైరిణి అన్నారు నన్ను'

"తనువు గృహంబునందునను ధ్యానము వేరొక దిక్కునందు నుం
చును, స్వసుఖంబు లేశమును జూడదు, నిద్దురబోదు మానహా
నిని భరించు, నుర్వి జననిందకు గేలికి జంక దిట్టి కూ
ర్మిని ప్రకటించు స్వైరిణిని మించును భక్తుడు దైవభక్తిలోన్!"

—పానుగంటి

(గానవారిధి - ఆది)

బృందగీతి : కదలిపోవు నదే యెవ్వారో
కాదారి చీకటి సైదోడు లేకయే॥
వెదరు పొదల మెదలు గాలి యూలలె
వేణునాద మని అదరిపడి ఉరికి ॥కదలి॥
నీలి మేలి ముసుగు తేలియాడ, త
మాల తరుల వెనుక వెనుక తారుచు ॥కదలి॥
ఈడ ఆడ నీడ లేవి ఆడిన
వాడె రాధికా వరుడని పరువిడి ॥కదలి॥

వ్రజభామిని : ఒహోహో కనరే, లజ్జా
విహీన ఇలువీడి యేగు విటరాయనికై
ముహురవలోకిత దిశయై
రహస్య కేళీవనాంతరాళము చేరగ

(ఆభోగి - ఆది)

వ్రజబృందం : మనకేనా యీ కనుగంత ?
ఎరుగమదే యీ వలవంత ? ॥మనకేనా॥

కనుమసకా చీకటిలో
తనమగనీ కను మలిపీ
పరపురుషు పరాత్పరుడంటూ
తరలిపోవు యీ జగజంత ॥మనకేనా॥

తానేమో జీవాత్మయట
తనమగడనిత్య దేహమట
తనప్రియుడు లోకప్రియుడంట
తన అభిసరణ పురాణమట ॥మనకేనా॥

వ్రజభామిని : మనములు సంకుచితములట
మనలవి, మనకందడంట, మధుమురళీమో
హనుడు, వినుడల్లదే రా
ధను పిలిచెడి ప్రణయకుంజధామము చేరన్॥

(వేణునాదం - రాగాలాపన)

(చతుష్కలాపతి - రూపకం)

కృ : రాగదే - రాధికా ! ॥రాగదే॥
ఆగమవిహితానురాగ
నింగి నీలి మబ్బు తెరగ
నీకొరకై వేచితి, అ
నంగఖేద మూగదే, అ
నుంగు మెరపుతీగవై ॥రాగదే॥

యుగయుగాల యువమనోజు
నిగ, నే పిలువగ రావో
జగదేక విమోహనాంగి
విగ, నా కౌగిలి తూగవా ॥రాగదే॥

రాధ: నిను జేరగ శ్రమదీరెను
ముని మానసవంద్య, శ్యామ మోహనరూపా,
నను గేలిసేయు వ్రజభా
మినులకు నే ననిన కనుల మిరుమిట్లేలా ?

(పీలుకాఫి - ఆది)

నను చూసీ, నవ్వేరే,
నా సఖులీ వ్రజభామినులు ! ॥నను॥

చెవిచాటూ చెయి చేర్చి,
కొసరే రేవో గుసగుసలు,
నాపైనీ, నీపైనీ,
ఓపలేక అల్లిన కథలు ! ॥నను॥

పొద దాటీ, నది దాటీ,
కదిలే వేణురవము పడిలో
ఈగుండే, యెటులాగు,
రాగతరంగిణి పెనుసుడిలో ! ॥నను॥

తనువులకే, పరిమితమా,
ప్రణయమ్మని యెంచేవారే,
తమగుండే, యిరుకులలో,
నలుగుడువడి నవ్వేవారే !

కృ : ఎవ్వ రహమ్ముతో నెన్నడు క్రొవ్వి
యుందురో వారిలో నుండదు ప్రేమ !
నవ్వితే నవ్వనీ, నొవ్వకు మెదను,
నీప్రేమ వడి ముందు నిలుతురే వారు ?

(రాగేశ్వరిమిశ్ర—రూపకం)

రాధ : స్వైరిణి అన్నారు నన్ను
శ్యామసుందరా !
నీరవనిశి వెన్నెలలో
నీదు మధుర మురళీ రవము
ద్వారములను తెరచి
ప్రతి హృదయము పిలుచు నిలువనీదె ॥స్వైరిణి॥

స్నానసమయమున యమునా
సరిత్తటిని సఖీజనులు
నిన్నుజూచి మైమరచిన
నన్నుజూచి నవ్వినారు ॥ స్వైరిణి ॥

బంధువులను, పతిని సకల
బంధములను వదలివైచి
బృందావని నీదు రాగబంధ
మొదవ తరలితినని ॥ స్వైరిణి ॥

(జయజయవంతి—రూపకం)

కృ : మనసౌనే ఓ రాధా !
మరల వేణువూద,

ఘన శ్యామసఖీ, శంపాం
గనవై నర్తింపరాద ॥ మనసౌనే ॥

మందలోని గోవులు మై
మరచి మోరలెత్తి చూడ,
బృందావని కడప గడప,
అందెలు ఘల్లుమని యాడ,
చిందు లలరు పదములు కా
ళిందీ తటమందు కూడ,
సుందర గోపీమండల
మందు నిలిచి నీవు పాడ ॥ మనసౌనే ॥

ప్రతి నయనద్వయి నాపయి
ప్రణయామృత ధార కురియ,
ప్రతి యెడంద నవ విద్యు
ల్లతయై నా హృదయ మొరయ,
ప్రతి వనమ్ము ప్రతి కుంజము,
శ్రుతి లయాన్వితమై విరియ,
ప్రతి స్వరమ్ము ప్రతి మూర్ఛన,
ప్రణవ మంత్ర మౌచు మొరయ ॥ మనసౌనే ॥

(రీతిగౌళ—ఖండగతి)

రాధా కృష్ణులు :

మన ప్రేమ మెవ రెరుంగుదురో ప్రియతమా
మన ప్రేమ మెవరెరుంగుదురో ॥

రాధ : నాదరూపుడ వీవు ;

కృ : నాదు గీతిక వీవు ;

రాధ : నారాయణుడ వీవు ;

కృ : నాదు లక్ష్మివి నీవు ! మన ప్రేమ ॥

రాధ : నీల మేఘుడ వీవు

కృ : నిభృతశంపవు నీవు

రాధ : ఆది పురుషుడ వీవె,

కృ : ఆది ప్రకృతివి నీవె !

రాధా కృష్ణులు ;

మన ప్రేమ మెవరెరుంగుదురో ప్రియతమా

మన ప్రేమ మెవరెరుంగుదురో ॥

శాంతిపథము

(రంగస్థలంపైని సగం వెలుతురూ సగం చీకటీ - నడుమ తిరుగుతూ ఉండే పెద్దభూగోళం - ఆభూగోళపు మధ్యరేఖను అంటిన చాందినీపైని బృంద గాయకులు; తరువాతి దృశ్యంలో వెలుగు చీకటి తెరలలో నరుడూ. నారీ, ఆ తరువాత కొన్ని దృశ్యాలు పాటలలోనివి బ్యాక్ ప్రొజెక్షన్‌ద్వారా ప్రదర్శించ వలసి ఉంటుంది)

బృందగానం : గిరగిర తిరిగే భూగోళం!
ఇరులు వెలుతురూ సమపాళం!
ఏది ఆదియో ఏది అంతమో
ఎరుక కందదే యీ ప్రకృతి!
సగము వెలుతురై సగము చీకటై
జగతి సాగునే తన ప్రగతి!

గతము నిరులలో కలిపివేసి, ఆ
గతములోని వెలుగానచేసి, ప్ర
స్తుతము పవలు రే వెలుగు చీకటుల
అతికికొంచు పయనించు నీ జగతి!

యంత్రగరిమ విశ్వమేల గోరుటొ
మంత్రమహిమ నాత్మ తేలగోరుటొ
ఏది అగతియో ఏది ప్రగతియో
ఎటకు సాగునో యీ జగతి!

ఎన్ని తారకలో ఎందరు సూర్యులో
ఎన్ని విశ్వములో ఎంతటి అవధో
ఎంత చీకటో ఎంత వెలుతురో
ఇంతకును మనిషికేది గమ్యమో !!

నరుడు : సనాతనవువలె కనిపింతుగదే వనితా ! నీవెవరోహో !

నారి : నీ సనాతన ప్రకృతినికాదా! నరుడా నినునీవెరుగవాహో!

నరుడు : నిభృతమాయా నిద్రితుడను నే కృతజ్ఞుడను
మేల్కొలిపిన తరుణీ !

నారి : ప్రభుడవీవేకావో ప్రకృతికి, నీ కేమరపాప్రణయాభరణా !

నరుడు : ఇతరులిచ్చు గురుతేకద ప్రభుత ! నాకెన్నిమారులుకలిగె
అవశత !

నారి : స్మృతికి తెచ్చుకో నీ గతచరిత ! నీ యెరుకవలనె
కలిగెను ప్రభుత !

స్త్రీ బృందం : తెరలు తెరలు వెలుగువెంట
వరలి పెరుగు ఎరుక !

పురుష బృందం : పొరలు పొరలు ఇరుల నడుమ
మరుగుపరచు మరపు !

స్త్రీ బృందం : ఎరుక పెరిగి మనికి పెరిగి
ఎసక మెసగు ప్రగతి !

పురుషబృందం :
పొరపు, ఈసు, మమత పెరిగి
పోరులొసగు అగతి !

నారి : నరవర ! పురుషోత్తమ ! నే
ధరాతరుణి ! నీ ప్రకృతిని, తావకజనతా
గురుతర పరస్పర ద్వే
షరాగఖర ఘర్షణములు సహజ ప్రకృతుల్ !

నరుడు : నరుడ, ధరిత్రీ, సుకవీ
శ్వరుడను యుగధర్మముల ప్రవక్తను ! నాకే
చరితను గడచిన పుటలను
తిరిగి తిరిగి చదువ మిగుల దిగులే కలుగున్ !

నరుడు : నడవని చోశెల్ల నడుస్తా,
మడిచిన అంగుళినె మడుస్తా !
వడి తిరిగే విశ్వంలో
సుడి తిరిగే విశ్వంలో !

బృందం : సారె సారె కదే రీతి !
ఆశాభంగపు టనుభూతి !

నరుడు : కడ గనని పయనాలలో
కడిచాయి యుగాలెన్నో
తడబడే చరణాలతో
కడలనే నయనాలతో

బృందం : నెలకొనని శాంతికై
వెదకుటలో
కనబడని కాంతికై
అరయుటలో

నరుడు : ముడివడిన చిరుపాటతో
ముడిలేని యెద మూటతో
తడివడిన కనుల సొదతో
తడిలేని పెదవి రొదతో !

బృందం : ప్రతి యెడద నలరించు
ప్రేమముతో
భువియెల్ల దివిచేయు
నీమముతో !

నారి : కడచెను సామ్రాజ్యమ్ములు
కడచెను సంస్కృతులు కాలగర్భ గతములై
వడపోసిన విజ్ఞానమె
అడుగడుగున పుడమిమ్రింగు హాలాహలమై !

నరుడు : దురహంకృతియు, నియంతృత,
పరపీడాపరత, ఈర్ష్య, పగలున్ తెగలున్
అరిషడ్వర్గమ్మైన నా
కరయుకొలది శాంతిపథము నందక యుంచున్ !

బృందగానం : వెలుగు పాయో చీకటి చాయో
తెలియకే పైబడు విధిచేయో !
యుగయుగమ్ములు కిందై మీదై
జగతి నలలై అలమేమాయో ! ॥ వెలుగు ॥
వర తపోవన గురుసందేశం,
ధరాతలి కది ఆశాలేశం,

దురాశా దానవతారంభం,
ధరా పురోగతికి విలంబం ! ॥ వెలుగు ॥

ప్రణయమంత్ర ప్రవక్తలేరీ !
కనుగొనరె శాంతికి రహదారీ !
సమ్రాట్టుల నిరంకుశతలో
నమ్రమనుజు లెందరు హతులో ! ॥ వెలుగు ॥

విశ్వ రహస్యోన్మీలనలో
విజ్ఞమేథ సంచాలనలో
విదితమౌ పరమాణు శతఘ్ని
విశ్వశాంతికి పెనుదావాగ్ని ! ॥ వెలుగు ॥

నరుడు : హింసామత్త పృథివీ !
ధ్వంసలీలా తాండవమున
తనివితీరుచే లేదో ! ॥ హింసా ॥

సస్యశ్యామలమౌ మృదు
లాస్యము రుధిరమయమాయె
సాంధ్యసమయ మందవీచి
ఝంఝానిల భయదమాయె ! ॥ హింసా ।

భగ్నాశయహా, హృదిలో
అగ్నులేల, ఆర్తులేల,
కఠిన శిలలె ద్రవియింపగ
కలుగు కంపనమ్ములేల ! ॥ హింసా ॥

లేవు మధువన స్వనాలు
ఘోర భయార్తారవాలె
క్రుంగుదువిట, కూలుదువట
నింగి కెగసి రాలుదు వెట ! ॥ హింసా ॥

ఇంకనైన వెలువడవో, భ
యంకర తామసపథాలు
శాంతికాంతు లొలయు అమల
సౌఖ్యవియత్తలి చేరవో !! ॥హింసా॥

నారి : నరుడీవే ! నారాయణ
పరదైవమ వీవె! నీదు ప్రకృతిని నాలో
తెరలా వెలుగు నిరులవలె
వరదైవత్వమ్ము దానవత మను నీలో !
నీలో దానవత నణచి
నీలో నారాయణత్వ నిభృతాణువు ను
న్మీలనము చేసి జగతికి
కాలేవో శాంతికాంతికరుడవు నరుడా !

బృందగానం : నవోదయ మెపుడో దేవా !
శుభోదయ 'మెపుడో !
దవానలకీలలై ద్వేషము రోషము
భువి నిండెగా ! ॥నవో॥

నీతిహీన సంగరాల నంధకార మాయెనే,
స్వాతంత్ర్య భాను డే విహాయసాన దాగెనో,

క్రూర మారణాయుధాల ఘోర భయద నర్తన
ఉదార జీవితాశయాల స్వేచ్ఛావికర్తన ! ॥నవో॥

ఆరాటమ్మే ప్రాణ ధనమ్ముల
కరచేతులలో నను క్షణమ్ము
తీరని పర్యవసానపు పోరాటమ్మో
సదసత్తుల కనిశమ్ము! ॥నవో॥

ఆశోద్ధతులై జగముల
హతమొనరించే అసురుల
ఉసురుల గొనవో,
తరుగని నీదయ అమృతలహరులై
ఝురులై కురియగ మేమరయుదుమో ! ॥నవో॥

నరుడు : వెలుగు చీకటులటు, విడరాని జంటలు
సౌఖ్య దుఃఖములును, సత్తసత్తు !
ప్రేమ, మత్సరమ్ము, మృత్యువు నమృతత్వ
మటులె ద్వంద్వగుణము లవి ప్రకృతికి !

నారి : వెలుగు చీకటు లటు, విశ్వప్రకృతి యందు
మంచి చెడుగు లనుభవించు నరుడు ;
చెడుగు మరపుతెరల అడుగున బడవైచి
మంచివైపు చనుట మాన్యపథము !

బృందగానం : ద్వేష ముడిపి రాగ మొందజేయు నెదో
అదే, అదే శాంతిపథం !
శోక ముడుగ సౌఖ్య మొందజేయు నెదో
అదే, అదే శాంతిపథం !

అసత్తునుండి సత్తు నంద జేయు నెదో
అదే, అదే శాంతిపథం!

తమము గడిపి జ్యోతి నంద జేయు నెదో
అదే, అదే శాంతిపథం!

మృత్యు వెడపి అమృతసిద్ధి నొసగు నెదో
అదే, అదే శాంతిపథం!

సత్య సుందర శివ స్వరూప మేదో
అదే అదే శాంతిపథం!

ఓం శాంతిః శాంతిః శాంతిః

అనుబంధము

[విశ్వవీణ నాటకములో 137 వ పుటలో 18 వ పంక్తికి తరువాత చదువుకోవలెను]

బృందగానము : | వైణికుడు : (ఆలాపనగా)

చూడ చూడ దగ్గరై | నావీణరుతి
చూడ చూడ దూరమై | లోకాంతరగతి
జరిగిపోవు కరిగిపోవు | ప్రియాప్రాణవసతి
శత శత గోళాలు ! | పద పద శీఘ్రగతి!

చూడ చూడ పెద్దవై
చూడ చూడ చిన్నవై
సురిగిపోవు మరగిపోవు
జ్యోతిర్మండలాలు !

చూడ చూడ వ్యాప్తమై
చూడ చూడ లుప్తమై
తరలిపోవు మరలిపోవు
తమోంతరాళాలు !

వైణికుడు : నావీణరుతి మ్రోయగా త్రోయగా
నీ ధ్యానమే భావమై రాగమై
నీ దారి నా ధ్యేయమై లోకలోకాలు
తిరిగేటి చరణాల గతి తాళమై
ఎలెత్తి విన్పింతు నిదె నా హృదయవాణి,

ఏలోకమం దుందువో విందువో రాణీ!

నా వీణరుతి మ్రోయగా!

వేలావకాశాల కెదురీతలో

గోళాల భ్రమణాల శ్రుతిమోతలో

తేజశ్శలాకాల ఛాయాంధ తమసాల

ఆజాను హస్తాల మెలివేతలో

ఎత్తెత్తి విన్పింతు నిదె నా హృదయవాణి,

ఏ లోకమం దుందువో విందువో రాణీ!

నా వీణరుతి మ్రోయగా!

(ముఖపత్ర చిత్రమందలి దృశ్యము ఈ ఘట్టములోనిదే)

(దీని తరువాత మృత్యులోక రంగము వస్తుంది)

* * *

[విశ్వవీణ నాటికలో 141 వ పుట అయిన వెంటనే చదువుకోవలెను]

బృందగానము :

రాగాన్విత హృదయవీణ
యోగమహిత విశ్వవీణ
క్వణక్వణన మాయె నదే! వినవో అదె తిరిగి!

మ్రోగు వీణ కేల చాచి
పొంగు ప్రేమ శార చాచి
తన ప్రియతమ పిలిచె ప్రియుడు వినవో అదె తిరిగి!

నిద్రాలస ముద్రాధర
నిమీలితాతులను తెరచి
ప్రాణాన్విత ప్రాణప్రియ కనవో అదె తిరిగి !

వైణికుడు : ప్రేయసీ నావీణ విన్నావో
చైతన్యవతివై
ఓ యపూర్వ సుదర్శనా
లేవో, రావో !
నరకలోకపు టిరుకు చెరలో
నలిగిపోయిన ప్రణయ లతికా !
విధుర వీణా విగళ తంత్రుల
మధు వొలుకు వాసంతికా !
ప్రేయసీ నావీణ విన్నావో !

సుందరి : ప్రియతమా ! నా వీనులకు విందు
నీ మధుర వీణా
అమృత జీవనధార నాయందు చిందు !
నీరవాలస నిభృత చేతన
నారకాపస్మార దశలో
చేరె నమరధునీ తరంగ వి
హారి ధీరసమీరమై !
ప్రియతమా, నా వీనులకు విందు !
నీ మధుర వీణా !

ఇద్దరూ : వ్యథాన్విత తమోమయ సుధాన్విత సుఖాలయ
జగమ్ము మనవీణ ! విశ్వమ్ము మనవీణ !
ఉదాత్తానుదాత్త స్వరాన్విత సుగీతి
మన జీవితపు రీతి ! ఇదె శాశ్వత సుగీతి !

(దీని తరువాత 142 వ పుటలోని గేయము చదువుకోవలెను)

అచ్చు పొరపాటులు

పుట	పంక్తి	ఇలా అచ్చుపడింది	ఇలా దిద్దుకోండి
5	12	ఘలుఘలుమని	ఘలుఘలుఘలుమని
6	చివరిపంక్తి	పొదలనందు	పొదలనంచు
8	12	మృదుకేకారములవే	మృదుకేకారవములవే
11	3	ఝుంఝుంఝుఝుమ్మనుచును	ఝుంఝుంఝుంఝుమ్మనుచును
11	17	కొండంతయోచు	కొండంతయౌచు
17	15	వనంతరజమో	వసంతరజమో
18	14	ఐరానతమ్మ	ఐరావతమ్మ
24	15	క్షీరాదధి	క్షీరోదధి
37	1	మర్మసరణిప	మర్మసరణిచూప
37	14	పొల్పార పడ్జంబుగా	పొల్పార షడ్జంబుగా
41	2	మమ్మునట్టుకొని	మమ్ముపట్టుకొని
41	8	తానేయివ్వుడు	తానేయిప్పుడు
44	3	మానిన మదనుతో	మానినీ మదనుతో
44	15	కష్ణుని వెతుక్కుంటూ	కృష్ణుని వెతుక్కుంటూ
46	9	చాంతరేచాంగనా	చాంతరేణాంగనా
46	11	మండలే మధ్యమం	మండలే మధ్యగః
46	12	సంజ్యగౌ	సంజగౌ
46	13	దేవకీనందన	దేవకీనందనః
47	13	కదిలి నింగికెగయున్	కదిలి నింగికెగయునే
52	21	నైపగాజాల	సైపగాజాల
59	4	కలుగదొ	కలుగదె

పుట	పం క్తి	ఇలా అచ్చుపడింది	ఇలా దిద్దుకోండి
59	17	నళినీదశములు	నళినీదళములు
64	6	ఎడబాసినామో	ఎడబాపినామో
69	13	సురపాన్న	సురపొన్న
75	చివరిపంక్తి	తలుకూలే	తళుకూలే
76	చివరిపంక్తి	చేతనేఫు	చేతనేషు
78	15	తరంగ భింగమతి	తరంగ భంగరుతి
80	14	శాపాపసానమ్మ	శాపావసానమ్మ
80	20	బలదా ఓ బలదా	జలదా ఓ జలదా
81	19	జలధర పరో	జలధరవరో
90	12	అశ్రులు రాలు	అశ్రులు జారు
91	14	మననులోపలి	మనసులోపలి
98	5	మధురశృతుల	మధురశ్రుతుల
98	9	సురిగి తూలెవో	సురిగి తూలేనో
99	12	గాణాంధకార	గాఢాంధకార
101	12	భర్మస్రంకాశినీ	భర్మసంకాశినీ
107	చివరిపంక్తి	దిగ్గిగంత	దిగ్దిగంత
108	8	న ర్తసముల	న ర్తనముల
116	6	అలంక చరిత్ర	అకలంక చరిత్ర
122	8	అష్టదిగ్గజాళి కగ్రవరమా	అష్టదిగ్గజాళి కగ్రసరమా
133	3	(అర్థోర్తిలోనే)	(అర్థోక్తిలోనే)
133	17	వనుధయె	వసుధయె
138	12	గోంద్రిపుల	గోండ్రింపుల
140	5	అవుమ	అవును
141	5	దివ్యనైణికా	దివ్యవైణికా
144	3	ఎరుగమదే	ఎరుగమటే

"నా హృదయమందు విశ్వవీణాగళమ్ము
భోరుభోరున ఈనాడు మ్రోత పెట్టు;
దశదిశాతంత్రు లొక్క సుధాశ్రుతిని బె
నంగి, చుక్కల మెట్లపై వంగివంగి,
నిలిచినిలిచి, నృత్యోత్సవమ్ముల చలించు"

కృష్ణశాస్త్రి